ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు  : fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 20 పేజీలు: 12 వెల: 6.50

మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు

శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

9లో

# మిర్చి రైతులను ఆదుకుంటాం



గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో వర్చువల్‌గా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## కేంద్ర మంత్రితో సాయం కోసం మాట్లాడా..

## అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంవల్లే ధరల పతనం

## పోలవరం నీరు బనకచర్లదాకా తీసుకెళ్లేందుకు కేంద్ర సాయం అడిగా..

## ఢిల్లీలో మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారిని ఆదుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. మిర్చి ధర పతనంపై కేంద్రంతో మాట్లాడామన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి రేట్లు పడిపోయాయి. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో రైతులకు మంచి ధరవచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయి. మిర్చి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.. కేంద్రమంత్రి పర్యటనలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలను వివరించామన్నారు. శుక్రవారం అధికారులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మిర్చి ధరల అంశంపై సమీక్షిస్తారు. అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు.ఈ యేడాది 12 లక్షల మెట్రిక్ టన్నులు మిర్చి సేకరించాల్సి ఉంది...ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ యేడాది రాష్ట్రంలో మిర్చి సాగైంది. ఎప్పుడూ లేనంతగా రేట్లు పడిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 25 శాతం మాత్రమే ఇస్తారు. సాగు ఖర్చులను లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలి. అవన్నీ సరిచేయాలని కేంద్రమంత్రిని కోరాం. దీనిపై సమీక్షా సమావేశంలో చర్చించిన తర్వాత స్పష్టత ఇస్తామని కేంద్రమంత్రి చెప్పారు. ఏ విధంగానైనా రైతులను ఆదుకోవడం ముఖ్య ఉద్దేశం. శనివారం వ్యాపారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ధరల పతనానికి కారణాలు >>2



గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తాచేత ప్రమాణం చేయిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

## రామ్‌లాలా మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారం

## డి.సిఎంగా పర్వేష్‌సింగ్ వర్మ, మరో ఐదుగురు మంత్రులు ప్రమాణం

## హాజరైన ప్రధాని మోడీ, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయె సిఎంలు, ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

## మంత్రులకు వెంటనే శాఖల కేటాయింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** రెండున్నరదశాబ్దాలు దాటిన తర్వాత దేశరాజధాని ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలామైదాన్‌లో జరిగిన భారీ సభలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంచేసారు. లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయేపాలిత రాష్ట్రాల ముఖ్య >>2

## ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు పడింది. ఫైబర్‌నెట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజ, ఫైబర్‌నెట్ బిజినెస్ హెడ్ సురేశ్, ప్రొక్యూర్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి ఆదేశాలిచ్చారు. గత 9 నెలలుగా ఫైబర్‌నెట్‌లో కనీస పురోగతి లేదని ఒక్క రూపాయి ఆదాయం కూడా తీసుకురాలేకపోయామని జివి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎపి ఎస్ఎఫ్ఎల్‌లో సంస్కరణలు చేస్తున్నా అధికారులు సహకరించడం లేదని అందుకే ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు ఛైర్మన్ స్పష్టం చేశారు. సంస్థలో 400 మందిని తొలగించాలని ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోలేదని జివి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల తొలగింపు ఆదేశాలపై ఫైబర్‌నెట్ ఎండి, ఇడి సంతకాలు చేయలేదని, ఉద్యోగులకు జీతాల రూపంలో సంస్థ సొమ్ము చెల్లించారని మండిపడ్డారు. ఫైబర్‌నెట్‌లోని ఉన్నతాధికారులు గత ప్రభుత్వంతో చేతులు కలిపారని అన్నారు. ఫైబర్‌నెట్‌కు జిఎస్టీ అధికారులు రూ.377 కోట్లు జరిమానా విధించారని, కానీ అధికారులు తనకు చెప్పలేదని తెలిపారు. ఈ 9 నెలల్లో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయామని, >>2

# ఇక వడివడిగా పోలవరం

## పూర్తి సాయం అందించడానికి కేంద్రం అంగీకారం

## కుడి, ఎడమ కాల్వల నిర్మాణ ఖర్చు రీయింబర్స్‌మెంట్ అడిగాం

## కేంద్ర జలశక్తిమంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశమైన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్



గురువారం కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ భేటీ దృశ్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ స్పష్టం చేసారని సిఎం చంద్రబాబు తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు ఢిల్లీలో సమావేశమయ్యారు. సమావేశం మంచిగా జరిగిందని సిఎం చంద్రబాబు మీడియాకు వెల్లడించారు. పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చును రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని విన్నవించినట్లు తెలిపారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని తెలిపారు. మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు చేపడతామని వెల్లడించారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి సమాంతరంగా ఇసిఆర్ఎఫ్ డ్యాం పనులు మొదలు పెట్టేలా, అవసరమైన డిజైన్స్, సిడబ్ల్యూసి నుంచి త్వరగా వచ్చేలా సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు త్వరలో పోలవరం సందర్శనకు వస్తానని సిఆర్ పాటిల్ తెలిపారు. గోదావరినుంచి 200 టిఎంసిల వరద నీటిని బనకచెర్లకు తరలించే లక్ష్యంతో చేపట్టిన పోలవరం బనకచెర్ల లింక్ ప్రాజెక్టుకు మద్దతు కోరినట్లువెల్లడించారు. ఈప్రాజెక్ట్ రాష్ట్రాన్ని కరవు రహితంగా మారుస్తుందని తెలిపారు. 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. పరిశ్రమలకు 20 టిఎంసిల >>2

# 24 నుంచి అసెంబ్లీ

## 28నే బడ్జెట్ సమర్పణ

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమవుతోన్నాయి. ఆ క్రమంలో మార్చి 4వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నట్లు తొలుత సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ షెడ్యూల్‌ను కాస్తా ముందుకు జరిపారు. ఫిబ్రవరి 28వ తేదీన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇక ఈ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతోన్న నేపథ్యంలో ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగించనున్నారు.

అలాగే 25వతేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేతీర్మానంపై చర్చ ప్రారంభం కానుంది. అదేరోజు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సిఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీనుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే బడ్జెట్ అంశాలు నిధులకేటాయింపుపై సిఎం చంద్రబాబు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖతో సహా వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు.

## గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

2లో

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

## ప్రాజెక్టుకు మరో రూ. 4వేల కోట్లు అవసరం: మంత్రి నిమ్మల

**విజయవాడ,, ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజక్టు పనులను పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనత గత ప్రభుత్వానిదని, ఆ ప్రాజక్టు పూర్తి కావాలంటే దాదాపు రూ.4 వేల కోట్ల నిధులతో పాటు 2 ఏళ్ల సమయం పడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి త్రాగు నీరు అందజేసే వెలిగొండ ప్రాజక్టు ప్రధాన పనులు ఏవీ పూర్తి చేయకుండా రైతులను గృహనిర్బంధం చేసి పటిష్టమైన బందోబస్తు మద్య ఆ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. శ్రీశైలం వద్ద నున్న హెడ్ రెగ్యులేటరీ, రిటైనింగ్ వాల్ పనులు, మొదటి, రెండవ సొరంగం పనులను, ఫీడర్ కెనాల్ పనులను మరియు నిర్వాశితుల కాలనీల నిర్మాణ పనులను ఏ మాత్రం పూర్తి చేయకుండా వెలిగొండ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. సొరంగం1 లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర రోడ్డును మరియు సొరంగం2 లో 2.00 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిని తొలగించాల్సి ఉందని, అందుకు దాదాపు తొమ్మిది మాసాలు పడుతుందన్నారు. సొరంగం 2లో ఇంకా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ చేయాల్సిన పనులుఉన్నాయని అందుకు దాదాపు ఎనిమిది మాసాలు >>2

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు



గురువారం ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలపై సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్

## 23న పరీక్షల నిర్వహణపై కట్టు కథలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : సిఎస్ విజయానంద్

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** ఈనెల 23వతేదీన నిర్వహించనున్న ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధతో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారంలేకుండా అన్ని పరీక్షాకేంద్రాలవద్ద కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు ఇతర ఏర్పాట్లను చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు.13 పాత జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే మార్గదర్శకాలను జిల్లాలకు పంపడం జరిగిందని వాటిని పూర్తిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు 92వేల 250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి సోషల్ మీడియాలో ఎక్కడైనా ఎవరైనా వదంతులు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేసినా లేదా సర్కులేట్ చేసినా వెంటనే విచారణ చేసి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు, ఎస్పిలకు స్పష్టం చేశారు.

ఇదే సమయంలో ఎవరైనా నకిలీ వార్తలు ప్రసారం లేదా వదంతులు సృష్టించినా అభ్యర్థులు వారి తల్లిదండ్రులు ఎవిధమైన ఆందోళన చెందవద్దని ఆయన హితవు చేశారు. పరీక్షలు సజావుగా సక్రమంగా జరిగేందుకు వీలుగా ఇప్పటికే అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు.సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన ప్రాంతాల్లో మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు,ఎస్పిలు,ఎపిపిఎస్సి అధికారులను ఆదేశించారు. ముందుగా ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధ గ్రూపు2 మెయిన్ పరీక్షల ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ పాత 13 జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా >>2

## వల్లభనేనికి హైకోర్టులో చుక్కెదురు



**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడికేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వంశీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇటీవల వంశీ దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేసిన కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్నాడు.

వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులుజారీచేసింది. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో వంశీ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో తనకు >>2

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

## పలువురు అధికారుల అరెస్టు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** పశ్చిమ రైల్వే జోన్‌లో పదోన్నతులకు సంబంధించిన కేసులో రైల్వే అధికారులు సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వెల్లడించింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ (ఎల్‌డిసిఇ) పరీక్షల్లో అభ్యర్థులకు అనుకూలంగా ఉండేందుకు భారీగా లంచం వసూలు చేశారన్న ఆరోపణలు, అభియోగాలపై పశ్చిమ రైల్వే, వడోదరలోని డిఆర్ఎం కార్యాలయంలో ఇద్దరు ఐఆర్‌పిఎస్ అధికారులతో పాటు మరికొందరితో కూడిన లంచం నెట్‌వర్క్ (రాకెట్)ను సిబిఐ అదుపులోకి తీసుకొని విచారిస్తోంది. ఈ కేసులో పశ్చిమ రైల్వే జోన్‌లోని వడోదరలో పనిచేస్తున్న 2008, 2018 ఐఆర్‌పిఎస్ బ్యాచ్‌కు చెందిన ఇద్దరు అధికారులతో సహా ఆరుగురు >>2

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

## ఎపి ఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు పెంపులేదని ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ ప్రకటించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల టారిఫ్‌లను ఏపి విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ విడుదల చేసారు. ఎపిఇఆర్‌సి మూడు డిస్కమ్‌ల కోసం రూ.57,544,17 కోట్ల రుపాయాల ఎఆర్‌ఆర్‌ని అమోదించగా, ఇది డిస్కమ్‌ల ఫైలింగ్‌ల కంటే రూ.1.324.35 కోట్లు తక్కువ అన్నారు. >>2



విద్యుత్ చార్జీల టారిఫ్‌లను విడుదల చేస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ ఠాకూర్ రామ్ సింగ్

21-02pg2exHMNWJQE.qxd:21-02pg2exHMNWJQE.qxd 01/01/01 10:15 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో జరిగిన సిఎం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోడీతో డి.సిఎం పవన్

# హిమాలయాలకు వెళ్తున్నారా?

## డిప్యూటీ సిఎం పవన్‌ను చూసి చమత్కరించిన ప్రధాని మోడీ

### ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అందరినీ ఆకట్టుకొన్న పవన్ ఆహార్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ సిఎం రేఖ గుప్తా పదవీ స్వీకార కార్యక్రమంలో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని నరేంద్రమోడీ చతుర సంభాషణ సాగించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోడీ ఒక్కొక్క ప్రముఖున్ని పలుకరిస్తూ, కరచాలనం చేస్తూ పవన్ కల్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రాదారణ చూసిన మోడీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్దామనుకుంటున్నావా! అంటూ చమత్కరించారు. మోడీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలా ఏమి లేదంటూ సమాధానమిచ్చారట. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోడీ పవన్ కల్యాణ్ చేతిలో చేయి వేసి పలకరించారు. మోడీ మాటలకు పవన్ కల్యాణ్ వెనుకఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికి నమస్కరిస్తూ ముందుకుసాగిన మోడీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై రాజకీయంగా పలు భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోడీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు. ప్రత్యేకంగా పవన్‌వేదికపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పిఎం మోడీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కల్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పోరాడుతుందని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా హిందూ ఆలయాల పరిరక్షణ కోసం ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌ను పవన్ వినిపిస్తున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

# రైతులను ఆదుకుంటాం

>> తెలుసుకుంటానని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి 3 సార్లు లేఖలు రాశాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారులు వచ్చి కేంద్ర అధికారులతో మాట్లాడారు. మా ప్రధాన ఉద్దేశం మిర్చి రైతులను ఆదుకోవాలని కోరడానికి ఢిల్లీకి వచ్చాం. రైతులు నష్టపోకుండా ఏం చేయాలో చేస్తాం. రైతులను పట్టించుకోని వారు మాట్లాడుతున్నారు. పంటలకు సంబంధించి ధరలు ఒక్కోసారి తగ్గుతాయి.. ఒక్కోసారి పెరుగుతాయన్నారు. రైతుకు గిట్టుబాటు ధరలేనప్పుడు ప్రభుత్వం వారికి కచ్చితంగా అండగా నిలుస్తోందన్నారు. రైతులకు గతంలో ఏమీ చేయలేని వారు ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారు. 2019కి ముందు ధరలు తగ్గితే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.138 కోట్లు విడుదల చేసి మిర్చి రైతులను ఆదుకున్నాం. మళ్లీ డబ్బులివ్వబోయేది ఎన్డీయేనే. బాధ్యత లేకుండా మిర్చి యార్డులోకి వెళ్లారు. ఎన్నికల కోడ్ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుంది. కానీ పోటీలో మేం లేం కాబట్టి మాకు వర్తించదని చెప్తున్నారు. ఎన్నికల కమిషన్ వెళ్లొద్దని చెప్పినా వినకుండా వెళ్లారు. ఇల్లీగల్ పనులు చేసి సెక్యూరిటీ కావాలని అడిగారు. మీరు చేసే ఇల్లీగల్ పనులకు పోలీసులు రక్షణగా ఉండాలా? నేరాలు చేస్తుంటే మీ వెనక పోలీసులు రావాలా? జల్ జీవన్, పోలవరంపై చజలశక్తి శాఖమంత్రి సిఆర్ పాటిల్‌ను కూడా కలిసాను. జల్ జీవన్ మిషన్, పోలవరంపై ఆయనతో చర్చించాం. పోలవరం పనులు సజావుగా సాగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేయాలని ఆశయంగా పెట్టుకున్నాం. నదుల అనుసంధానంపైనా చర్చించాం. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీరు ఉపయోగించుకుంటే రాష్ట్రంలో కరవు లేకుండా ఉంటుంది. పోలవరం నుంచి బనకచర్ల నీళ్లు తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం కోరాం. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రతినిధులు కూడా రాష్ట్రానికి వస్తారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి నీటిని అందించాలన్నది లక్ష్యం, కానీ గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఒక్కశాతం కూడా ఉపయోగించుకోలేదు. రాష్ట్రానికి రూ. 27 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసింది. పైపులైన్ల ద్వారా కాకుండా బోరు బావుల ద్వారా ఇస్తామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన రూ.50 వేల కోట్ల నిధులను యూపీ ఖర్చు చేసింది. గుజరాత్‌లో ఇంటికంటికీ కుళాయి ద్వారా నిరంతరంగా నీళ్లు ఇస్తున్నారు. కేంద్రం ఈ పథకాన్ని మళ్లీ నిబంధనలు మార్చి 2028కి పనులు పూర్తి చేయాలని సమయం పెంచింది. దీని ప్రకారం గతంలో కేటాయించిన రూ.27 వేల కోట్లు మాత్రమే వస్తాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కుళాయి ద్వారా నీరివ్వాలంటే అదనంగా రూ.54 వేల కోట్లు అవసరం. దీనిపై కూడా కేంద్రంతో మళ్లీ సంప్రదిస్తాం. ప్రస్తుతం రూ.27 వేల కోట్లకు డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రాన్ని నిధులు కోరతాం. తప్పుడు విధానాలతో ప్రజలకు నష్టంగత ప్రభుత్వం అవలంభించిన తప్పుడు విధానాల వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారో ఈ జల్ జీవన్ మిషన్ ఒక ఉదాహరణ. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేశారు. వాటిల్లో కొన్ని పథకాలకు మేము వచ్చాక మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించి నిధులు ఖర్చు చేసి యూసీలు ఇచ్చాం. కేంద్రం ఇచ్చే పథకాలు ఉపయోగించుకుంటే రాష్ట్రానికి ఎంతో మంచి జరుగుతుంది. కానీ గత ప్రభుత్వ చేతకాని పాలన వల్ల సమస్యలు వచ్చి పడ్డాయి... వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం. సముద్రంలో కలిసే నీటినే వాడుకుంటున్నాంనదులు ప్రవహించే వరుసలో చూసుకుంటే ఎపి చిట్టచివర ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నేను 9 ఏళ్లు సిఎంగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి తెలంగాణకు నీళ్లందించాం. ఇప్పుడు సముద్రంలోకి వెళ్లే నీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని ఎపి ఉపయోగించుకునే అవకాశం ఉంది. వాటినే వాడుకుంటున్నాం. రాజకీయం అంటే ప్రజల సమస్యల కోసం పని చేయడం రాజకీయం అవుతుంది. ఎపిలో ఎన్డీయే చిత్తశుద్ధితో పని చేస్తోంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇక కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు సిఎం చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో మిర్చి ధరలపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అంతకు ముందు సిఎం చంద్రబాబు ఢిల్లీ సిఎం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఆమె అభినందించారు. జ్ఞాపికను అందజేసారు.



గురువారం ఢిల్లీ సిఎంగా ప్రమాణం చేసిన రేఖా గుప్తాకు జ్ఞాపికను అందించి అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

# వడివడిగా పోలవరం

>> నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా కేటాయించవచ్చని సిఎం చంద్రబాబు తెలిపారు. స్వయంగా మూడు సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి వర్క్ షెడ్యూల్ విడుదల చేసామని చంద్రబాబు అన్నారు. 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సమీక్షిస్తున్నామని సిఎం చంద్రబాబు కేంద్రమంత్రికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం పోలవరం ప్రాజెక్టు పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని సీఆర్ పాటిల్ తెలిపారన్నారు. కేంద్రమంత్రి పాటిల్‌తో బేటీ సందర్భంగా ఆయనను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు పాల్గొన్నారు. ఈ భేటీ అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు ఈ కార్యక్రమం అనంతరం ఎన్డీఏ నేతలకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా విందులో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

>> మంత్రులు, బిజెపినేతలు హాజరయ్యారు. ఎపినుంచి సిఎం చంద్రబాబు, డిప్యూటిసిఎం పవన్‌కల్యాణ్‌లతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ఉదయం ఇంటినుంచి బయలుదేరిన రేఖాగుప్తా హనుమాన్ ఆలయంలో పూజలుచేసారు తర్వాత ఆమె రామ్‌లీలామైదానానికి చేరుకుని అందరినీ పలకరించారు. సుమారు 25వేలమంది భద్రతాసిబ్బంది బందోబస్తుతో ఉన్న రామ్‌లీలామైదాన్‌లో ఆమె ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసారు. సుమారు 50వేలమందికిపైగా హాజరయిన అభిమానులు, బిజెపి కేడర్‌లమధ్య గుప్తా సిఎంగాను, పర్వేష్‌సింగ్ వర్మ డిప్యూటి సిఎంగాను ప్రమాణాలుచేసారు. రేఖాతోపాటు బిజెపి ఎమ్మెల్యేలు పర్వేశ్‌వర్మ, ఆశీస్‌సూద్, మజీందర్‌సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్‌సింగ్, కపిల్‌మిశ్రా, పంకజ్‌కుమార్‌లు మంత్రులుగా ప్రమాణంచేసారు. కొత్త సిఎంకు జడ్‌కేటగిరీ సెక్యూరిటీని కేటాయించారు. ఇదిలా ఉండగా ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత రేఖాగుప్తా మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామన్నారు. మార్చి 8వ తేదీన రూ.2500 నగదును వారి ఖాతాల్లోకి బదలాయిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రధానిమోడీ కలలను సాకారంచేయడం అనేది ఢిల్లీలోని 48 మంది బిజెపి ఎమ్మెల్యేల బాధ్యత అని అన్నారు. మహిళలకు ఆర్థికంగా సాయం అందించే హామీలన్నీ మేం ఖచ్చితంగా నెరవేరుస్తామని, మార్చి 8 నాటికి సొమ్ములు వారి ఖాతాల్లో ఉంటాయని అన్నారు. ఇదిలా ఉంటే ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో కేంద్ర మంత్రి జెపినడ్డాతో కలిసి సిఎం రేఖాగుప్తా ఢిల్లీ సచివాలయానికి చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఎమ్మెల్యేలు ఎంపిలు అధికారులు ఘనస్వాగతం పలికారు. సిఎం ఛాంబర్‌లోకి వెళ్లిన రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలుచేపట్టారు. ఢిల్లీకి నాలుగో మహిళా సిఎంగాను, రెండో బిజెపి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు నెలకొల్పారు. సాయంత్రం ఐదు గంటలకు వాసుదేవ్‌ఘాట్, యమునా బజార్‌ను సిఎం సందర్శించారు. తన మొదటి కేబినెట్ సమావేశం ఢిల్లీలోని సచివాలయంలోనే నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు సిఎం షెడ్యూలును సైతం విడుదలచేసారు.

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

>> పడుతుందన్నారు. అదే విధంగా సొరంగం2లో 6.8 కి.మి. మేర లైనింగ్ పనులు ఉన్నాయని, భారీ టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా ఉందని, దాన్ని తొలగించేందుకు చాలా సమయం పడుతుందన్నారు. 21.8 కి.మి. మేర ఫీడర్ కెనాల్ పనులను కూడా నిర్వహించాల్సి ఉందన్నారు. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉంటే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా ఈ ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా ప్రతి పక్షపార్టీ నాయకులు మాట్లాడం వింతగా ఉందన్నారు. 1996 సంవత్సరంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టుకు భూమి పూజచేసి, 2014 లో రూ.1,373 కోట్లను కేటాయించి అందులో 96 శాతం నిధులు అంటే రూ.1,319 కోట్లను వెచ్చించి 30 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో బడ్జెట్ రూ.3,518 కోట్లు కేటాయిస్తున్నట్లు చూపించినప్పటికీ అందులో కేవలం 18 శాతం నిధులు అంటే రూ.647 కోట్లను మాత్రమే వెచ్చిచడం జరిగిందన్నారు.

పూర్తికాని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ అన్నారు. అబద్ధాలు చెప్పడం, అభూత కల్పనలు చేయడం, పూర్తికాని ప్రాజెక్టులను ప్రారంభించడంలో జగన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించారని నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఇప్పటివరకు ఏడు వింతలు మాత్రమే ప్రజలకు తెలుసు అని ఎనిమిదో వింత జగన్ రూపంలో చూస్తున్నారని ఆయన అన్నారు.

# చుక్కెదురు

>> ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వు చేసింది. నేడు పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చింది. వల్లభనేని వంశీ ఆదేశాల మేరకే గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగిందని ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. వాహనాలు దగ్ధం చేసి భయభ్రాంతులకు గురి చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అప్పట్లో అరెస్ట్ చేయలేదని తెలిపారు. వైఎస్సార్సీ అధికారంలో ఈ కేసు దర్యాప్తును నీరుకార్చారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని తెలిపారు. పిటిషనర్‌పై రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని పిటిషనర్‌కు, దాడికి ఎటువంటి సంబంధం లేదని వంశీ తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న తరువాత వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

# ఉన్నతాధికారులపై వేటు

>> ఇంటర్నెట్ వ్యవస్థలో నిత్యం సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఫైబర్‌నెట్ అధికారులు ఎలా పని చేస్తున్నారనేందుకు ఇవన్నీ నిదర్శనమని జివి రెడ్డి అన్నారు. ఫైబర్‌నెట్ ఎండి దినేష్‌కుమార్ ఆగస్టులో వచ్చినా ఒక్కరోజు కూడా సమీక్షించలేదని, ఒక్క ఆపరేటర్‌ను కూడా కలవడం లేదని జివి రెడ్డి వివరించారు. ఫైబర్‌నెట్‌ను చంపేయాలని దినేష్‌కుమార్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లే దినేష్‌కుమార్ పని చేస్తున్నారని అన్నారు. ఈయన కనీసం టార్గెట్లు పెట్టడం లేదని, అలాగే ఆదాయం పెంచేందుకు కూడా ప్రయత్నించడం లేదని వెల్లడించారు. కానీ సిబ్బందికి అక్రమంగా 3 నెలలు జీతాలు చెల్లించారని వివరించారు. ఆ జీతాల మొత్తాన్ని ఎండి దినేష్, ఉన్నతాధికారుల నుంచి వసూలు చేయాలని అన్నారు.

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

>> నిందితులను అరెస్టు చేసింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పదిమంది అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించేందుకు భారీగా లంచం వసూలు చేసిన ఆరోపణలకు సంబంధించిన కేసులో ముంబై చర్చ్ గేట్ డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్, డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్, అహ్మదాబాద్‌లోని సబర్మతి డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు మరో ప్రైవేటు వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది.

ఈ సందర్భంగా నిందితుల నివాసాలు, అధికారిక ప్రాంతాల్లో 11చోట్ల నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో లంచం తీసుకున్న రైల్వే ఉద్యోగులు నుండి రూ.57లక్షలు విలువ చేసే 650గ్రాముల బంగారం, బంగారు ఆభరణాలు, సుమారు రూ.5లక్షల నగదు, ఎలక్ట్రానిక్ యాంత్రిక పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ తెలిపింది. అరెస్ట్ చేసిన నిందితులను అహ్మదాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుచనున్నట్లు విచారణ కొనసాగుతుందని సిబిఐ తన ప్రకటనలో తెలిపింది.

# మార్చి 1 నుండి 20 వరకు ఇంటర్ పరీక్షలు

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగన్నాయి. మార్చి 1నుండి 19 వరకూ ప్రథమ సంవత్సర పరీక్షలు, 3 నుండి 20 వరకూ ద్వితీయ సంవత్సర పరీక్షలు రోజూ ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకూ జరగనుండగా 26 జిల్లాల్లో 1535 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 10 లక్షల 58వేల 892 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటికి సంబంధించిన ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 3 నుండి 15వ తేదీ వరకూ జరగనుండగా 325 కేంద్రాల్లో ఈపరీక్షలకు మొత్తం 67వేల 952 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. ఈపరీక్షల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలలు పరీక్షలమాసాలని కావున ఆయాపరీక్షలు సజావుగా సాగేందుకు తగిన విస్తృత ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ఈపరీక్షలకు సంబంధించి 1535 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 68 కేంద్రాలను సెన్సిటివ్, 36 కేంద్రాలు వల్నరబుల్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని అక్కడ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స ఏర్పాట్లు, విద్యుత్, బెంచ్‌లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పరీక్షా కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలనిఆదేశించారు. పరీక్షాకేంద్రాల పరిధిలో పరీక్షలసమయంలో జిరాక్సు కేంద్రాలు, నెట్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.

# బంగ్లాపై భారత్ విజయం

## ఆరువికెట్ల తేడాతో బంగ్లాజట్టు ఓటమి

**దుబాయ్, ఫిబ్రవరి 20:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీలో భారత్‌బోణి కొట్టింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తోజరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులుచేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్‌గిల్ 101 పరుగులుచేసి సెంచరీ వీరుడుగా నిలిచాడు. ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడుపై ఉన్న కెప్టెన్ రోహిత్‌శర్మ 41పరుగులుచేసాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ గిల్‌తోకలిసి పది ఓవర్లలోపే 69 పరుగులు జోడించాడు. రోహిత్ ఔట్ అయ్యా క్రీజులోకి వచ్చిన విరాట్ ఆచితూచి ఆడుతూ 22 పరుగులుచేసాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లీ వికెట్ పడిపోయింది, శ్రేయస్ అయ్యర్ 15పరుగులేచేసి నిరాశపరిచాడు. అక్షర్‌పటేల్ 8 పరుగులుమాత్రమేచేసి నిరాశకు గురిచేసాడు. వికెట్లు పడుతున్నా ఏకాగ్రతకోల్పోకుండా శుభ్‌మన్‌గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెఎల్‌రాహుల్ 40 పరుగులుచేసి జట్టును గెలిపించాడు. కెఎల్‌రాహుల్; శుభ్‌మన్‌గిల్ ఇద్దరూ కలిసి జట్టును విజయం వైపు నడిపించారు. గిల్128 బంతుల్లో తొమ్మిదిఫోర్లు, రెండు సిక్సర్లతో 101 పరుగులుచేస్తే కెఎల్‌రాహుల్ 47 బంతుల్లో ఒకఫోరు, రెండుసిక్సర్లతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో రషీద్‌కు రెండు, తక్సిన్ అహ్మద్, రెహమాన్‌కు చెరోవికెట్ లభించింది.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

>>ఎపిఇఆర్‌సి మొత్తం ఆధాయాన్ని రూ.44.323.30 కోట్ల రుపాయాలను ఆమోదించగా ఇది డిస్కమీల దాఖలు కంటే కొంచెం ఎక్కువే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.12,632.40కోట్ల సబ్సీడిని భరించటానికి అంగీకరించినట్లు తెలిపారు. అన్ని వినియోగదారుల వర్గాలకు టారిఫ్ పెంపును నివారించినట్లు తెలిపారు. వ్యవసాయ వినియోగదారులు, ఉద్యానవన నర్సరీలు, చాకలి, ఆక్వాకల్చర్ రైతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగల కుటుంబాలు మొదలైనవాటితో సహ నిర్ధిష్ట వినియోగదారు వర్గాలకు రాయితీలు, ఉచిత విద్యుత్‌ను అందించే ప్రభుత్వ ఉత్తర్వులు అన్నీకూడా ఉచిత సబ్సిడీలో చేర్చినట్లు తెలిపారు. మొదటిసారిగా ఎపిఇఆర్‌సి స్వల్పకాలిక విద్యుత్ అవసరాల గురించి మరింత వాస్తవిక అంచనా కోసం హర్లీ డిస్పాచ్‌ను ద్వారా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని జెన్‌కోలు దిగుమతి చేసుకున్న బొగ్గును సేకరించేందుకు, ఆర్ఎస్ఆర్ మోడీ ద్వారా బొగ్గును రవాణా చేసుకునేందుకు అనుమతించినట్లు తెలిపారు.

ఏప్రిల్ 1-2025 నుండి ఇళ్లను నిర్మించుకునే లేదా పునఃనిర్మించే వ్యక్తులు వాణిజ్య టారిఫ్ బదులుగా డొమెస్టిక్ టారిఫ్‌లో బిల్ చేయబడతారని తెలిపారు. స్టాండిబై టారిఫ్‌లు ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సస్ కన్జమర్ మాత్రమే కాకుండా ఓపెన్ యాక్సస్ కన్జమర్స్‌కు వర్తిస్తాయని తెలిపారు. 150 కెడబ్ల్యు వరకు కనెక్ట్ చేయబడిన ఈవి చార్జింగ్ స్టేషన్‌లకు ఎల్‌టి వోల్టేజ్ స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడానికి అమోదం తెలిపినట్లు తెలిపారు. డిమాండ్ చార్జీలు లేకుండా ఇవిల టారిఫ్ యూనిట్‌కు రూ.6.70 మాత్రమే వసూలు చేస్తాయని తెలిపారు. డొమెస్టిక్ వినియోగదారుల కోసం అదనపు లోడ్‌లను క్రబద్ధీకరించే పథకాన్ని ఎపిఇఆర్‌సి అమోదించి, ఈ పథకం మార్చి 1నుండి జూన్ 30వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ విండో ద్వారా వినియోగదారులు స్వచ్ఛందంగా అదనపు లోడ్‌లను ప్రకటించవచ్చునని తెలిపారు.

# గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో గ్రూప్2 ప్రధానపరీక్ష(మెయిన్స్) ప్రక్రియను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను రాష్ట్ర హైకోర్టు గురువారం కొట్టేసింది. ప్రస్తుత వాజ్యాలలో కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి గ్రూప్-2 ఫలితాలు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో మహిళలు, మాజీ సైనిక ఉద్యోగులు, క్రీడాకారులు, దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది. ఫిబ్రవరి 23వ తేదీన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు ఇటీవల ఎపి హైకోర్టును ఆశ్రయించారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించనున్న ప్రధాన పరీక్షను నిలుపుదల చేయాలంటూ వేసిన అనుబంధ పిటిషన్లపై న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఫిక్స్ చేసి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన ఎం. పార్థసారథి, కడపకు చెందిన కనుపర్తి పెంచలయ్యతోపాటు మరో ఇద్దరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు బొద్దులూరి శ్రీనివాసరావు, జీవీ శివాజీ వాదనలు వినిపించారు. ఎపిపిఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్.. రిజర్వేషన్ల అమలుతోపాటు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోను ఈ సందర్భంగా కోర్టు ముందు ఉంచారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న గ్రూప్ 2 ప్రధాన పరీక్షను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే ముగిసిందని, ప్రధాన పరీక్షను నిలువరించవద్దని హైకోర్టును కోరిన విషయం విధితమే. అలాంటి వేళ.. ఎపి హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది.

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు

>> కేంద్రాల్లో ఈపరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ ఉదయం 10గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకూ పేపర్1 వ్రాత పరీక్ష ఉంటుందని అభ్యర్థులు ఉ.9.30 గం.ల లోపు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఉ.9.45 గం.లకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలని ఆలస్యంగా వచ్చిన ఎవరినీ లోనికి అనుమతించ కూడదని స్పష్టం చేశారు. అదే విధంగా మధ్యాహ్నం 3గం.ల నుండి 5.30 గం.ల వరకూ పేపర్2 పరీక్ష ఉంటుందని అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గం.ల లోగా ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 2.45 గం.లకు ఆ పరీక్షా కేంద్రాలా గేట్లను మూసివేసి ఆతర్వాత ఎట్టిపరిస్థితుల్లోను అభ్యర్థులెవరినీ లోనికి అనుమతించకూడదని ఆమె స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి డిటైల్డ్ ఇన్‌స్ట్రక్షన్లతో కూడిన బుక్ లెట్‌ను అన్ని పరీక్షా కేంద్రాలకు పంపడం జరిగిందని ఆసూచనలన్నీ లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటిండెంట్లు, ఇన్విజిలేటర్లు తుచ తప్పక పాటించి పరీక్షలు సజావుగా జరిగేలే చూడాలని చెప్పారు. గ్రూపు2 మెయిన్ పరీక్షలకు సంబంధించి సోషల్ మీడియాలో పరీక్షలు వాయిదా పడతాయని, ఇతర దుష్ప్రచారం జరుగుతోందని అటువంటి వేమీ అభ్యర్థులు నమ్మవద్దని ఎట్టి పరిస్థితుల్లోను ఈనెల 23వ తేదీన ఈ పరీక్షలను సజావుగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ అనురాధ స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేనివిధంగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలకు ఆమె సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించాలని చెప్పారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల సమీపంలో పరీక్షల సమయంలో జిరాక్సు, నెట్ కేంద్రాలన్ని మూసి ఉంచాలన్నారు. పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోను లోనికి అనుతించరాదని తెలిపారు. అంతేగాక అవసరమైన మేర పరీక్షా కేంద్రాల్లో సిసిటివి కవరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అనురాధ కలక్టర్లకు సూచించారు.

రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎక్కడైనా సోషల్ మీడియా లేదా ఇతర ప్రచార మాధ్యమాల్లో నకిలీ వార్తలు ప్రసారం చేస్తే వెంటనే స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లకు సూచించారు. అలాంటి వార్తలపై వెంటనే స్పందించి కౌంటర్ చేయడం తోపాటు తప్పుడు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేస్తే అలాంటి వారిపై చట్ట పరంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, ఆశాఖ కమీషనర్ కృతికా శుక్ల, సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, ఎపిపిఎస్సి కార్యదర్శి ఐఎన్ మూర్తి తదితర అధికారులు పాల్గొనగా వర్చువల్‌గా జిల్లా కలక్టర్లు, ఎస్పిలు, సిపిలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**తేది : 21-02-2025, శుక్రవారం**
**శ్రీ క్రోధి నామ సంవత్సరం, మాఘమాసం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, కృష్ణపక్షం,**
అష్టమి ఉ.11.59
అనూరాధ ప.3.53
వర్జ్యం : రా.9.54-11.37
దు.ఉ.9.00-9.47
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. చికాకులు ఎక్కువ అవుతాయి.

**వృషభం :** మీ ఊహలు నిజమయ్యే సూచనలు లేవు. ప్రయాణాలు వద్దు.

**మిథునం:** శ్రమపడ్డా ఫలితం దక్కదు. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

**కర్కాటకం:** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో ఆదరణ పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**తుల :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** ముఖ్యమైన నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలు.

**ధనుస్సు:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వాహనయోగం.

**కుంభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు.

**మీనం :** వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్



## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఆచార్య యార్లగడ్డ భేటీ

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ సయ్యద్ అబ్దుల్ నజీర్ ను రాజ్య సభ పూర్వ సభ్యులు, విశ్వ హిందీపరిషత్తు జాతీయ అధ్యక్షులు, పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన భేటీ సందర్భంగా యార్లగడ్డ తాజాగా రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ హిందీ, డోనాల్డ్ ట్రంప్ అంగ్ల పుస్తకాలను గవర్నర్ కు బహుకరించారు. అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ పుస్తకాన్ని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అవిష్కరించిన విషయం విదితమే. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర పభుత్వం అనుసరించిన విధానం అభినందనీయమని, కులపతి హోదాలో గవర్నర్ అమలు చేసిన తీరు అందరి ప్రశంసలు అందుకుందని గవర్నర్ నజీర్ కు వివరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిభకు పట్టం కడుతూ ఉప కులపతుల నియామకం జరిగిందన్నారు. విశ్వవిద్యా లయాను ప్రక్షాళన చేసే దిశగా ప్రతిభకు పట్టం కట్టారని ప్రశంసించారు. వివిధ విశ్వవిద్య లయాలు, ప్రత్యేకించి ఆంధ్రా విశ్వవిద్యా లయంలో నెలకొన్న క్రమ శిక్షణా రాహిత్యంపై దృష్టి సారించాలని యార్లగడ్డ గవర్నర్ కు విన్నవించారు. రాష్ట్రంలో హిందీ ప్రచారం, సాహిత్య సృజనల వికాసాన్ని వివరిస్తూ అలూరు భైరాగి, అచార్య ఆదేశ్వరరావుల కవితలను వైఎల్పి వినిపించారు. ఆంధ్రప్రదేశ్ కు సర్ అర్థర్ కాటన్ అందించిన సేవలు సైతం వీరి మధ్య చర్చకు వచ్చాయి.

## వల్లభనేని వంశీ కస్టడీ, హెల్త్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. ఈ రెండు పిటిషన్లపై ఎస్సీ ఎస్టీ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. వంశీతో పాటు మరో ఇద్దరి కస్టడీ పిటిషన్లపైనా న్యాయస్థానం తీర్పు ఇవ్వనుంది. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ దాడి కేసులో ఇటీవల వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడలోని జిల్లా జైలులో ఉన్నారు.

## హాబీట్రాట్స్ ట్రస్ట్ గ్రాంట్ 8వ ఎడిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, సామాజిక, సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో భారత దేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించడానికి స్వలాభాపేక్ష లేని తాము ఈ ఏడాది ది హాబీటాబ్స్ ట్రస్ట్ గ్రాంట్స్ 8వ ఎడిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు హాబీటాబ్స్ ట్రస్ట్ అధిపతి రుషికేష్ చవాన్ ప్రకటించారు. ఈనెల 15 నుండి మార్చి 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫైనల్ వివరాలు అక్టోబర్ 2025లో వెల్లడిస్తామన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

### నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రు.25వేలకోట్ల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షులు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావులు గురువారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తమ డిమాండ్లను తెలిపారు. రాజధానితో పాటు 26 జిల్లా కేంద్రాల్లో రు.500కోట్లతో వెంచర్లు వేసి సబ్సిడీపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇళ్ళస్థలాలు కేటాయించి వారి స్వంతింటి కల నెరవేర్చాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి రు.3 నుండి రు.5లక్షల మేర ప్రభుత్వం బకాయి వుందని , డిఏ బకాయిలు నగదు రూపంలో చెల్లించాల్సిన నగదుతో కలిపితే మరింత పెరుగుతుందని వీటి చెల్లింపుపై ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తక్షణ నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగి అనుమతితో ఆ బకాయిలను 30శాతం సబ్సిడపై ఇళ్ళస్థలాలను కేటాయించడం ద్వారా స్వంతింటి కల నెరవేర్చాలన్నారు.

## పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై మంత్రి సవిత ఆందోళన!



**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నితంతరం అప్ర మత్తంగా ఉండాలని, విద్యార్థుల భద్రత పట్ల బాధ్యతతో మెలగాలని గురుకులం కార్యదర్శి మాధవీలతను ఫోన్లో ఆదేశించారు. గురువారం ఉదయం కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో అయిదో తరగతి చదువున్న మధుమోహన్ పాలు తాగడానికి కిచెన్ రూమ్ కు వెళ్లాడు. పాలు తాగి వస్తున్న క్రమంలో పక్కన టేబుల్ పై ఉన్న వేడి పాలుతో ఉన్న గిన్నె దొర్లి మధుమోహన్ పై పడిపోయింది. దీంతో బాలుడి చాతి కింద, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఇన్చార్జి అంకిరెడ్డి బాలునికి వైద్య సేవలందించారు. ఘటన జరిగిన వెంటనే ఎంజేపీ ఇన్చార్జి వార్డెన్ స్రవంతి బాలుని తల్లిదండ్రులకు సమాచారమందించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సవిత.గురుకులం కార్యదర్శి మాధవీలతతో ఫోన్ లో మాట్లాడారు. బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని, తీవ్ర గాయాలు కావడంతో మరో మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు వెల్లడించారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, బాలునికి మెరుగైన వైద్యమందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు బాలుని ఆరోగ్యంపై వివరాలు అందివ్వాలని స్పష్టంచేశారు. వేడి పాలు ఉన్నచోట హాస్టల్ నిర్వాహకులు, సిబ్బంది లేకపోవడంపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డొక్కా బాలవీరాంజనేయులతోనూ మంత్రి సవిత మాట్లాడారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే మంత్రి బాలవీరాంజనేయులు ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, విద్యార్థికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. ఎంజేపీ స్కూల్లో జరిగిన ఘటనపై మంత్రి సవితకు మంత్రి బాలవీరాంజనేయులు సమాచార మందించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు.

## బాలికల రక్షణ కోసం ఆద్య పేరిట సరికొత్త కార్యక్రమం

- రాష్ట్రంలోనే తొలిసారి నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభం
- ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బ్యూరో** బాలికల శక్తిని తెలియజేస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కల్పించే విధంగా రాష్ట్రంలో తొలిసారి శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఆద్య అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ట్రైనీ కలెక్టర్ వినూత్న, ఇతర అధికారులు, మేధావులు హాజర య్యారు. ముఖ్యంగా బాలికలు చదువుకునే సమయంలో తీసు కోవాల్సి న జాగ్రత్తలు, ప్రేమ, వ్యామోహాలు, సోషల్ మీడియా వంటి వాటికి ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. బాలికలపై ఎవరైనా కనెన్నెత్తి చూడాలంటే భయపడే విధంగా రాష్ట్రంలో పోలీసులు కీచకులను ఎన్కౌంటర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలికలు చిన్న వయస్సులోనే ప్రేమ ఇతర వాటిపై ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ అన్నది అరచేతిలో అద్భుతమని, అదే మీకు శాపంగా మారకుండా చూసుకోవాలన్నారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైమ్ డ్రగ్స్ వంటి వాటిపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుంటారని వారి నమ్మకాలను వమ్ముచేయకుండా మీరు చదువుకోవాలన్నారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం మీ పాఠశాల, గ్రామాలపై పడుతుందని ఆమె అన్నారు.

## యూట్యూబర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ప్రభుత్వ భూవివాదమే హత్యకు కారణం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి శ్రీనివాస్



అరెస్ట్ అయిన ముద్దాయిలను చూపుతున్న పోలీసులు

**గుంతకల్లు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** గత ఐదు రోజుల క్రితం జరిగిన యూట్యూబర్ భోగాల తిరుమలరెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రభుత్వ భూమి వివాదమే హత్యకు కారణమని తెలిపారు. ఈ మేరకు గురువారం కసాపురం పోలీసుస్టేషన్ ప్రాంగణంలో డిఎస్పి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మండలంలోని సంఘాల గ్రామానికి చెందిన ముద్దాయి జీవన్‌కుమార్ తనకున్న నాలుగు ఎకరాల పొలం పక్కనే వున్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాడని తెలిపారు. బివిఆర్ న్యూస్ టుడే యూట్యూట్ ఛానెల్ నిర్వహిస్తున్న తిరుమలరెడ్డి ప్రభుత్వ భూమిని ఎలా సాగు చేసుకుంటావని అభ్యంతరం తెలిపాడని పేర్కొన్నారు. భూమిని సాగు చేసుకుంటున్న విషయాన్ని తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేసి డబ్బులు డిమాండ్ చేశాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం పెరిగి పెద్దదైందన్నారు. తిరుమలరెడ్డిని అడ్డు తొలగించుకోవాలని బావించిన జీవన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు, కసాపురం గ్రామానికి చెందిన బోయ రామన్నల సహాయంతో ఈనెల 17వతేదీ ఉదయం 7.45 గంటల సమయంలో సొంత పొలానికి బైకుపై వెళుతున్న తిరుమలరెడ్డిని ట్రాక్టర్‌తో బలంగా గుద్ది హంద్రీనీవా కాలువలో పడవేశారన్నారు. మృతుని భార్య కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయిలను గురువారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక ట్రాక్టర్, మోటర్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డిఎస్పి తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టిపి వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కేసు ఛేదింపులో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్‌కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అంజి, నూర్‌అహ్మద్‌లను డిఎస్పి అభినందించారు.

## మహాకుంభమేళాలో ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్ పుణ్యస్నానం



**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చంద్రయాన్-3తో గఘన కీర్తిని కట్టబెట్టిన ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్యాత్మికతపరంగాను ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్, డిఓఎస్ అధ్యక్షునిగా అత్యంత ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు కూడా ఆయన పదేపదే ఆధ్యాత్మిక భావాలు వెలిబుచ్చేవారు. సంస్కృత భాషలోనూ కొంత పట్టున్న సోమనాథ్ దక్షిణ భారతదేశంలో పేరెన్నిక కలిగిన పలు ఆలయాలను సందర్శించి ఉన్నారు. గత నెలలో ఇస్రో ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు విరమించిన తర్వాత ఆధ్యాత్మికతపరంగా మరింత చొరవ చూపిస్తున్నారు. ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అధికారదర్పం ఎలాగో ఉంటుంది. ప్రస్తుతం ఆయన సాధారణ పౌరుడిగా ప్రయాగరాజ్ త్రివేణి సంగమ తీరంలో కొంతసేపు పడవ కోసం నిరీక్షించి అనంతరం పుణ్యస్నానం ఆచరించారు. మహాకుంభమేళాలో సోమనాథ్‌ని చూసిన భక్తులు ఆయన సాదాసీదాగా ఒక చిన్న బ్యాగు పట్టుకొని నిరీక్షించడాన్ని ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం సోమనాథ్ ప్రయాగరాజ్ తీరంలో పడవ కోసం నిరీక్షించడం, పుణ్యస్నానం చేయడం వంటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విరివిగా కనిపిస్తున్నాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు గొప్ప విజయాలను అందించిన శాస్త్రవేత్త ఇంత సాధారణంగా వ్యవహరించడాన్ని చూసి అక్కడి భక్తులు, సందర్శకులతో పాటు ఈ దృశ్యాలను తిలకించిన వారు కూడా ఆయనను మరింత గౌరవభావంతో చూస్తున్నారు. భారత శాస్త్ర సాంకేతికరంగంలోని ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని ఇది ప్రతిబింబించిందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేషగిరిరావు ఒక ప్రకటచనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. 18 సీట్లున్న మినీ ఏసీ బస్సు ఈ నెల 25న సాయంత్రం ఆరింటికి రాజమహేంద్రవరంలో బయలుదేరుతుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు విజయవాడ బెర్మ్‌పార్కు హోటల్ వద్దకు చేరుతుందని వివరించారు. పదింటికి మళ్లీ బయలుదేరి 26న ఉదయం శ్రీశైలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి పర్యాటకాభివృద్ధి సంస్థ హోటల్‌లో అల్పాహారం, మధ్యాహ్నభోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ఈడీ వివరించారు. టిక్కెట్ ధర పెద్దలకు రూ.4360 పిల్లలకు రూ.3490గా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం బస్సు తిరుగు ప్రయాణంలో త్రిపురాంతకం మీదుగా 27న తెల్లవారుజామున రెండింటికి విజయవాడ, ఉదయం ఆరింటికి రాజమహేంద్రవరం చేరుకుంటుందని ఈడీ వివరించారు. వివరాలకు 9848629341, 9848007025 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పింఛన్ల వెరిఫికేషన్ పారదర్శకం

**సచివాలయం,ఫిబ్రవరి 20 ,ప్రభాతవార్త :** రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్లు వెరిఫికేషన్ ఎంతో పారదర్శకంగా జరుగుతుందని రాష్ట్ర ఎమ్ఎస్ఎంఈ ,సెర్ప్,ఎన్నారై ఎంపవర్‌మెంట శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 8లక్షల దివ్యాంగులకు సామాజిక భద్రతా ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని,ఇందులో ఇప్పటవరకు 1.20లక్షల పింఛన్లు వెరిఫికేషన్ పూర్తయినట్లు తెలిపారు. గతంలోని నియమ నిబంధల ప్రకారమే ఈ ఫించన్లు వెరిఫికేషన్ జరుగుతుందని,అర్హులైన ఏ ఒక్కరికి ఎటువంటి అన్యాయం జరగదన్నారు.ఒక జోన్‌లోని వైద్యులు మరో జోన్‌లో వెరిఫికేషన్‌ను ఎంతో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎమ్ఎస్ఎంఈల సర్వే కూడా ముమ్మరంగా సాగుతున్నందని, ఇప్పటివరకు 50శాతం మేర సర్వే పూర్తయిందని,ఈసర్వేకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుది గడువు నిర్ణయించినట్లు మార్చి 15కల్లా ఈ సర్వే పూర్తవుతుందని ఆయన తెలిపారు.

## 'గర్భాలయ శిఖర కలశాలు అపవిత్రం'

### ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం గర్భాలయ కలశాలు అపవిత్రం జరిగిందని మాజీ ధర్మకర్తల మండలి అంజూరు తారక శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022లో కూడా ఇలా జరిగి గందరగోళం మారిందన్నారు. కుంబాభిషేకాల సమయంలో అర్చకులు కలశాలకు అభిషేకించటానికి తప్ప మరెప్పుడు తాకలేదన్నారు.

గర్భాలయ శిఖరాలపై ఏదైనా చేయాలంటే సంప్రదాయబద్ధంగా ఆగమ నిబంధనల ప్రకారం చేయాలని అలా కాకుండా చేస్తే చేదు అనుభవాలు ఎదుర్కొన్నారని శ్రీనివాసులు ఆరోపించారు. 2020లో ఏం జరిగిందో ఆలయాధికారులు గుర్తించుకోవాలన్నారు.ఇప్పటికైనా అధికారులు జరిగిన పొరబాటును గుర్తించి సరిదిద్దాలన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్యులు, సిబ్బందిపై వేటు తప్పదు

### - రాష్ట్ర ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి వాసంశెట్టి సుభాష్




**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** కార్మికులకు ఉచితంగా ఉత్తమ వైద్య సేవలు అందజేయాలనే లక్ష్య ంతోనే ఈఎస్ఐ ఆస్పత్రులను ఏర్పాటు చేయడం జరిగిందని,అయితే అటు వంటి లక్ష్యానికి విఘాతం కల్పించే విధంగా ప్రవర్తించే వైద్యులు,సిబ్బందని ఏమాత్రం ఉపేక్షించబోమని రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు, బాయిలర్స్,ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాక మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు.రాజమండ్రి ఇఎస్ఐ వైద్యులు,సిబ్బంది విధుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరినీ స్వయంగా గమనించిన తదుపరే 5గురు వైద్యులను,4గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిన సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటి సెల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమండ్రి ఈఎస్ఐ వైద్యులు,సిబ్బంది విధులపట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిదోరణి వల్ల ఆస్పత్రిలో ఓపి గరిష్టంగా 50కూడా లేదని,అయితే వీరిని సస్పెండ్ చేసిన తదుపరి ఓపి 170కి పెరిగిందనే విషయాన్ని ఆయన స్పష్టంచేశారు.తిరుపతి ఇఎస్ఐ వైద్యులు విదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ఆ ఆస్పత్రిలో చాలా మంచి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని తద్వారా అక్కడ ఓపి దాదాపు 350దాకా ఉందన్నారు.గత ప్రభుత్వం ఈఎస్ఐ లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని,కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్రప్రభుత్వానికి అప్పగించిందన్నారు. రాష్ట్రంలోని కార్మికుల భద్రతకు,సంక్షేమానికి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యదిక ప్రాదాన్యతను ఇస్తుందని,ప్రస్తుతం ఉన్న 78డిస్పెన్సరీలకు అదనంగా మరో 18డిస్పెన్సరీలను తమ ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందన్నారు.తమ ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలంలోనే అమరావతిలో 500పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆస్పత్రితో పాటు ఇఎస్ఐ మెడికల్ కళాశాలను మరియు 150పడకల సూపర్ స్పెషాలీటి ఆస్పత్రిని ఏర్పాటు చేసే ప్రతిపాదనలను ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్‌కు పంపడం జరిగిందన్నారు.

## ముంబయిలో పర్యటించిన మంత్రి నారాయణ, సిఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రాజధాని అమరావతి పాటు,కీలక నగరాల అభివృద్ధి లక్ష్యం రాష్ట్ర పురపాలక శాఖా మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో ముంబయి నగరానికి వెళ్ళారు.అక్కడ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ(ఎంఎంఆర్‌డిఏ), సిడ్కో అధికారులతో మంత్రి నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబులుఇతర అధికారులు సమావేశమయ్యారు.ఎంఎంఆర్‌డిఏప్లానింగ్ డైరెక్టర్ శంకర్ దేశ్ పాండే,ఇతర విభాగాల అధికారులు ముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న ఎంఎంఆర్‌డిఏముంబయి లో రోడ్లు,మెట్రో రైలు,హౌసింగ్ ప్రాజెక్టులు చేపడుతున్న ఎంఎంఆర్‌డిఏరోడ్ల అభివృద్ధి,మెట్రో రైలు ప్లానింగ్,రవాణా ప్రణాళికలు, ఇళ్ల నిర్మాణం,రీజినల్ డెవలప్మెంట్,నిధుల సమీకరణ పై మంత్రి నారాయణకు ముంబై అధికారులు వివరించారు.

**పంజాబ్ నేషనల్ బ్యాంక్** (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ... విశ్వాసానికి మరో పేరు !

CIRCLE SASTRA CENTRE
డి.నెం.9-35, కాపూరి టవర్స్, 1వ అంతస్తు, కామయ్య తోపు సెంటర్, కానూరు, విజయవాడ - 520007, ఆంధ్రప్రదేశ్. E Mail: cs8332@pnb.co.in

**డిమాండ్ నోటీసు** (చర/స్థిరాస్తుల కొరకు)

ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీతకు ఈ నోటీసు జారీ చేయబడినది : వారు బ్యాంకు నుండి పొందిన ఋణములను మరియు వడ్డీలను చెల్లించుటలో విఫలమైనందున సదరు ఖాతా నిరర్థక ఖాతా (NPA)గా వర్గీకరించబడినది. కావున మీరు చివరిగా తెలిపిన చిరునామాకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు జారీచేయబడినది. కానీ అది బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. కావున ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

I) ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా: శ్రీ షేక్ అబ్దుల్ ఇబ్రహీం, తండ్రి : షేక్ అబ్దుల్ సత్తార్, నివాసం : డి.నెం.1-2-9/16, టి.ఎస్.నెం.3/2, మిట్ట బజారు బరంపేట, నరసరావుపేట, గుంటూరు జిల్లా - 522601. శ్రీ షేక్ కరీముల్లా, తండ్రి : షేక్ అబ్దుల్ ఇబ్రహీం, నివాసం : డి.నెం.1-2-9/16, టి.ఎస్.నెం.3/2, మిట్ట బజారు బరంపేట, నరసరావుపేట, గుంటూరు జిల్లా - 522601.
II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం: 18956015000688-TLPHL, బ్రాంచి : నరసరావుపేట (189510)
III) చెల్లించవలసిన బాకీ మొత్తము : తేది.16-02-2025 నాటికి రూ.9,75,888.47 పై (అక్షరాల తొమ్మిది లక్షల డెబ్బై ఐదు వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి.
IV) డిమాండ్ నోటీసు తేది : 17-02-2025. ఎన్‌పిఏ తేది: 30-01-2025
V) ఆస్తి వివరములు: రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.3734/1998, తేది.19.06.1998 మరియు రిజిష్టర్డు ఎమ్ఓడి నెం.3931/2014, తేది.04.06.2014 ప్రకారం శ్రీ షేక్ అబ్దుల్ ఇబ్రహీం, తండ్రి : అబ్దుల్ సత్తార్ గారి పేరున గల ఆస్తి : ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, నరసరావుపేట మున్సిపాలిటీ, నరసరావుపేట ఎస్ఆర్ఓ, నరసరావుపేట డిస్ట్రిక్ట్, వై.ఎస్.ఆర్ విగ్రహం, మిట్ట బజారు, బరంపేట, కొత్త అసెస్మెంట్ నెం.1024000895, బ్లాక్ నెం.1/1, కొత్త వార్డు నెం.1, పాత వార్డు నెం.1, ప్రస్తుత డోర్ నెం.1-2-9/16, పాత డోర్ నెం.1-2-9-18, కొత్త సర్వే టి.ఎస్.నెం.3/2, పాత సర్వే నెం.116/బి లోని 145.53 చ॥గ॥ల ఏరియా విస్తీర్ణం గల భూమి మరియు అందు గల ఆర్‌సిసి డాబా ఇల్లు యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: చుక్కా పునవతమ్మ గారి ఇల్లు - 20.9 అ॥లు, పడమర: మున్సిపల్ బజారు - 20.09 అ॥లు, ఉత్తరం : షేక్ చిన్న మస్తాన్ - 63.9 అ॥లు, దక్షిణం : ముత్యాల రంగయ్య గారి ఇల్లు - 63.0 అ॥లు., ఈ హద్దులలోని విస్తీర్ణం 145.53 చ॥గ॥లు లేదా 121.67 చ॥మీ॥లు మరియు అందు గల ఆర్‌సిసి డాబా ఇల్లు.

I) ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా: శ్రీ కేశాని బుల్లి కృష్ణ, తండ్రి : వెంకటేశ్వర్లు, నివాసం: డోర్ నెం.3-108, విపిఓ ముత్యాలంపాలెం గ్రామం, బాపట్ల మండలం, బాపట్ల, గుంటూరు జిల్లా - 522101. వేరొక చిరునామా: శ్రీ కేశాని బుల్లి కృష్ణ, తండ్రి : వెంకటేశ్వర్లు కేశాని, 125 Inf Bn Ta ది గార్డ్స్, పిన్ - 934325, Co 56 Apo రాజౌరి, నౌషెహ్రా ఎమ్‌సి జమ్ము & కాశ్మీర్ - 185151. వేరొక చిరునామా: శ్రీ కేశాని బుల్లి కృష్ణ, తండ్రి : వెంకటేశ్వర్లు, నివాసం: డోర్ నెం.3-108, విపిఓ సర్వే నెం.162/6, మారుపోలువారిపాలెం, ముత్యపాలెం గ్రామం, బాపట్ల మండలం, బాపట్ల, గుంటూరు జిల్లా - 522101.
II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం: 889100NC00000160 KESANI BULLI KRISHNA -TLPHL; 922000NB00002494 TLPDG - TL-PER-DEF/GOV.EM/DR/TEAC, బ్రాంచి : బాపట్ల (889100)
III) చెల్లించవలసిన బాకీ మొత్తము : తేది.14-02-2025 నాటికి రూ. 20,06,558.98 పై (అక్షరాల ఇరవై లక్షల ఆరు వేల ఐదు వందల యాభై ఎనిమిది రూపాయల తొంభై ఎనిమిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి.
IV) డిమాండ్ నోటీసు తేది : 15-02-2025. ఎన్‌పిఏ తేది: 30-01-2025
V) ఆస్తి వివరములు: రిజిష్టర్డు పార్టీషన్ డీడ్ నెం.283/2019, తేది.23.01.2019 మరియు రిజిష్టర్డు ఎమ్ఓడి నెం.2987/2019, తేది.21.06.2019 ప్రకారం శ్రీ కేశాని బుల్లి కృష్ణ, తండ్రి : వెంకటేశ్వర్లు కేశాని గారి పేరున గల ఆస్తి : బాపట్ల సబ్ డిస్ట్రిక్ట్, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధి, అసెస్మెంట్ నెం.398, తీసివేసిన డోర్ నెం.3-108తో మారుపోలువారిపాలెం గ్రామం, ముత్యాలపాలెం పంచాయితీ, డి.నెం.162/6తో 236.60 చ॥గ॥ల ఏరియా విస్తీర్ణంలో గల భూమి మరియు అందు ఆర్‌సిసి ఫ్రేమ్డ్ నివాస భవనం యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: పంచాయితీ రోడ్డు - 36 అ॥లు, దక్షిణం: పంచాయితీ రోడ్డు -58 అ॥లు, పడమర : టాటా గుదర్‌లంకయ్య గారి ఇంటి స్థలం - 36 అ॥లు, ఉత్తరం : కేశాని శంకర్ మరియు కేశాని శివయ్య గార్ల ఇల్లు మరియు స్థలం - 62 అ॥లు.,

పైన తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు / లేదా వారి హామీదారు(లు) (వర్తించునది)ను ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 దినములు లోగా బకాయి మొత్తమును చెల్లించవలసినదిగా కోరటమైనది. అట్లు చెల్లించని ఎడల, నోటీసు తేదీ నుండి 60 దినములు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క 13వ విభాగంలోని (4)వ ఉప-విభాగం పరిధిలో తదుపరి చర్యలు చేపట్టబడతాయి.
చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/ పార్ట్‌నర్ తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

తేది : 17-02-2025 & 15-02-2025 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ పంజాబ్ నేషనల్ బ్యాంక్

राष्ट्रीय परीक्षा एजेंसी
National Testing Agency
Excellence in Assessment
IIM BODH GAYA
IIM JAMMU
(उच्चतर शिक्षा विभाग, शिक्षा मंत्रालय, भारत सरकार के तहत एक स्वायत्त संगठन
(An Autonomous Organization under the Department of Higher Education, Ministry of Education, Government of India)

**2025 మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్‌లో, జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం కొరకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఫారం**

ది నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) 2025-26 విద్యా సంవత్సరం కొరకు IIM బోధ్‌గయ మరియు IIM జమ్ము వద్ద 5-సంవత్సర ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ ప్రవేశం కొరకు JIPMAT 2025 క్రింది వివరాల ప్రకారం నిర్వర్తిస్తోంది.

| | |
|---|---|
| ఆన్‌లైన్ దరఖాస్తుల ఫారం యొక్క దాఖలు | 11వ ఫిబ్రవరి, 2025 నుండి 10వ మార్చి, 2025కు (మ.11.50 గం. వరకు) |
| ఆన్‌లైన్ దరఖాస్తుల యొక్క ఫీజు దాఖలు | 11వ ఫిబ్రవరి, 2025 నుండి 11వ మార్చి, 2025కు (మ.11.50 గం. వరకు) |
| ప్రత్యేక వివరాలలో కరెక్షన్ | 13వ మార్చి, 2025 నుండి 15వ మార్చి 2025కు |
| పరీక్ష యొక్క తేది | 26వ ఏప్రిల్, 2025 (శనివారం) |
| పరీక్ష యొక్క సమయం | మ.03.00 గం. నుండి సా.05.30 గం.కు |
| పరీక్షా విధానం | కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (CBT) |
| పేపర్ రకం | మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు |

స్కీమ్/వ్యవధి/మీడియం/పరీక్ష యొక్క సిలబస్, అర్హతా ప్రమాణం, తత్కాలికంగా ఇన్‌టేక్, సీట్ల రిజర్వేషన్, పరీక్షా నగరాలు, ముఖ్యమైన తేదీలు వగైరాలు https://exams.nta.ac.in/JIPMAT/ పై ఉంచిన సమాచార బులెటిన్‌లో పేర్కొనబడ్డాయి. పరీక్షలో హాజరు కావటానికి ఆసక్తి గల అభ్యర్థులు, JIPMAT 2025 కొరకు సవివర సమాచార బులెటిన్ చదవవచ్చు మరియు https://exams.nta.ac.in/JIPMAT/ వద్ద ఆన్‌లైన్ మాత్రమే దరఖాస్తు చేయాలి. పరీక్ష ఫీజు SBI & HDFC బ్యాంక్ చెల్లింపు గేట్‌వేను ఉపయోగించి నెట్ బ్యాంకింగ్/డెబిట్ కార్డ్/క్రెడిట్ కార్డ్/UPI ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవలసి ఉంది. సంబంధిత IIMs యొక్క అర్హతా ప్రమాణాన్ని దరఖాస్తుదారులు చెక్ చేసుకోవాలి. అభ్యర్థులు NTA వెబ్‌సైట్ https://exams.nta.ac.in/JIPMAT/ తో టచ్‌లో ఉండవలసినదిగా సూచించడమైనది. అభ్యర్థులు jipmat@nta.ac.in వద్ద NTAకు రాయవచ్చును లేదా 011-40759000 వద్ద NTAకు పిలుపు ఇవ్వవచ్చును.

సం/-
డైరెక్టర్ (పరీక్షలు)
CBC 21354/12/0007/2425


వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యసిద్ధి అవసరం.

న-సి.డబ్ల్యు.వెండైట్

# 'ప్రక్షాళన' మొదలు!

దేశంలో నదులన్నీ జీవనదులే. నదీ స్నానాలకు విశేష ప్రాధాన్యత ఉంది. పర్వదినాలప్పుడు భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఆ నదుల్లో పుణ్యస్నానాలాచరిస్తుంటారు. పన్నెండేళ్లకో సారి ఆయా నదులకు పుష్కరాలూ జరుపుతుంటారు. ప్రస్తుతం మహాకుంభమేళాలో పవిత్ర స్నానాల కోసం జనం తండోపదండాలుగా వచ్చి వెళ్తున్నారు. ఒకరోఇద్దరో కాదు తాజా లెక్కల్ని బట్టి 57కోట్ల మంది స్నానం చేసి వెళ్లారు. అంతటి అమృత స్నానాలు కారణంగా గంగా, యమున, సరస్వతి నదులను త్రివేణి సంగమ పవిత్ర భూమిగానే కొలుస్తాం. కానీ నదీ జలాలు అనేక కారణాల చేత కాలుష్యంతో నిండిపోయాయి. పర్యావరణ శాస్త్రజ్ఞులు వీటి విషయంలో జాగ్రత్తలు చెబుతూనే ఉంటారు. నదులు తమ సహజ స్వరూపస్వభావాలను కోల్పోవడం తెలిశాక వాటి సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంకల్పించిన ప్రభుత్వాలు వాటి మీద పలు కారణాల వలన శ్రద్ధ చూపించలేకపోయాయి. నదుల్లో కాలుష్యం నియంత్రించలేని స్థాయికి చేరుకున్నదని ఏనాడో గుర్తించారు. ఒక అడుగు ముందుకు పడలేదు. ఆయా నదుల్లో మురుగు నీటి ప్రవాహాల వలన కశ్మల కాసారాలుగా పేరుకుపోతున్నాయి. ఇదే పరిస్థితి దేశ వ్యాప్తంగా తారసిల్లుతోంది. పారిశ్రామిక వ్యర్థజలాలే కాదు, ప్లాస్టిక్‌తో కూడిన చెత్తకూడా చివరకు చేరేది ఈ నదీ తీరానికే. నదుల్లో కాలుష్య నియంత్రణకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ప్రత్యేకించి నడుం కట్టిన సందర్భాలు లేవు. జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా అనేక కేసుల్లో వీటి విషయాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నది. గోదావరి, కృష్ణా జలాల్లో సైతం తీసుకున్న జలనమూనాలన్నీ విష లోహాలతో నిండిఉన్నట్లు నివేదికలొచ్చాయి. ఆర్సెనిక్, నికెల్, కాడ్మియం, క్రోమియం వంటి రసాయనిక పదార్థాలు కలిసి ఉన్న ఈ జలాల వలన వాటిని తాగునీరుగా వాడే జనానికి అనారోగ్యహేతువవుతున్నాయి. దేశంలోని 187 నదుల్లో నీరు అత్యంత కాలుష్యాన్ని మోసుకెళ్తున్నట్లు చెప్పుకుంటారు. గంగానదిలోకి ఉత్తరాదిన దాదాపు అన్ని ప్రధాన పట్టణాల నుంచి రోజూ 300కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు వచ్చి చేరుతోందని అంచనా. విష రసాయనాలు, క్రిమిసంహారక మందులు, ఇవిగాక పశు కళేబరాలు, మృతదేహాలు కూడా ఈ నదుల్లో కలిసిపోతుండడం వల్ల పవిత్ర నదులుగా భావించే మనం తీరా స్నానం చేస్తే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరతాయో ననే భయం పట్టుకుంటోంది. అందుకే నదీజలాలు తాగునీటిగా ఉపయోగపడవనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వచ్చేసింది. నదీ కాలుష్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇటీవలనే చేసిన అధ్యయనాన్ని బట్టి గంగానది ఇప్పుడు నీటిలో మలసంబంధిత బ్యాక్టీరియా నిండిపోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఈ నెల 3న సమర్పించిన నివేదికను బట్టి ఈ నది నీటి నాణ్యత స్నానానికి పనికిరాదు. హరిద్వార్‌లోనూ గంగానది కలుషితమైంది. 1986లో కేంద్రప్రభుత్వం గంగానది శుద్ధికోసం 'నమామి గంగే' ప్రాజెక్టు ప్రారంభించింది. వేలాది కోట్లు ఖర్చుచేసినా సత్ఫలితాలు సాధించ లేకపోయారు. అమెరికా, యూరప్ వంటి పశ్చిమదేశాల్లో నదులను అత్యంత శుభ్రంగా ఉంచుకోవడం మనకు తెలిసిన విషయమే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిన రోజుల్లో కూడా మురుగునీటి శుద్ధి పారిశుధ్య సంరక్షణ వంటి విషయాల్లో వెనుకబడి ఉన్నామనే మన కార్యాచరణలో లోపముందన్నది తేటతెల్లం. ఆ నేపథ్యంలోనే యమునా నదీ కాలుష్యస్థాయిలు నానాటికీ పెరిగిపోయా యని పెద్ద చర్చేసాగుతోంది. నిన్నమొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడాయమునా నది కాలుష్యం గురించిప్రచారంజరిగింది. ప్రధాన పోటీ లో ఉన్న ఆప్, భారతీయ జనతాపార్టీలు యమునా నదీ జలాలు ప్రక్షాళనపై విసుర్లు కూడా విసురుకున్నాయి. కానీ చివరకు 'యమునా నది ప్రక్షాళన' తాము చేస్తామంటే తాము చేస్తామని హామీలు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అండదండలు లేకుండా ఇలాంటి మహత్తర కార్యక్రమాలు చేయడం కష్టసాధ్యం. అయినా 'ఆప్' కూడా ఆ పాటే పాడింది. 2020లోనే ఆమ్ ఆద్మీపార్టీ ఢిల్లీ పీఠం ఎక్కినా కేంద్రప్రభుత్వంతో వైరంతో యమునా నదిప్రక్షాళన ఊసేఎత్తలేదు. ఏమైతేనే పాలకులుఎవరైనా, ఏపార్టీ వారైనా ప్రక్షాళన అవసరమేనని ఒప్పుకున్నారు. అనుకున్నట్లుగానే ఈ నెల 16 నుంచి యమునా నది శుద్ధిపనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. నిత్యం పారిశ్రామిక వ్యర్థాలు, 3 కోట్లకుపైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతాల నుంచివస్తున్న మురుగు కూడా దీనిలోనే కలుస్తాయి. 4అంచెల ప్రణాళిక తో ముందుకు వెళ్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడకుండానే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పనులు మొదలయ్యాయి. యమునా నది ఉత్తరాఖండ్ హిమాలయాలను దాటి హర్యానా, యుపి సరిహద్దుల మీదుగా ప్రవహించి ఢిల్లీకి చేరుకుంటుంది. ప్రస్తుతానికి ఈ 57 కిలో మీటర్ల మేర పనులు పూర్తి చేస్తారు. ఢిల్లీని దాటితే మధుర ఆగ్రాల ప్రాంతంలో కూడా నదీజలాలు కాలుష్యమే. నదిశుభ్రం కోసం క్లీనింగ్ ఆపరే షన్ మొదలెట్టారు. ట్రాష్ స్కిమ్మర్లు, వీడ్ హార్వెస్టర్‌లు, డ్రెడ్జి యుటిలిటీ యూనిట్లతో నదిని శుభ్రం చేస్తున్నారు. సుందరీకరణ, కాలుష్యం కలిగించే వ్యర్థాల తొలగింపు జరుగుతోంది. మురుగునీటితో పేరుకుపోయిన మేటలను డ్రెడ్జింగ్ యంత్రాలు తొలగిస్తాయి. ఆ తర్వాత సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంటులను ఏర్పాటుచేయిస్తారు. ఏమయితేనేం ఢిల్లీ విషయంలో కేంద్రం ఓ ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర నదుల్లో కాలుష్యం తొలగించేందుకు కూడా యుద్ధప్రాతిపదికపై నడుం కట్టాల్సిన ఆవశ్యకత ఉంది.



కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.

జార్జి బెర్నార్డ్ షా



మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.

శామ్యూల్ జాన్సన్

## ప్రజావాక్కు



### కుల భావజాలానికి కాలం చెల్లింది!

వైకాపానేత, పులివెందుల శాసనసభ్యులు జగన్ మోహన్ రెడ్డి తన విజయవాడ పర్యటనలో చంద్రబాబు నాయుడుకి తన సామాజిక వర్గానికి చెందిన వారు ఎదగటం ఇష్టం ఉండదంటూ ఒక వ్యర్థప్రేలాపన చేశారు. వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే న్యాయ పోరాటం చేయవచ్చు. జగన్ అందుకు అన్నివిధాలా సహాయ పడవచ్చు. ఇక్కడ కుల ప్రస్తావన అసంబద్ధం, దివాళా కోరు రాజకీయాలకు పరాకాష్ట! గతంలో కులాలమధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందారు. వైకాపా పాలనలో బిటెక్ రవి గారిని కూడా వేధింపులకు గురిచేశారు. మరి ఇదే నీతిసూత్రం అప్పుడు కూడా వర్తించాలి కదా? ఇదే భావజాలం కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఆ పదకొండు స్థానాలు కూడా రావు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఎస్జీటీ ఉపాధ్యాయులకు పరీక్షల విధులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల్లో అధిక భాగం స్కూళ్లలోఒకరు లేక ఇద్దరుఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈఎస్జీటీ ఉపాధ్యాయులకు మార్చి, ఏప్రిల్ నెలల్లోఇంటర్మీడియట్ పరీక్షలఇన్విజిలేషన్ డ్యూటీలు, పదవ తరగతి పరీక్షల ఇన్విజీలేటర్ స్పాట్ వాల్యూయేషన్ విధులు కేటాయిస్తున్నారు. అందువల్ల ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్స్ స్కూల్స్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతున్నది. రాబోవురోజుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల విధులకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీ, స్పాట్‌వాల్యూయే షన్ డ్యూటీల నుంచి ఎస్జీటీ ఉపాధ్యాయులను మినహాయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### మాదకద్రవ్యాల నియంత్రణ ఎక్కడ?

మాదకద్రవ్యాల సమస్య రోజురోజుకు తీవ్రతరమై యువతరాన్ని నిర్వీర్యం చేస్తుంది. మాదకద్రవ్యాల మత్తులో పడి నిండు నూరేళ్ల జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. వీటిని సేవించడంవల్ల కలిగేదుష్ఫలితాలను చిన్నవయసు నుంచే పసిపిల్లలకు వివరించి చెప్పాలి. పాఠశాలలో వీటి దుష్ఫలితాలను గురించి స్పష్టంగా బోధించాలి.

- తూలుగు రమణారావు, అక్కరాపల్లి

### కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు

మహా కుంభమేళా ఫిబ్రవరి 26న వచ్చే శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్ రాజ్ తరలివెళ్తారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వెళుతున్నారు. ఈడిమాండ్‌ను ఆసరాగాచేసుకుని విమానయాన సంస్థలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో రూ.5000 నుండి రూ. 10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30 వేలకు పైనే వసూలు చేస్తున్నాయి. ఈ వారం ఆరంభంలో ప్రయోగ్ రాజ్ నుండి బెంగుళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ. 39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10 వేల లోపు ఉన్న విమాన చార్జీలను కుంభమేళా సమయంలో బెంగుళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా ఈ చార్జీలు మరింత దంచుకోవడం పై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వెంటనే కేంద్ర విమాన మంత్రిత్వ శాఖ ట్రావెల్స్ ఏజెన్సీలపై చర్యలు తీసుకొని విమాన చార్జీలను తగ్గించే విధంగా చేయాలని ప్రయాణికుల విన్నపం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భారత్,బంగ్లా సంబంధాలు

షేక్ హసీనాకు ఆశ్రయం ఇవ్వడం వల్ల బంగ్లా కొంత మనకు దూరం జరిగిన పాకిస్థాన్‌తో అంటకాగడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు భారత్‌లోద్వారా స్కింతయారీలో అమర్త్యసేన్‌తో పాలుపంచుకున్న మహమ్మద్ యూనిస్ పాలకుడుగా బంగ్లాలో నివసించే మైనారిటీలకు ముఖ్యంగా హిందువులకు ఏమాత్రం విశ్వాసం కలిగించిన దాఖలాలు లేవు అదే అతి పెద్ద విషాదం. అయితే భారత్‌కు బంగ్లాకు సాంస్కృతిక సంబంధాలు కూడా ఉన్నాయి. అంత మాత్రమే కాదు భారత్ బంగ్లా మధ్య కుషియారానది రహీంపూర్ కాలువ సంబంధాలు కూడా ఉన్నాయి. కావున ఆ దిశగా భారత్ బంగ్లా అడుగులు పటిష్టంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

### ప్రజల అవసరాలు పట్టించుకోండి

గ్రామాల్లో పాఠశాల, వైద్య శాల, పార్కు, గ్రంథాలయం, పబ్లిక్ టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు ఉన్నప్పుడే గ్రామం సమగ్రా భివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఇంటి పన్ను వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఉచితబియ్యం, బస్సు, రైతుబంధు వంటి పథకాలు ప్రకటిస్తూ ప్రజల అవసరాలను మాత్రం విస్మరిస్తున్నాయి.

- పుట్లూరి రాంనర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

**ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభాలెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్లమంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీ ర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం ఉంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ఒక సమాజపు సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతు లు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయ రానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతి లో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్న మైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగు తుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమా దంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్‌కు వెళ్లినవ్యవసాయ కూలీలు 185 సంవ త్సరాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉండగా తమ వారసు లకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారికతను సాధించి పెట్టేందుకు కృతనిశ్చయంతో, తెలుగుభాషా మాధ్యమంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలున్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ ఛానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి ఛానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్సిటీ లో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సు లున్నాయి. అంతేకాకుండా, మారిషస్ తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక కళానిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియా లో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావితరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈక్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలి యాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠ శాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్ వేల్స్, క్వీన్స్ లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. అమెరికాలో తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది. ఇది గత ఏడు సంవత్సరాలలో 86శాతం పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్



3న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డ మ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతేకాదు మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్యసమ్మేళనం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్‌రికార్డ్స్, తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాదిమంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగిపోని సంఘటన. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాలనుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటిపైకి వచ్చాయి. తెలుగు చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డ్అది. జయహో భారతీయం భారతదేశం, జిజ్ఞాస-భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్రప్రదేశ్ అసోసియే షన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగుఅసోసియేషన్ ఆఫ్‌లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసి యేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్-కువైట్, తెలుగుకళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగుసమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగుకల్చరల్ సొసైటీ నార్తెన్ ఐర్లాండ్, తెలుగు కళాసమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ - న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాడ్మింటన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి - న్యూజిల్యాండ్, తెలుగు కళాసమితి-ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతోపాటు ఆయా దేశాలలో వివిధరాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషనునికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీభాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధాపరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్రశిక్ష విధించిన విషయం చరిత్రచెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తనకాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబులాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈతరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాలపట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు తెలుగులెస్స అన్న నానుడి దేశ భాషలందు తెలుగు లెస్ అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగుమాట్లాడేవారు 15కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్ల మంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగామారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం ఉంది. ●

# పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా?


బి.మధుపాళి

మార్చి, ఏప్రిల్ మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీవిద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నయువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న కొంతైనామెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపైప్రతికూల ప్రభావాలు పడడంతోపాటు గతంకన్న తక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడిపెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణసంబంధ సమస్యలు, గుండెవేగం పెరగడం, శ్వాస మందగించడం, తలనొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయదాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలన్నీ కనిపిస్తాయి. రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాలపట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగాప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతా క్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంతవరకు గుర్తున్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటలకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘశ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కులకన్న ఎక్కువరావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటికన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిపినట్లే అని నమ్మాలి. మనం చదివేచదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తిపలకాలి. నా శక్తి వంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధింగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్యమధ్య పాలు లేదా టీ లాంటివి తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. చదువుతున్న పాఠంలోని ముఖ్యఅంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, డయా గ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటిఅంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడంమంచిది. ఒకసారిరాస్తే పదిసార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. ప్రతిరోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. పరీక్ష రోజునకనీసం 15, 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగంకలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రినిముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. ●

# సామాజిక న్యాయదిశగా వర్గీకరణ అడుగులు

గురం రాంమోహన్ రెడ్డి

సామాజిక సమ న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయి. మహోజ్వాలంగా సాగిన ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం వర్గీకరణ రూపేణ ఫలితాలు అందేందుకు మార్గాలు సుగమవుతున్నాయి. ఎస్సీలకు, ఉపకులాలకు ఎ.బి.సి వర్గీకరణ రూపేణ విద్యా, ఉద్యోగ రంగాల్లో వాటను పొందనున్నారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి వున్నామని అధికారికంగా ప్రకటించింది. ఇచ్చిన మాటకు కట్టుబడి వుండాలన్న సంకల్పంతో జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమీషన్ను నియమించింది. ఎస్సీలోని 59 కులాలు అభిప్రాయాలను ఆలోచనలను మనోగతాన్ని కమీషన్ సేకరించి, నివేదికి రూపొందించి ప్రభుత్వంకు అందజేసింది. ఏక సభ్య కమీషన్ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను రాష్ట్ర కేబినేట్ ఆమోదించి చట్ట సభలైన శాసనసభ, శాసన మండలలో ప్రవేశపెట్టి అధికారిక ప్రకటనను శాసన సభలో ముఖ్యమంత్రి శాసన మండలి ఆర్థికమంత్రి చేసి చర్చకు పెట్టారు. ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను అధికార పక్షంతోపాటు ప్రధాన రాజకీయ పక్షాలు బి.ఆర్.యస్., బి.జె.పి. ఎం.ఐ.ఎం, సి.పి.ఐ పార్టీల సభ్యులు ససమర్థించారు. ఎస్సీలకు, ఉపకులాలకు, మాలలకు సమన్యాయం దక్కే దిశగా అడుగులు పడటాన్ని అన్ని పార్టీలు స్వాగతించిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ అమలు కోసం చట్టం చేయాలా, ఆర్డినెన్స్ తీసుకురావాలన్న యోచనలో నిమగ్నమైంది. గతంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను ఎ.బి.సి.డిగా వర్గీకరణ చేసి విద్య ఉద్యోగ రంగాల్లో అమలు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ రిజర్వేషన్ల ఎ.బి.సి. మాత్రమే అమలు చేయాలని సూచించింది. 9 శాతం ఎస్సీలకు ఉపకులాలకు (ఎ గ్రూప్) 5 శాతం మాలలు ఇతర ఉపకులాలకు "డి గ్రూప్), 1 శాతం ఉపకులాలకు (సి గ్రూపు) మొత్తం 15 శాతం అమలు చేయాలని సూచించింది. ఎస్సీ జాబితాల్లోని మొత్తం కులాలకు సమన్యాయం దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాల్లో ఎస్సీలు 61 లక్షల 84 వేల 319 శాతం జనాభా వున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, ఆర్థిక విద్యా, ఉపాధి రాజకీయ సమగ్ర సర్వేలో వెల్లడైంది. మొత్తం తెలంగాణ జనాభలో ఎస్సీల శాతం 17.43 ఉన్నట్లు సర్వేలో తెలింది. సుప్రీమ్ కోర్టు భారత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునుఅమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చకచకగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎస్సీల (59 కులాల) జనాభా, అక్షరాస్యత ఉపాధి, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల నియమాకాలు, ఆర్థిక



స్థితిగతులను అధ్యాయనం చేసిన కమీషన్ రిజర్వేషన్ల వర్గీకరికరించి ప్రభుత్వంకు సిపార్సు చేసింది. కమీషన్ 199 పేజీల నివేదికలో ఎస్సీల్లోని 59 కులాలపై వివరణాత్మక అంశాలను పొందుపర్చి మూడు గ్రూపులుగా విభజించాలని సూచించిన నేపథ్యం వేగంగా ఆచరణ యోగ్యమైన నిర్ణయాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమిస్తుంది. 2011 జనాభా గణన ప్రకారం గ్రూప్లో అత్యంత వెనుకబడి ఎవరు పట్టించుకోని ఎస్.సి. కులాలకు 1 శాతం, గ్రూపు 2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన 18ఎస్.సి.కులాలకు 9 శాతం (జనాభాలో 62.748 శాతం) గ్రూపు 3లో మెరుగైన ప్రయోజనం పొందిన 26 ఎస్.సి. కులాలకు 5 శాతం (జనాభాలో 33,963 శాతం) రిజర్వేషన్లు కల్పించనున్నది. కమీషన్ గ్రూపు 1లో బావుర్, బుడజంగం, చలాటి, దక్కలి, జగ్గలి, పంబాద, పంబాలో, వంబండ, మాగ్, మన్నే, మస్తీ, మాంగ్ గరోడి, మాతంగి, మోహతర్, ముండాల, సంబన్, సప్రు కులాలకు 1 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నాయి. గ్రూపు 2లోని అరుందతీయ, బైడ్ల, చమర్, మోచి, మూని, చమర్, రవిదాస్, చమర్ రోహిదాస్, చంచర్, చండాల, డోమ్, ఓంబరా, పైడి, పానో, ఎల్లమ్మ వాడ్ల గోడార్, జాంబువులు, ఎస్సీ మాదిగదాసు, మస్తీక, పామిడి, పంచమ, పరియ ప్రమగర, చిందోల్లు, యాటల, వల్లువన్, ఎస్.సి. కులాలకు 9శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గ్రుపు3లోని ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, అనాముక్, అరేమాల, అర్వమాల, బ్యాగర, చలవాడి, డోర్, ఘాసి, చండి, శల్లీ, గోసంగి, హెలియా, హెలియాదాసరి, మాదాసి కురవ, మదారి కురవ, మహర్, మాల, మాలదాసరి, మాలదాసు, మాల హన్యాయ్ మాల జంగం, మాల మస్తీ, నేతకాని, మాలసన్యాసి, మిత అయ్యల్వార్, పాక్, మోత, రేల్లి కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్ల పరిధి నుండి క్రిమిలేయర్ను మినహాయించడానికి వర్గీకరణలోని 4వ నంబర్ (డి గ్రూపు) ను సిఫార్సు నుంచి తొలగించేలాని కమీషన్ సిపార్సు చేసిన క్రమమంలో ప్రస్తుతం గ్రూపు1, గ్రూప్2, గ్రూప్3 వర్గాలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 1999లో ప్రారంభమైన ఉద్యమ ఆకాంక్షలు నేరవేరడానికి బాటలు పడ్డాయి. ప్రకాశం జిల్లా ఇది మూడిలో ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం ఆరంభమై మహాజ్వాలంగా గల్లి నుంచి హస్తిన వరకు 32 ఏళ్లపాటు కొనసాగి విజయ తీరాలకు చేరుకోబోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కదిలించి, మెప్పించి ఒప్పించి ఎం.ఆర్.పి. ఎస్.ఉద్యమం దళిత బహుజనుల్లో శ్రామికు కులాల్లో ఉద్వేగాన్ని నింపి జయగీతం పాడనున్నది. ఇప్పటికే హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్ 19 నుంచి విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుంది. సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు కొరకు ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమబేరిమోగించనున్నది. ●

# అమరావతి వార్త

## ఓటు వెరిఫికేషన్ కొరకు సమాచార కేంద్రం ఏర్పాటు

### -నగర కమిషనరు పులి శ్రీనివాసులు



**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేసుకున్న వారికి ఓటు వెరిఫికేషన్ కోసం గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సమాచార కేంద్రాన్ని(0863 – 2345103) శుక్రవారం నుండి ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐ.ఎ.యస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు చేసుకున్న వారికి నగర పాలక సంస్థ బి.యల్.ఓ లు ఓటు ఎక్కడ ఉన్నది, ఓటు ఏ ఎక్కడ వేయాలి తదితర వివరాలతో కూడిన ఓటర్ స్లిప్పులను గృహాలకు వచ్చి అందజేస్తున్నారన్నారు. ఎవరికైనా ఓటర్ స్లిప్పులు అందకపోతే నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నుండి ప్రత్యేకంగా యం.యల్.సి ఎలక్షన్లకు సంబంధించి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, సదరు కేంద్రంలో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి రాలేని పక్షంలో కాల్ సెంటర్ 0863 – 2345103 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కావున పట్టభద్రుల ఎన్నికల ఓటు నమోదు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించిన ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని గురువారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ప్రగతి కోసం ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయాన్ని అందించాలన్నారు.పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని,



ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఉపాధి కల్పనకు 16 వేల పోస్టులతో మెగా డిఎస్సీని కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుతో పాటు పరిశీలకులు మన్నవ మోహనకృష్ణ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత పై జిల్లాస్థాయి కమిటీ సమావేశం

**గుంటూరు,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** జిల్లాలోని రహదారులపైన ప్రమాదానికి కారణం అవుతున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి వాహనాల ప్రమాదాలు జరగకుండా అక్కడ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసి సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి,ఎస్పీ సతీష్‌కుమార్,జీఎంసి కమిషనర్ పులిశ్రీనివాసులుతో కలసి జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ



సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జాతీయ రహదారులు,ఆర్ అండ్ బి,పంచాయతీ మున్సిపల్ అధికారులతో రవాణా,పోలీసు అధికారులు సంయుక్తంగా రహదారులను తనిఖీ చేసి బ్లాక్ స్పాట్‌లపై 15రోజుల్లో నివేదిక అందించాలన్నారు.జాతీయ రహదారి సర్వీస్ రోడ్లలోనే ఆటోలు,ద్విచక్రవాహనాలు ప్రయాణించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు.ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించేలా తనిఖీలు చేయాలన్నారు.రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి మన రాష్ట్రం వారికే కాకుండా ఇతర రాష్ట్రాల వాహన డ్రైవర్లకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు వైద్యశాల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నందున ప్రమాదాలు జరిగిన సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు బాధితులను తరలించేలా అంబులెన్స్ డ్రైవర్లకు సూచనలు చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రతా నిబంధనలు వాహనదారులు పాటించాలని ట్రాఫిక్ సిగ్నల్స్ కూడళ్ళ వద్ద పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ద్వారా విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు.హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపితే మార్చి 1వ తేది నుండి రూ.1000జరిమానా విధించడం జరుగుతుందని,దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాసమూర్తి,జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి,జాతీయ రహదారుల పిడీ పార్వతీశం,పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య,డిఎంహెచ్ఓ విజయలక్ష్మి,ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి,ఆర్టీఓలు సత్యనారాయణ ప్రసాద్,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి, ఇంటర్ పరీక్షలపై సమీక్ష నిర్వహించిన పల్నాడు కలెక్టరు, ఎస్పీ

**నరసరావుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో పదవ తరగతి, ఇంటర్, గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. వాట్సాఫ్ గవర్నెన్స్‌పై ఈ సందర్భంగా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పల్నాడు జిల్లాను అన్ని అంశాలలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఈ సందర్భంగా సూచించారు.

## మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

### -వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకుల ఆందోళన

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పార్టీ కార్యాలయం ఎదుట



ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని కోదాడ రోడ్‌లోగల పార్టీ కార్యాలయం వద్ద గురువారం పట్టణ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. ఆరుగాలం శ్రమించిన రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కటంలేదని, ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం దారుణమని అన్నారు. మిర్చికి గిట్టుబాటు ధరగా క్వింటాకు రూ.20 వేలు కల్పించాలని, మిర్చి తెగులు వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం (క్రాప్ ఇన్స్యూరెన్స్) ఎకరానికి రూ.50 వేల వంతున కల్పించాలని డిమాండ్‌చేశారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో రైతుల కోసం ప్రవేశపెట్టిన సంస్కరణలన్నీ కన్పించకుండా పోయాయని విచారం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు రైతులకు కనీస మద్దతు ధర వచ్చేలా చూడాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని రైతుల పక్షాన హెచ్చరిస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఈకార్యక్రమంలో పలువురు వైఎస్ ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

**మంచినీరు కలుషితం కాకుండా చూడాలి:**

పట్టణంలోని సీతారామ పురం ప్రాంతంలో గత కొంతకాలంగా కలుషిత మంచినీరు సరఫరా అవుతుండటంతో నాల్గవ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నీరు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్, పట్టణపార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్ గురువారం కోరారు. డ్రైన్లలో మంచినీటి పైపులైన్లు ఉండటం వలన అవి లీక్ అవ్వటం ద్వారా ఇండ్లలోకి కలుషిత నీరు వస్తుందని గత మూడు వారాల క్రితమే ఫిర్యాదుచేసినా అధికారులు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. వెంటనే యుద్ధప్రాతిపదికన పైపులైన్ లీకులు అరికట్టి మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు.

## రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**బాపట్ల, ఫిబ్రవరి20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఎస్పీలను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, పి 4 సర్వే, ఎం.ఎస్.ఎం.ఇ సర్వే, వాట్సాప్ గవర్నెన్స్ తదితర కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా ఎస్.పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మార్చి 1వ తేదీ నుండి మార్చి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మార్చి 18 తేదీ ఉగాది నాటికి పి4 కార్యక్రమాన్ని ప్రారంభించడానికి



ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ఐవిఆర్ఎస్ ద్వారా మరియు క్యూఆర్ కోడ్ ల ద్వారా ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అన్నా క్యాంటీన్ లో అమలు జరుగుతున్న కార్యక్రమాలు దీపం గ్యాస్ పథకం మరియు ప్రభుత్వ హాస్పిటల్లో అమలు జరుగుతున్న కార్యక్రమాలను ఐవిఆర్ఎస్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సాప్ గవర్నమెంట్ ద్వారా అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు సూచించారు. రాష్ట్రంలో సూక్ష్మ చిన్న మధ్యతరగతి పరిశ్రమల సర్వేను మార్చి 25 నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో బాపట్ల జిల్లా నుండి జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి పి ఎర్రయ్య జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎమ్ఈ సర్వేకు సహకరించండి

### -జిల్లా కలెక్టర్ డీ.కె.బాలాజీ

**పెనమలూరు ఫిబ్రవరి20,ప్రభాతవార్త :** సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ఎంఎస ఎమ్ఈ సర్వేకు సహకరించాలని జిల్లాకలెక్టర్ డీకె



బాలాజీ కోరారు.గురువారం జిల్లా కలెక్టర్ తాడిగడప మున్సిపాలిటీలోని పోరంకి జెడ్పీ ఉన్నత పాఠశాల పరిధిలో పర్యటించి ఎంఎస్ఎమ్ఈల సర్వే పనితీరును పరిశీలించారు. సర్వేకు సంబంధించిన సమస్యలపట్ల సిబ్బందిని ప్రశ్నించారు.వాటిలో చిరునామాలు కనుక్కోవడం సమస్యగా మారిందని వాపోగా వాటిని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విత్యుత్‌శాఖ అధికారులకు ఆయన సూచించారు.కేంద్రప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహకారంతో ఎంఎస్ఎమ్ఈకు సమగ్ర మద్దతు అందించడంతో పాటు పోటీతత్వం,బలమైన వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి సంకల్పించిందని, రాష్ట్రప్రభుత్వం ఎంఎస్ఎమ్ఈల నమోదుకు మొబైల్‌యాప్ ఆధారితసర్వేను చేపట్టిందని కలెక్టర్ తెలిపారు.స్టార్టప్ ఇండియా,ముద్ర,పీఎం విశ్వకర్మయోజన,పీఎంఈజీపీ,పీఎంఎఫ్ఎంఈ, సీజీటీఎంఎస్ఈ వంటి పథకాలకు చేయూత నివ్వాలనేది ప్రభుత్వలక్ష్యం అన్నారు.సర్వేపై అపోహలువీడి పూర్తిస్థాయిలో సహకరించాలని వ్యాపార యజమానులను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు,తాడిగడప మున్సిపల్ కమీషనరు భవానీప్రసాద్,విద్యుత్‌శాఖ ఇంజనీరింగు అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై జగన్‌ది కపటప్రేమ

### -ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**రెంటచింతల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** తన హయాంలో రైతాంగ సమస్యలు పట్టించుకోని జగన్ అధికారం కోల్పోయాక రైతుల పక్షాన నిలబడి ఉన్నానంటూ పర్యటనలు చేస్తూ మిర్చి యార్డుకు వెళ్లి రైతులపై కపట ప్రేమ వలకబోస్తూ మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందని



ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సత్రశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతఉల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చేందుకు తన ప్రభుత్వంలో సంస్కరణలు కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యమైనాయని ఆరోపిస్తూ జగన్ మిర్చియార్డులో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. వాస్తవానికి 2020 సెప్టెంబరులో గుంటూరు మిర్చియార్డులో క్వింటా మిరప ధర రూ.12 వేలు ఉంటే రూ.7 వేలు మద్దతు ధర ప్రకటిస్తూ జీవో ఇచ్చింది నీవు కాదా జగన్? అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యంతో రెండు లక్షల ఎకరాల్లో మిర్చిసాగు విస్తీర్ణం తగ్గిందని ఆరోపిస్తున్న జగన్ ఆ విస్తీర్ణంలో రైతులు పత్తి, కందులు, మొక్కజొన్న తదితర పంటలు వేశారన్న అవగాహన లేకుండా మాట్లాడటం తగదన్నారు. రైతులకు రూ.1600 కోట్లు బకాయిలు పెట్టి జగన్ వెళ్లిపోతే నేడు కూటమి ప్రభుత్వం రైతులకు ఆ బకాయిలు చెల్లించిందన్నారు. తన హయాంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన జగన్ తాను మళ్లీ అధికారంలోకి వస్తానని పగటి కలలు కంటున్నాడని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు నేతలు పోట్ల శ్రీనివాసరావు, అల్లం బ్రహ్మారెడ్డి, పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.

## శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణానికి సంబంధించి భవనాల తొలగింపునకు చర్యలు

### -నగర కమిషనరు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణానికి సంబంధించి గుంటూరు నగరపాలక సంస్థ నుండి చేపట్టాల్సిన ప్రభావిత భవనాల తొలగింపు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, టిడిఆర్ బాండ్లు, నష్ట పరిహారాల పంపిణీ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ఆదేశించారు. గురువారం కమీషనర్ తమ చాంబర్ లో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులకు శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులపై జిఎంసి చేపట్టాల్సిన పనులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున జిఎంసి నుండి చేపట్టాల్సిన రోడ్ విస్తరణ పనులను, ప్రభావిత భవనాల తొలగింపు పూర్తి చేయాలన్నారు. భవనాల తొలగింపు అనంతరం ఇరువైపులా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడానికి అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 26 మందికి తాము



కోల్పోతున్న భవనాలకు సంబంధించి నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు 25వ తేదీకి పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సిన వాటికి ప్రాసెస్ మొదలు పెట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. తొలుత ఇంజినీరింగ్ విభాగంలో అధి.కారుల వారీగా పెండింగ్ లో ఉన్న ఈఆఫీస్ ఫైల్స్ ని 2 రోజుల్లో క్లియర్ చేయా లని, డిఈఈలు, ఈఈలు భాధ్యత తీసుకో వాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుంద రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపిలు రెహ్మాన్, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, డిఈఈలు, ఏఈలు, టిపిఎస్ లు పాల్గొన్నారు.

## అమరేశ్వరస్వామికి హారములు, ముత్యాల తలంబ్రాలు అందజేత

**అమరావతి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** శ్రీ అమరేశ్వరస్వామి దేవాలయంలోని ఉత్సవ మూర్తులకు ముత్యాల హారములు మహాశివరాత్రి



సందర్భంగా స్వామివారి కళ్యాణమునకు ముత్యాల తలంబ్రాలను కొల్లిపర లక్ష్మీ నరసింహారావు (బాబు) లీలా కుమారి, విజయలక్ష్మి డైమండ్స్ హైదరాబాద్ వారు సమర్పించారు. వీరి తరపున పులిపాటి వెంకట పవన్‌కుమార్, కోలా వెంకటేశ్వరరావు, కౌశిక ప్రసాదు, ఆలయ కార్య నిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్ కి అందజేయడం జరిగింది.


## ఫుడ్ పాయిజన్‌తో 7గురు పిల్లలకు తీవ్ర అస్వస్థత

**ఎ కొండూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం (చీమలపాడు) పెద్ద తండా గ్రామం ఎస్టీ గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలోని 7గురు పిల్లలు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై మైలవరం గవర్నమెంట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త గురువారం ఉదయం 9.30 గంటలకు పిల్లలకు గుడ్లు అందించిన తర్వాత ఆ గుడ్లు తిన్న 7గురు పిల్లలకు వాంతులు విరేచనాలు ప్రారంభమవ్వడంతో గిరిజన లంబాడా ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో గత గురు శుక్ర శనివారాలు పిల్లలకు గుడ్లు అందించడం నిలిపివేశారు. తిరిగి ఈ కేంద్రంలో ఈ సోమ మంగళ బుధ గురువారాల నుండి తిరిఇ పిల్లలకు గుడ్లు పౌష్టికాహారం అందిస్తున్న నేపథ్యంలో గురువారం పిల్లలకు అస్వస్థతకు గురయ్యారు. ఈ కేంద్రానికి తిరువూరు ఐసిడిఎస్ సిడిపివో మినహా సూపర్‌వైజర్ శివకుమారి ఇన్‌చార్జ్ తహశీల్దార్ రాజ్‌కుమార్ (డిటి) రామచంద్రాపురం విఆర్వో లక్ష్మయ్య తదితరులు కేంద్రానికి వెళ్ళి ఫుడ్ పాయిజన్ గుడ్లను పరిశీలించారు. ఒకపక్క సమీపంలోని కృష్ణారావు పాలెం పంచాయతీ శివారు దీప్లా నగరం పౌల్ట్రీ ఫారంలో ఇటీవల 3వేల ఫారంకోళ్లు బర్డ్‌ఫ్లూ వైరస్‌తో మృత్యువాతపడగా పశు సంవర్ధక ఇతర అధికారులు గుడ్లు మాంసం చికెన్ తినవద్దని హెచ్చరించిన అంగన్ కేంద్రం వారు పిల్లలకు గుడ్లు అందించడం పిల్లల ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసమని గిరిజన లంబాడాలు (నిరక్షరాస్యులు) తిరువూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిపిడివో సూపర్‌వైజర్‌లు కార్యకర్తల వైఖరిని గిరిజన లంబాడాలు తీవ్రంగా ఆక్షేపించారు.

## ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖ గుప్త

### నందిగామ బీజేపీ నాయకుల్లో ఆనందం

**నందిగామ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్త ప్రమాణ స్వీకారం సందర్భంగా నందిగామ మండల ఆర్యవైశ్య సంఘం నందిగామ వాసవి క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల సభ్యులు చవట నాగేశ్వరావు, కేతేపల్లి సత్యం బాబు, కొప్పు మురళి, ఊటుకూరు సత్యనారాయణ న్యాయవాదిగా 4 పర్యాయాలు కౌన్సిలర్ మేయర్‌గా పలు విశ్వవిద్యాలయాలు కార్యదర్శిగా, బిజెపి పార్టీలో పలు పదవులను క్రమశిక్షణ, నిబద్ధత తో పనిచేసిన రేఖాగుప్త పాటు ఢిల్లీ ఎన్నికల్లో పది స్థానాలలో ఆర్యవైశ్యులు గెలుపొందడం అభినందనీయమన్నారు. రేఖా గుప్తాకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హోంమంత్రి అమిత్ షా, బిజెపి శ్రేణులకు ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల సభ్యులు పబ్బతి సీతారాం గుప్తా. కేతేపల్లి ఆంజనేయులు , పబ్బతి కిషోర్ మారం సత్యనారాయణ సముద్రాల ఈశ్వరయ్య అద్దగిరి కృష్ణమూర్తి కొత్త భాను ప్రసాద్ టి సీతారామయ్య కె.సత్యనారాయణ, కామేశ్వరరావు, నకరికంటి వెంకటేశ్వరరావు మహంకాళి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య వాసవి క్లబ్ సంఘ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## మహాశివరాత్రికి ముస్తాబైన లింగాల శివాలయం

**వత్సవాయి పిబ్రవరి 20 ప్రభాతవార్త:** వత్సవాయి మండలం లింగాల గ్రామంలో పవిత్ర మునేటి ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానములో ఈ నెల 26న బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుండి స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమములు జరుగును. ఉదయం 10 గంటల నుండి దేవాలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరుగును. సాయంత్రం 7 గంటల నుండి స్వామి వారి కళ్యాణ మహోత్సవము అత్యంత వైభవంగా జరుగును. ఈ కళ్యాణ



మహోత్సవంలో దంపతులు ఎవరైనా పాల్గొన వచ్చును. ఈ శివాయలం ప్రాంగణంలో సినీ సంగీత విభా వారి మరియు జానపద పాటు నృత్య ప్రోగ్రాం జరుగును. ఈ శివరాత్రి తిరునాళ్లకు భక్తుల సౌకర్యం కొరకు పవిత్ర మునేటి ఒడ్డునా జల్లు స్నానం ఏర్పాటు చేయబడినది. పిండ ప్రధానాల కొరకు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగినది. ఈ మహాశివరాత్రి మహోత్సవము సందర్భంగా మన దేవాలయ ప్రాంగణంలో భక్తులు ఆనందానికి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగినది కావున యావన్మంది భక్తులు వేంచేసి స్వామి వారిని దర్శించుకుని స్వామివారి అన్నాప్రసాదాన్ని స్వీకరించ వలసిందిగాదేవాలయ కమిటీ తెలియజేస్తున్నారు. ఈ ఆలయ వంశపారంపర్య ధర్మకర్త , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శి టీడీ జనార్దన్ ఈ మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజుపాలెం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : బెల్లంకొండ – రెడ్డిగూడెం రైల్వే స్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి గురువారం రైలు నుండి పడిపోయి బలమైన గాయాలతో కనుమూశాడు. ఆయన ఆయస్సు 30–35 మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు తెలియజేశారు. తెలుపు రంగు చొక్కా, సిమెంట్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు



రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందన్నారు. మృతుని వివరాల కోసం రైల్వే ఎస్.ఐ. శ్రీనివాసనాయక్ 9440438356 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## పంట కాలువలో వ్యక్తి అనుమానాస్పద మృతి

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు శివారు పంట కాలువలో వ్యక్తి అనుమానాస్పదంగా గురువారం మృతిచెందాడు. ముప్పాళ్ళ మండలం తురకపాలెం గ్రామానికి చెందిన (40) మక్కెన ఇన్నయ్యగా మృతుడిని గుర్తించారు. తలపై తీవ్ర గాయాలు ఉండటంతో ఆయన మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలంలో పోలీసులు ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## సత్తెనపల్లి పోలీసులకు హోంమంత్రి అభినందనలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్ బాలికల అదృశ్యం కేసులో వెంటనే స్పందించి బాలికలను రక్షించిన పోలీస్ యంత్రాంగాన్ని హోంమం త్రి వంగలపూడి అనిత గురువారం అభినందించారు. గన్నవరం పోలీసులకు బాలికల తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో హైదరాబాద్ వెళ్తున్న బాలికలను సత్తెనపల్లి పోలీసుల సహకారంతో కేసును ఛేధించారు. సత్తెనపల్లి డిఎస్పీ, సి.ఐ., ఎస్.ఐ.లకు హోంమంత్రి స్వయంగా ఫోన్ చేసి అభినందించారు.



## న్యాయవాదులు నిరసన

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** న్యాయవాద చట్టం సవరణ చేసి 2025లో నూతన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టాలనే చర్యను వ్యతిరేకిస్తూ గురువారం కంభాల అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. శుక్రవారం సైతం విధుల బహిష్కరణ ఉంటుందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యశాలను సందర్శించిన వరల్డ్ బ్యాంకు బృందం

**పొన్నూరు, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రస్తుతం వైద్యశాలల పరిస్థితి ఏ విధంగా ఉందన్న



విశేషాలను తెలుసుకొనేందుకు వరల్డ్ బ్యాంక్ బృందం సభ్యులు గురువారం నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని సందర్శించి ఇక్కడి వసతులను, రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. వరల్డ్ బా ్యంక్ బృందానికి నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ ఇక్కడి పరిస్థితులను వివరించారు. ప్రస్తుతం రోగులకు ఏయే వైద్య సేవలు అందిస్తున్నారో...?అదేవిధంగా ఇక్కడ సరిపడ వైద్యులు, వివిధ రోగాలకు సంబంధించిన ఎక్విప్‌మెంట్ ఏ రీతిన ఉందన్న విషయాలను వరల్డ్ బ్యాంక్ బృందం సభ్యులు నమోదు చేసుకొన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తే అదే వారికి జీవన ప్రమాణాలను పెంచుతుందన్నది ప్రభుత్వం యొక్క ఆలోచన. అందులో భాగంగానే వరల్డ్ బ్యాంక్ బృందం సభ్యులు వివిధ వైద్యశాలలను సందర్శించి ఇక్కడ అవసరమైన ఎక్విప్‌మెంట్, తదితర వసతులను నమోదు చేసుకొన్నారు. ఈ వైద్యశాలకు ప్రతి నిత్యం ఎంత మంది రోగులు వస్తున్నారు...? వారికి అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయి...? అందుకు సంబంధించిన ల్యాబ్ వసతులు ఉన్నాయా..?ఏయే ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడి వస్తారన్న విషయాలను డాక్టర్ ఫిరోజ్‌ఖాన్‌ను అడిగి తెలుసుకొన్నారు. తొలుత వైద్యశాలకు వచ్చిన వరల్డ్ బ్యాంక్ కన్సల్టెంట్ గణేష్, మొహిర్ అహ్మదేవ్‌లు వైద్యశాల వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

**గుంటూరు క్రైమ్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుంటూరు కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది.కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మార్కెట్ సెంటర్‌లోని గాంధీపార్కు వెనకాల శ్రీవేంకటేశ్వర విజ్ఞానమందిరంల రోడ్డులో సుమారు 50-55సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మగ వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు అక్కడికి చేరుకొని పరిశీలించి శవాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని శవాగారంలో భద్రపరడం జరిగింది.మృతుని కుడిచేయిపై రోజా అని ఉంది,వివరాలు తెలిసినవారు కొత్తపేట పోలీస్టేషన్ ల్యాండ్‌లైన్ నంబర్ 0863-2221815కు తెలపగలరు.




# నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌గా శ్యామ్

**దుర్గి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో దుర్గికి చెందిన వింజమూరి శా ్యమ్ బ్రోనజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. చెన్నైలో జరుగుతున్న 23వ పారా నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలో హైజంప్‌లో పురుషుల టి-44 కేటిగరిలో వింజమూరి శ్యామ్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి పతకాన్ని దక్కించుకున్నారు. శ్యామ్ విజయంతో ఆంధ్రప్రదేశ్ పేరు జాతియస్థాయిలో గుర్తింపు ఇచ్చింది. వెనుకబడిన పల్నాడు ప్రాంతం దుర్గికి చెందిన శ్యామ్ జాతియస్థాయిలో రాష్ట్రానికి పేరు తీసుకురావటం పట్ల ఎమ్మార్పీయస్ నాయకులు కందుకూరి రమేష్, వింజమూరి సంజయ్, రాయపాటి కోటేశ్వరరావు, రాయపాటి రాము, సురేష్‌లు అభినందనలు తెలిపారు.



# వైభవంగా పుణీతజోజప్ప మహోత్సవం

**దుర్గి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** దుర్గిలో పుణీతజోజప్ప మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ నెల 9వ తేదీ దివ్యపూజ, జెండా ప్రతిష్టతో ప్రారంభమైన మహోత్సవాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గురువారం రెవరెండ్ ఫాదర్ గంటెల మరియదాసు మహోత్సవ సమిష్టిపూజబలితో ఉత్సవాలు ముగిశాయి. స్వామివారిని భక్తులు ప్రతే ్యక దర్శనాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం పుణీతజోజప్ప స్వరూపంతో గ్రామ పురవీధుల్లో బాణాసంచా పేలుళ్ళతో రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.



# విధులను బహిష్కరించిన న్యాయవాదులు

**గురజాల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** న్యాయవాద చట్టం 1960 సవరణ చేసి 2025లో నూతన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టాలి అనే చర్యను పూర్తిగా వ్యతిరేకిస్తూ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండి వీరభద్రుడు ఆధ్వర్యాన న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. శుక్రవారం కూడా విధులు బహిష్కరించనున్నట్లు వీరభద్రుడు తెలిపారు. 2025 సంవరణ చట్టం ద్వారా న్యాయవాద వృత్తికి తీవ్రతమైన చిక్కులు వచ్చేలా ఉన్నాయన్నారు. విధులను బహిష్కరించిన వారిలో చల్లా రామిరెడ్డి, శానంపూడి వెంకటేశ్వరరెడ్డి, కెవి నాగార్జున, బీఎన్‌వి హనుమంతురావు, డివి రాధాకృష్ణమూర్తి, కలివెల ప్రభుదాసు, దుగ్గరాజు అనంతరామయ్య, దాసరి చిరంజీవి, శరత్‌బాబు, షేక్ జానీబాషా, కనకం ఆదినారాయణ, కొంగర హరిసత్యనారాయణ, ఆచంట శ్రీనివాసరావు, జక్కా చెన్నకేశవరావు, బి సుందర జ్యానమ్మ, ఎన్ శ్యామలాదేవి, డి లింగరాజు, ఎం ప్రసాదరావు, కావూరి రామకృష్ణ, చీతిరాల కోటేశ్వరరావు, కత్తి చలమరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, చాగంటి సురేష్, వై నరసింహారెడ్డి, పేరుపోగు సురేష్, చల్లా తిరుమలేశ్వరరావు, కందుకూరి సువర్ణకుమార్, షేక్ సైదావలి, కె మణిదీప్, జక్కా అనిల్, వేల్పుల గురుప్రసాద్, నాగూర్‌మస్తాన్, ఝాన్సీ, మణికంత, అనిల్ తదితరులు ఉన్నారు.

# ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

**వినుకొండ,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** బొల్లాపల్లి మండలం హనుమాపురం గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రమావత్ హైమానాయక్ ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో హైమానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పి ఓదార్చారు.



# ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి : ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**నూజెండ్ల,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు మండలకేంద్రమైన నూజెండ్లలో గురువారం ప్రచారం నిర్వహించారు. కూటమి నేతలతో కలిసి ఉపాధ్యాయులను, పట్టభద్రులు కలిసి కూటమి ప్రభుత్వ విధానాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యువతకు, ఉద్యోగులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న కూటమిని బలపర్చాలని, ఆలపాటిని గెలిపిస్తే ఆ వర్గాలకు మరింత సంక్షేమాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, టిడిపి సీనియర్ నాయకులు పంచుమర్తి భూపతి, లగడపాటి వెంకట్రావు, గంగినేని ఆంజనేయులు, మీసాల మురళియాదవ్, గంగినేని రాఘవ, బచ్చు అంజిరెడ్డి, ముంద్రు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సేద్యపు నీటి కుంటల తవ్వకాల అవకాశం : ఎంపిడిఓ

**యడ్లపాడు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో



భాగంగా పంటచేలలో ఉచిత సేద్యపు నీటి కుంటల తవ్వకాల కోసం అవకాశం ఉందని, దీనికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో హేమలతాదేవీ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం క్షేత్రస్దాయి సహాయకులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అమె పాల్గొని వివరించారు. ప్రతి గ్రామ పంచాయితీకి పది సేద్యపు నీటి కుంటలు, పది ఇంకుడు గుంటలు తవ్వాలన్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని అదేశించారు. సేద్యపు కుంటలు, ఇంకుడు కుంటల ఉపయోగాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గృహాల్లో ఇంకుడు కుంట తవ్వుకునే కుంట తవ్వకానికి 500రూపాయలు, మెటీరియల్ ఖర్చులకు 5వేలు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సుందరరావు, టీఏ మాధవి, జెఈ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ కళాశాలలో జాతీయ సదస్సు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** వర్సిటీలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ గ్రాంట ్స్ కమీషన్ సహకారంతో మార్చి 11,12తేదీల్లో జరగబోయే



జాతీయ సదస్సు కరపత్రాలను ఏఎన్‌యు ఇన్‌చార్జ్ విసి ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు.రీసెంట్ అడ్వాన్ ్సమెంట ్ ఇన్ సాఫ్ట్‌వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ (రసాప్-2025) అనే ఈ సదస్సుకి సెమినార్ డైరెక్టర్,కన్వీనర్‌గా డాక్టర్ కె.విజయ్ కిషోర్ వ్యవహరించనున్నారు.ఈ సందర్భంగా విజయ్ కిషోర్ మాట్లాడుతూ ఈ సదసు ్స యొక్క ముఖ్యఉద్దేశ్యం ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ నందు సాఫ్ట్ వేర్ యొక్క ఆవశ్యకత,సాఫ్ట్‌వేర్ వాడుతూ చేసే పరిశోధనల యొక్క ప్రాముఖ్యతని తెలియజేయడం అని తెలిపారు.ఈ సదస్సుకి కో కన్వీనర్ ట్రెజరర్‌గా డాక్టర్ కె.ఈ.ప్రవల్లిక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎం.గాయత్రి రమ్య,జాయింట ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి,డాక్టర్ కె.సుజన వ్యవహరిస్తారని తెలిపారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి,ఇన్‌చార్జ్ ఓఎస్‌డి ఆచార్య వీఎస్ఎస్ఎన్ రవికుమార్,ఫార ్మశీ కళాశాల ప్రిన్సిపాల ్ ఆచార్య ప్రమీలారాణి,డాక్టర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ప్రత్తిపాటి విస్తృత ప్రచారం

**చిలకలూరిపేట,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణ,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఆయన పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులను కలిసి 8నెలల కూటమి పాలన విజయాలను వివరించి సమస్యలపట్ల అవగాహన ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక విజయం సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. గత పాలకులు విచ్చలవిడితనం, విధ్వంస పాలనతో అందకారంగా మారిన రాష్ట్రాన్ని పునర్నిర్మించే భాద్యతను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన బుజస్కందాలపై వేసుకున్నారని ప్రత్తిపాటి తెలిపారు. పట్టణంలోని ఎస్‌పిటికెఆర్‌యం స్కూల్, సాయి వికాస్, భాష్యం, మోడరన్ పబ్లిక్‌స్కూల్, నారాయణ విద్యాసంస్థలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మిరియాల రత్నకుమారి తదితర నాయకులు పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ ప్రోగ్రాంలో అంగన్‌వాడీలకు శిక్షణ

**పెదకూరపాడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ ప్రోగ్రాం అంగన్‌వాడీలకు నిర్వహించారు. రెండవ విడత మూడు రోజులు ట్రైనింగ్ ముగిసిందని సూపర్‌వైజర్ మున్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలకు అభివృద్ధి, భాషాభివృద్ధిపై అవగాహన కల్పించామని తెలిపారు. గాన జ్యోతికి సంబంధించిన మెటీరియల్ అందించారు.



# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**బాపట్ల,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని



మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల పట్టణములో బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ప్లాస్టిక్ ను అధికంగా ఉపయోగించే ఫాన్సీ దుకాణాలు, హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలపై మునిసిపల్ కమీషనర్ జి.రఘునాథ రెడ్డి ఆదేశాల ప్రకారం శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీ.డి.శ్రీనివాసరావు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్ధాలను గురించి వివారించారు. ప్లాస్టిక్ నివారణపై దుకాణ యజమానులకు అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ వాడకం పై అవగాహన కల్పిస్తూ దుకాణాల నందు గుడ్డ సంచులను ఉపయోగించాలని యజమానులకు సూచించారు. పట్టణ ప్రజలు కూడా ప్లాస్టిక్ సంచులను స్వచందంగా నిషేధించి గుడ్డ సంచులను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణలో భాగ స్వాములు కావాలని ప్రజలను కోరారు.ఈ తనిఖీలలో సచివాలయ సిబ్బంది కూడా ఉన్నారు.

# క్రీడాకారులకు ఉద్యోగాలలో రిజర్వేషన్‌లు

**రేపల్లె(నిజాంపట్నం), ఫిబ్రవరి 20, ప్రభాతవార్తః** క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో



రిజర్వేషన్లు ఉన్నాయని, క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబర్చి రాణించాలని ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్ర అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాల హ్యాండ్‌బాల్ పురుషుల విభాగంలో ఫార్మసి కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 18 వరకు జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి నాకౌట్ నుండి లీగ్ దశకు చేరుకున్నారని తెలిపారు. లీగ్ దశలో ఎంతో ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించారన్నారు. సౌత్‌జోన్ ఇంటర్‌యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ జట్టుకు బి మురళీకృష్ణ, ఎస్ శ్రీమనోహర్‌లు ఎంపికయ్యారని తెలిపారు. పోటీలలో గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి 10జట్లు పాల్గొన్నాయన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, పిడి బుజ్జిబాబు, అధ్యాపకులు నరసయ్య, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం : తెదేపా యువనేత నిఖిల్

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్తః** కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలు చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్ కోరారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం పిడుగురాళ్ల పట్టణంలో ఎన్నికల ప్రచారం జరిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జడ్పీహెచ్ఎస్, స్కాలర్స్ స్కూల్, కస్తూర్బా, ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల ఇంగ్లీస్ మీడియం హైస్కూల్స్‌లలో పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును అభ్యర్థించారు. ఆలపాటి విజయం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె(నిజాంపట్నం), ఫిబ్రవరి 20, ప్రభాతవార్తః జ్ఞానజ్యోతి శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్ఎల్ఎన్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుబానీ అన్నారు. గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుచిత్ర, సూపర్‌వైజర్ శివజ్యోతి, డిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.



# పశుగణనను పరిశీలించిన డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు

**చిలకలూరిపేటరూరల్,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుగణన కార్యక్రమాన్ని గురువారం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వివిధరకాల పశువుల గురించి విషయసేకరణ కార్యక్రమం ఫిబ్రవరి నెలాఖరు వరుకు జరుగుతుందని తెలిపారు. సిబ్బంది పశుగణన చేస్తున్న విధానాన్ని ఎప్పట ికప్పుడు పరిశీలించడం జరుగుతుందన్నారు. మార్చి 1వ తేదినుంచి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను అందచేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని



వినియోగించుకోవాలని కోరారు. పశుభీమా గురించి రైతులు అవగాహన కల్పించుకొని పశువులకు తప్పకుండా భీమా చేయించాలని సూచించారు. వివరాలు కావలసిన వారు పశుసంవర్ధకశాఖ అధికారులనుకానీ, సిబ్బందిని కాని సంప్రదించాలని ఆయన కోరారు.

# తొక్కిసలాట మరణాలకు రైల్వేవ్యవస్థ బాద్యతా రాహిత్యానికి నిదర్శనం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** న్యూఢిల్లీ రైల్వే స్ే షన్‌లో రెండు రోజుల క్రితం జరిగిన తొక్కిసలాటలో 18మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైందని ఈ మరణాలు రైల్వే వ్యవస్థ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సంస్థ సీనియర్ సభ్యులు ఆరోపించారు.స ంస్థ కార్యాలయంలో పర్యవేక్షణ లోపమే మరణాలకు కారణం అంటూ కార్యక్రమం నిర్వహించారు.సమావేశంలో సీనియర్ అధ్యాపకులు సిహెచ్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నో కుటుంబాల ఉసురు పోసుకున్న గత ప్రమాదాల నుండి గుణపాఠాలునేర్చుకోని ఆధికారగణం అలసత్వమే ఆరోజు అక్కడ తొక్కిసలాటగా పరిణమించిందన్నారు.సమావేశంలో విద్యావేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు,సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు కృష్ణారావు,వెంకటరత్నం తదితరులు ప్రసంగించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్తః** ఈనెల 27న జరగనున్న గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని తెలుగు యువత నియోజవర్గ నాయకుడు కొలసాని రాము అన్నారు. గురువారం కూచినపూడిలో ఆలపాటికి ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిర్చిరైతుల పట్ల జగన్‌ది మొసలి కన్నీరు

## - జనసేన రాష్ట్ర నాయకుడు పెంటేల బాలాజీ



**చిలకలూరిపేట,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు రైతుల సమస్యలను గాలికి వదిలేసి ఇప్పుడు మిర్చిరైతుల కోసం ఉద్యమాలంటూ జగన్మోహన్‌రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ మండిపడ్డారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అనేకమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, రైతులగురించి మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని అన్నారు. రైతు భరోసా నిధులు కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వ హయంలో జగన్మోహన్‌రెడ్డి రైతులను మోసం చేశారని, కష్టాలలో ఉన్న రైతులను ఆదుకునేది కూటమి ప్రభుత్వమేనని బాలాజీ స్పష్టం చేశారు. గంటసేపు మిర్చియార్డు తో పాటు పరిసర ప్రాంతాలలో ప్రజల కార్యకలాపాను స్దంభింపచేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన జగన్‌ను, ఆయన అనుచరులపై ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు.

# ఎన్ఆర్ఇజిఎస్ పనులలో అవకతవకలు జరిగితే ఉపేక్షించం

**నిజాంపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండలంలో జరుగుతున్న ఎన్ఆర్ఇజిఎస్ పనులలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేదిలేదని



ఎంపిడిఓ నాగలక్ష్మీ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎపిఓ రవిచంద్ర, టిఎ జాఫర్ , ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం మహిళ వివాహానికి ఆర్థిక సహాయం అందించిన జాష్టి ప్రమీల రంగారావు

**చిలకలూరిపేటటౌన్, ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** పట్టణంలోని 20వ వార్డు సౌదాగర్ వీధిలో ఉన్న పేద ముస్లిం యువతి వివాహానికి ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ డైరక్టర్ జాష్టి రంగారావు సతీమణి జాష్టి ప్రమీల ఆర్థిక సహాయం అందచేశారు. గురువారం జరిగిన ఈ వివాహవేడుకలలో ఆమె పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పవర్ లిఫ్టింగ్‌లో వెంకట వివేక్,చందనలకు మెడల్స్

**గుంటూరు స్పోర్ట్స్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** ఇటీవల మంగళగిరిలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గుమ్మడి పుల్లేశ్వరరావు మెమోరియల్ గుంటూరు డిస్ట్రిక్ ్ట సబ్ జూనియం,జూనియర్,సీనియర్,మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్,బెంచ్ ప్రెస్‌పోటీల్లో స్థానిక ఏటి అగ్రహారంలోని ది సెంట్రల్ స్కూల్లో నిర్వహిస్తున్న కెవిఆర్ ఫిటెనెస్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న కొమ్మాకుల వెంకట వివేక్,కొమ్మాకుల చందన ఈ పోటీల్లో సబ ్ జూనియర్, జూనియర్,సీనియర్,పవర్ లిఫ్టింగ్,బెంచ్‌ప్రెస్ అన్ని విభాగాల్లో పాల్గొన్ని పతకాలు సాధించారని అసోసియేషన్ అధ్యక్షులు,ఫిట్‌నెస్ సెంటర్ అధినేత కొమ్మాకుల విజయభాస్కరరావు తెలియజేశారు.ఈ పోటీల్లో చందన బాలికల సబ్ జూనియర్ 43కేజీల విభాగంలో,మహిళల జూనియర్,సీనియర్ 47కేజీల విభాగంలో పవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్‌ప్రెస్ 6విభాగాల్లో పోటీపడి 4బంగారు పతకాలు,2కాంశ్య పతకాలు సాధించగా,ఇదే పోటీల్లో వెంకట వివేక్ బాలుర సబ్ జూనియర్ 53కేజీల విభాగంలో,పురుషుల జూనియర్,సీనియర్ 59 కేజీల విభాగంలోపవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్‌ప్రెస్ 6విభాగాల్లో పోటీపడి 4సిల్వర్ మెడల్స్,2 బ్రాంజ్ మెడల్స్ సాధించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చెరుకుపల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్తః** ప్రమాదవశాత్తు బస్ బైక్ ఢీ కొని యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కావూరు గ్రామంవద్ద జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ టి అనిల్‌కుమార్ వివరాల ప్రకారం నగరం మండలం పెదమట్లపూడి శివారు లుక్కావారిపాలెంకు చెందిన అట్ల దుర్గాప్రసాద్(25) చెరుకుపల్లి వైపు వస్తుండగా అదే సమయంలో రేపల్లె నుంచి గుంటూరు వెళుతున్న ఆర్‌టిసి బస్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో దుర్గా ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని 108లో మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



# సందేశాత్మకంగా సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్యనాటక ప్రదర్శన

గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : స్థానిక నల్లచెరువులోని 15వ లైన్ పసుపులేటి గోపయ్య కళావేదికపై ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతీ సమితి, విజయవాడ వారి సౌజన ్యంతో మహాశివరాత్రి సందర్భంగా శ్రీనివాస చైతన్య కళా నాట్యమండలి గుంటూరు వారిచే సందేశాత్మకంగా సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక ప్రదర్శన జరిగింది. విశ్వామిత్రుడు తక్కెళ్లపాడు షేక్ మీరావలి, హరిశ్చంద్రులుగా ఆర్.శ్రీనివాసరావు,కలేకూరి వెంకటప్పయ్య, తాటి వీరయ్య,అరిశెట్టి శ్రీనివాస రావు,నక్షత్రకుడిగా అబ్దుల్ రహీం,జి.వేంకటేశ్వర్లు, చంద్రమతిగా నటశిరోమణి ఎస్.వీరమణి, సత్యకీర్తిగా ఎస్.రామారావు,కాలకౌశిక దరిసి శ్రీను,మాతంగిగా జి.పద్మ,వీరబాహుగా కె.వేంకటేశ్వరరావు,కేశవగా




ఆర్.రత్తయ్య పౌరాణిక పద్యాలతో నాటక ప్రదర ్శన చేసి నాటకాభిమా నులను అలరించారు.వీరికి హార్మోనియంపై ఎస్.వీరయ్య,క్లారినెట్ జి.రంగా,డోలక్ పై ఎం.రాంబాబు వాయిద్య సహకారాన్ని అందించారు.కార్యక్రమంలో గుంటూరు కళాకారులు సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు,అమ్మిశెట్టి నాగేశ్వరరావు,సనిశెట్టి సాంబశివరావు,చెన్నుపాటి కృష్ణారావు,కూచిపూడి రత్నకుమారి,తదితరులు పాల్గొని కళాకారులను అబినందించి సత్కరించారు.

# 27న ఉద్యోగస్తులకు ప్రత్యేక సాధారణ శెలవు

**గుంటూరు,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** రాష్ట్ర శాసనమండలిలోని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి పోలింగ్ తేది 27.02.2025న అన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగస్థులు ప్రత్యేక సాధారణ శెలవును వినియోగించుకోవడానికి అనుమతించవలెనని జిల్లా రెవెన్యూ అధికారి తెలియజేశారు.అలాగే ఎన్నికరోజు 27.02.2025న పనిచేసే అన్ని ప్రైవేట్ వ్యాపార మెనేజ్‌మెంట్/ఆథార్టిస్,ట్రేడింగ్స్,ఇండస్ట్రీ ్యల్ అండర్ టేకింగ్స్ లేదా ఇతర సంస్థలు,ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగస్థులు ఎవరైన ఈ ఎన్నికలకు రిజస్టరు ఓటర్లు అయితే వారికి ఓటుహక్కును వినియోగించుకోవడానికి 27.02.2025గురువారం ఉదయం 8నుండి సాయంత్రం 4గంటల వరకు అనుమతిని/ఆలస్యపు అనుమతిని/షిఫ్టల సర్దుబాటు/ విధులకు గైర్హాజరు అగుటకు అనుమతించవలెనని జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి తెలియజేశారు.

# రైతుల నుండి కంది పంట కొనుగోలు

**నూజెండ్ల,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మేరకు రైతుల నుంచి కంది పంట కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి సుగుణాభేగం తెలిపారు. గురువారం మండలంలోని అప్పాపురం రైతు సేవా కేంద్రాన్ని ఆమె సందర్శించి రైతులతో సమావేశం నిర్వహించి రైతులు పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలు వివరించారు. కోసిన కంది పంటను నూర్పిడి చేసి బాగా ఆరబెట్టి శుభ్రం చేసి 12శాతం తేమ ఉండేటట్లు తీసుకురావాలని చెప్పారు. అదే విధంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైన రైతులకు చేకూరే ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పి. అశోక్, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జి కోటేశ్వరరావు, ఐసిఆర్పి రోషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఫండింగ్ కొరకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు విద్య,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : హాబిటాట్స్ ట్రస్ట్ 8వ విడత ఫండింగ్ పంపిణీ కొరకు అర్హులైన సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ది హాబిటాట్స్ ట్రస్ట్ అధినేత రుషికేష్ చవాన్ వెల్లడించారు.స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

# అద్దె చెల్లించని షాపులను సీజ్ చేయండి

## -రెవెన్యూ అధికారిని ఆదేశించిన నగర కమిషనరు పులి శ్రీనివాసులు



**గుంటూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ ల్లో దీర్ఘకాలంగా అద్దె చెల్లించని షాప్ లను సీజ్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్ లోని షాప్ లను పరిశీలించి, సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ల్లో అద్దెకు తీసుకొని, సుదీర్ఘకాలం నుండి అద్దెలు చెల్లించని వాటిని తక్షణం సీజ్ చేయాలని, ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్ లోని 5, 6 షాప్ లను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారి మదన్ గోపాల్ ని ఆదేశించారు. అలాగే కాంప్లెక్స్ లో మొత్తం షాప్ లు, అద్దె బకాయి ఉన్న షాప్ లు, ఖాళీగా ఉన్న షాప్ ల వివరాలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కాంప్లెక్స్ ల వివరాలను సమగ్ర నివేదిక రూపంలో అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఖాళీ షాప్ లకు ఆక్షన్ వేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో రెవెన్యూ అధికారి మదన్ గోపాల్, డి.ఈ.ఈ రమేష్ బాబు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ సదస్సు ప్రారంభం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** ఏఎన్యూలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో నేడు,రేపు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదసు్స డైరెక్టర్ ఆచార్య వై.అశోక్‌కుమార్ తెలిపారు. అంబేద్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో,పొలిటికల్ ఎకనామిక్ ప్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు వర్సిటీలోని డైక్‌మన్ ఆడిటోరియంలో ఉన్న వేణుగోపాల్ రెడ్డి సెమినార్ హాల్లో సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జీ విసి ఆచార్య గంగాధరరావు,కీలకోపన్యాకులుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంట చక్రపాణి,ప్రత్యేక ఆహ్వానితులుగా ఇన్‌చార్జీ రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి,ఇన్‌చార్జీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ఆతిథులుగా మహాత్మాజ్యోతిరావు పూలే అధ్యాయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు,జగ్జీవన్ రామ్ చైర్ డైరెక్టర్ ఆచార్య పిజే రత్నాకర్,ఉమెన్ స్టడిస్ డైరెక్టర్ డాక్టర్ ఈ.వి.పద్మజ,అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం లింకన్ పాల్గొంటారని తెలిపారు.

# డాక్టర్ వసంతరావుకు ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** వర్సిటీలోని విద్యా విభాగంలో అతిథి అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.వసంతరావుకు బెస్ట్ ఎడ్యుకేటెడ్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు లభించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ప్రకటించిన అవార్డుల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ వసంతరావుకు లభించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ విసి ఆచార్య కె.గంగాధరరావు,ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి,ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ తదితరులు వసంతరావును అభినందించారు. ఇలాంటి పరిశోధన అవార్డులు భవిష్యత్తులో మరిన్ని పొందాలని తద్వారా యూనివర్సిటీ పేరు ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని సూచించారు. ఈ సందర్భంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజోమూర్తి,దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్,పూలే అధ్యాయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు,విద్యా విభాగం విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మజీ రావు,బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆలపాటి గెలుపు యువత భవితకు మలుపు : డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి

**పిట్టలవానిపాలెం,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** ఆలపాటి గెలుపు యువత భవితకు మలుపు అని మండల తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి అన్నారు. స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశానుసారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సంగుపాలెం గ్రామంలో ఆలపాటి రాజా విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గ్లోరి యానెట్ సౌపాటి మాట్లాడుతూ ఈనెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థి అయిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు అమూల్యమైన ఓటును ఉమ్మడి వేసి ఘన విజయంతో గెలిపించుకుందామన్నారు. చంద్రబాబు విజన్, లోకేష్ దూకుడు, వర్మ ఆలోచన, మంచితనంతో పాటు ఆలపాటి రాజా అనుభవంతో మన బాపట్ల నియోజకవర్గ యువతకు గొప్ప మేలు జరుగుతుందని, యువతకు విద్య ఉద్యోగ,ఉపాధి అవకాశాల మెండుగా ఉంటాయన్నారు. వీటితో పాటూ ఇప్పటికీ రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత కల్పించారన్నారు. తమ అమూల్యమైన ఓటు ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు వేసి తద్వారా అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కడియాల ప్రసాద్, వెంకటస్వామి, దాసయ్య, నరహరి శీను మరియు పట్టభద్రులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం



**నరసరావుపేట, ఫిబ్రవరి20 ప్రభాతవార్త :** ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కెప్టెన్ బిఎస్ఆర్కె రాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రక్తదానం చేసిన ఎన్‌సిసి అభ్యర్థులను అభినందించారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులను వారు అభినందించారు. డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానం వలన కలిగే ఉపయోగాలను వారు తెలియజేశారు. 18-60 సంవత్సరాల మధ్యలో ఉన్న వారు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చున్నారు. రక్తదానం చేసిన ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ ఎల్.సృజన, డాక్టర్ మురళీధర్, డాక్టర్ వేణుమాధవ్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# టిటిడి పాలకవర్గ సభ్యులు నరేష్ పై బిసి సంఘాలు ఆగ్రహం



**నరసరావుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు నరేష్‌కుమార్‌పై బిసి సంఘీయులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాయకులు బొందిలి శ్రీనివాససింగ్, ఖాశింపీర్, నరసింహ్మ సింగ్, మురళీ, నాగేశ్వరరావులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టిటిడి మెంబర్ నరేష్‌కుమార్ విధులు నిర్వహిస్తున్న బాలాజీసింగ్ అనే వ్యక్తిపై అనుచితమైన పదజాలంతో మాట్లాడటం తగదన్నారు. నీ సంగతి చూస్తానంటూ బెదిరించడం, బూతులు తిట్టడం దారుణమన్నారు. వెంటనే నరేష్ క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నరేష్‌కుమార్‌ను టిటిడి బోర్డు నుండి తొలగించాలని బిసి సంఘాలు డిమాండ్ చేశారు.

# వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను గురువారం నిర్వహించారు. ప్రధాన యోగాచార్యులు డాక్టర్ వెంకటేశ్వర యోగి గురూజీ, ఉప ప్రధాన యోగాచార్యులు శ్రీనివాసకుమార్‌లు శిక్షణా శిబిరానికి హాజరయ్యారు. ఆహార నియమాల గురించి తెలియజేశారు. నాల్గవ ఉచిత యోగా శిక్షణా శిబిరం 28 రోజుల పాటు జరుగుతుందన్నారు. శిక్షణలో చేరినవారు పూర్తి ఆరోగ్యంతో సంతోషంగా జీవనం సాగించవచ్చని శిబిరం నిర్వాహక నందనయోగి, జెల్లి శ్రీనివాసరావు తెలియజేశారు.

# వరికపూడిసెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి



**మాచర్ల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఈ నెల 24న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో వెనుకబడిన పల్నాడు ప్రాంత వాసులకు కలగా మిగిలిన వరికపూడిసెల ప్రాజెక్ట నిర్మాణానికి నిధులు కేటాయించి, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఐ కార్యాలయంలో ఈ నెల 21న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

# నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఫిబ్రవరి20,ప్రభాతవార్త: ప్రజారోగ్యంలో ప్రధాన భూమిక పోషించే డ్రైనేజి నిర్వహణ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యుడు



ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం పట్టణంలో జరుగుతున్న డ్రైనేజి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ చిలకలూరిపేట నినాదం కార్యరూపం దాల్చటానికి మున్సిపల్ విభాగం నిరంతరం కృషిచేయాలని అన్నారు. రాష్ట్రమంతా ప్రతి నెల3వ శనివారం శుభ్రతపై దృష్టి పెడితే చిలకలూరిపేట పట్టణంలో ప్రతిరోజు స్వచ్ఛత, శుభ్రత గురించి ఆలోచించాలని న్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనపడటానికి వీలులేదని, ప్రధాన రహదారులు, కూడళ్లలో చెత్తకుప్పలు కనిపిస్తే సహించేది లేదని మున్సిపల్ అధికారులను ప్రత్తిపాటి హెచ్చరించారు. డ్రైనేజీలో పూడికతీత పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని, తీసిన పూడికను, చెత్తను వెంటనే డంపింగ్ యార్డుకు తరలించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోటప్పకొండలో వేగంగా తిరునాళ్ళ ఏర్పాట్లు

## -ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** కోటప్పకొండలో వేగంగా తిరునాళ్ళ ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఫిబ్రవరి 26వతేదీన



జరగనున్న రాష్ట్ర పండుగ మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. 20 లక్షల మంది భక్తులకు అవసరమైన మంచినీరు, రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోటప్పకొండలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసుకొని జింకల పార్కు, కాలింది మడుగు, పర్యాటక కేంద్రాలలో ప్రత్యేకంగా శానిటేషన్ నిర్వహించామన్నారు. అదే విధంగా కొండపై వ్యాపారాలు చేసుకునేవారికి ఐడెంటి కార్డులను జారీ చేశామన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు స్నానాల ఘాట్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర మంత్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తిరునాళ్ళ విజయవంతానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా గిరి ప్రదక్షిణ మార్గంతో పాటు కొండకు చేరుకునే వివిధ రోడ్లను సిద్ధం చేశామన్నారు. శివరాత్రి రోజున త్రికోటేశ్వర స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్పిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

# బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

## -ఎంఈవో సాల్మన్‌రాజు



**కొల్లిపర,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకోవటం వలన ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. అనంతరం తూములూరు సుగాలీకాలనీ,కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యనందించాలన్నారు. ఆయా కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యామిని,రాధిక,ఆర్‌పీలు మృత్యుంజయరావు,రాధిక,శ్రీలత,సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలసికట్టుగా పనిచేద్దాం ఆలపాటిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం

## -మండల తెదేపా అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి

**కొల్లిపర,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పనిచేసి మన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మంచి మెజార్టీలో గెలిపించుకుందామని మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరులో బీజెపీ,టీడీపీ,జనసేన నాయకులు..అభిమానులు అందరూ కలసి ఆలపాటిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా చిన కోటిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులను..ఉద్యోగులందరూ మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేయాలన్నారు. ఆలపాటి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి కోటిరెడ్డి,కంచర్ల అమృతరాజు,గుదిబండి గోవర్ధనరెడ్డి,అడపా నారాయణరెడ్డి,బొంతు చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఎంహెచ్‌పిఎస్ నాయకులు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో గురువారం సిఎం నారా చంద్రబాబునాయుడు, మైనార్టీ శాఖామంత్రి ఫరూక్




ఫోటోలకు పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు మస్తాన్‌వలి, మాబు, మహ్మద్ రఫీ, ఖాశిం పీరా, జక్రియ, కరిముల్లా, రసూల్, రహమత్‌ఆలీ, బుజ్జి తదితరులు మాట్లాడారు. గత ఆరు నెలల మౌజాన్, ఇమామ్‌లకు సంబంధించిన గౌరవ వేతన బకాయిలను రూ.46 కోట్లను విడుదల చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. మసీదుల మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించడం పట్ల వారు సంతోషం తెలిపారు. పేద ముస్లిం మహిళల వివాహానికి రూ.లక్ష ఆర్థిక సహాయం దుల్హన్ పథకంలో ఇవ్వాలన్నారు. విదేశీ విద్య రుణాలు కూడా అమలు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# శ్రీశైలం మల్లన్న అన్నదాన కేంద్రానికి విజయా పికల్స్

**మంగళగిరి,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం వద్దనుండి విజయా పికిల్స్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి అన్నదాన కేంద్రానికి ఊరగాయ పచ్చళ్ళు ప్రత్యేక వాహనంలో పంపారు. ఈ సందర్భంగా విజయా పికిల్స్ అధినేత కాటూరి రాము మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి రెండు టన్నుల 400కిలోల ఊరగాయ పచ్చళ్ళు పంపుతున్నామన్నారు. సుమారు ఎనిమిది లక్షల 50వేల రూపాయల విలువైన 5రకాల పచ్చళ్లను పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో పికిల్స్ అధినేత కాటూరి రాము,లక్ష్మీకుమారి దంపతులు,మార్కెట్ ఎగ్జిక్యూటివ్ వెంకటరెడ్డి,ఖాదర్‌బాబు,సూపర్‌వైజర్ అశోక్‌కుమార్,ప్రొడక్షన్ ఇన్‌చార్జీ శాంతి వివిధ రంగాల ప్రముఖులు ఆలూరి లోకేశ్వరరావు,బొప్పన రాఘవయ్య,కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్టూవార్టుపురం-వీసి



**బాపట్ల,ఫిబ్రవరి20,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా స్టూవర్టుపురం అంటే దొంగల స్టూవర్టుపురం అని పిలిచేవారు. సామాజికవేత్త లవణం, హేమలత తదితర ప్రముఖుల కృషి కారణంగా అక్కడుండే చాలామంది మారిపోయి, చదువుకొని ఉద్యోగాలు పొంది, ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అలాంటి ఊరి నుంచే వచ్చిన ఓ గిరిజన మహిళ తొలిసారి వీసీగా మారారు. ఆమే సాతుపాటి ప్రసన్నశ్రీ. ఏపీ ప్రభుత్వం ఆమెను రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. వీసీగా తొలి ఎరుకలి సామాజికవర్గ మహిళ కావడం విశేషంసర్దార్ పటేల్ మహావిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన ఆమె తిరుపతి మహిళా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం మొదలుపెట్టారు. ఆంధ్రా వర్సిటీలో ప్రొఫెసర్‌గా రెండు దశాబ్దాలకు పైగా పని చేశారు. గిరిజనుల జీవన స్థితిగతులు, భాషలపై చేసిన పరిశోధనలు చేసి 2021లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి నారీశక్తి పురస్కారాన్ని అందుకున్నారు. 19 గిరిజన భాషలకు అక్షరాలు రాసి అమెరికాలో ప్రతిష్ఠాత్మక ఎన్‌డేంజరెడ్ పురస్కారాన్ని అందుకున్నారు. 125 పరిశోధన వ్యాసాలు రాశారు. ఇప్పటికి 40కి పైగా అవార్డులు అందుకున్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం యాగంటి ప్రచారం

**మాచర్ల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలంటూ మాచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మాచర్ల పట్టణంలోని జర్నలిస్టులను, డాక్టర్లను, మెడికల్ షాపులు, కేసీపీ ఉద్యోగులను కలిసి కరపత్రాల ద్వారా ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ లాంటి నాయకులను శాసనమండలికి పంపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, ప్రైవేటు రంగాల్లోని విద్యావ్యవస్థలు, ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఒకటో నెంబరుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తిక్కా కొండలు, వంగెవరపు కోటేశ్వరరావు, దుర్భాకుల ప్రసాద్, మాచర్ల ఏసోబు, ఎస్టీ సంఘ నాయకులు దేవరశెట్టి బ్రహ్మం, జర్నలిస్టులు మాగులూరి రాంబాబు, పఠాన్‌జాన్‌ఖాన్, పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, సంతోష్, బుచ్చిబాబు, ముక్కంటి, చంద్రశేఖర్, శ్రీకాంత్ ఉన్నారు.

# పాఠశాలలో మద్యం సీసాలు!



మాచర్ల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మద్యం సీసాలు పడి ఉండటం కలకలం సృష్టించింది. తరగతి గదుల మధ్య తాగిపడేసిన మద్యం బాటిళ్ల కుప్ప కనిపించింది. దీంతో ఆ సీసాలు ఎక్కడి నుంచి వచ్చాయి. ఎవరు తాగారు అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. విద్యార్థులను తీర్చిదిద్దే పాఠశాలలో మద్యం సీసాలు వెలుగుచూడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులను శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పట్టభద్రులతో తెదేపా నేతల ఆత్మీయ సమావేశం




కారంపూడి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది, పట్టభద్రులతో మండల తెదేపా నేతలు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. తెదేపా నేతలు పంగులూరు అంజయ్య, పంగులూరు పుల్లయ్యలు మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న కృష్ణా గుంటూరు జిల్లా పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెట్టుబడులు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనకు విశేష కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు ఉన్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్‌యాదవ్, చప్పిడి రాము, బోల్నేడి శ్రీనివాసరావు, మునుగోటి సత్యనారాయణ, కటికల బాలకృష్ణ, మస్తాన్‌జాని, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని



కారంపూడి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.స్వాతి 2024-25 విద్యాసంవత్సరంలో కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పోటీపరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం అనంత శివ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పరీక్ష కోఆర్డినేటర్ గణిత ఉపాధ్యాయుడు భానుప్రకాష్, సహకరించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఎంఈఓలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్‌లు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచి తృతీయ వార్షిక సభ్య సమావేశం

**మంగళగిరి, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ తృతీయ వార్షిక సభ్య సమావేశం గురువారం లిటిల్ విలేజ్‌లోని మీటింగ్‌హాల్లో




జరిగింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ చైరమన్ అనిల్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2023-24 వార్షిక నివేదిక,2023-24ఆర్థిక సంవత్సర ఆడిట్ చేయబడిని ఆర్థిక నివేదిక, 2025-526 మరియు 2026-27 సంవత్సరాల ప్రణాళికలను, మంగళగిరి మరియు పరిసర ప్రాంత ప్రజలకు రెడ్‌క్రాస్ అందించాల్సిన సేవలపై పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి తెలియజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కమిటీ చైర్మన్ అన్నే రత్న ప్రభాకర్ సలహా మేరకు ఈ సమావేశంలోబ్లడ్ డోనర్స్ పేషెంట్లను అనుసంధానం చేయడానికి ఆదునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్లడ్ డోనర్స్ ఆప్ ఒకటి తీసుకురవాలని నిర్ణయించి,కెవిఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో పనిచేయడానికి ఒకకమిటీని ఏర్పాటుచేవారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ వైస్ చైర్మన్ గాజుల శ్రీనివాసరావు,ట్రెజరర్ సెక్రటరీ అందె మురళీ,కార్యవర్గ సభ్యులు షేక్ సలార్,గుంటి నాగరాజు,రెడ్ క్రాస్ సభ్యులు ప్రెగడ రాజశేఖర్,పారేపల్లి నిరంజన్ గుప్తా,అందె రేవంత్,కందు నాగార్జున,బట్టు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్ర ప్రసాద్ గెలుపుకు కృషి

గుంటూరు విద్య,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : కృష్ణా-గుంటూరు జిల్లాల ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యాక్షులు వి.పాండురంగ విఠల్ గురువారం రాజేంద్రప్రసాద్‌ను కలసి వారి గెలుపుకి మద్దతు తెలిపారు. భారతీయ జనతా పార్టీ తరపున వారియొక్క ప్రచార కార్యక్రమంలో పాల్గొంటూ రాజేంద్రప్రసాద గెలుపుకు కృషి చేస్తున్నట్లు పాండురంగ విఠల్ తెలిపారు. గుంటూరు కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ సోదరులు మన ఆప్తులు టిడిపి సీనియర్ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సకల వ్యవస్థలను తమ గుప్పిట్లో ఉండేలా చూసుకుంటున్న కేంద్రం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** రాజ్యాంగాన్ని,సుప్రీంకోర్టును పట్టించుకోకుండా సకల వ్యవస్థలు తమ గుప్పిట్లో ఉండేలా కేంద్రం పావులు కదుపుతుందని ఎన్నికల కమీషనర్ నియామకంతో ధృవపడిందని అవగాహన సంస్థ నిర్వహించిన చర్చలో పాల్గొన్న మేధావులు,విద్యావంతులు మాట్లాడుతూ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న ఎన్నికల కమీషనర్ నియామకం అన్న అంశంపై పాల్గొన్న వారు మాట్లాడారు. చర్చలో విద్యావేత్త,విశ్లేషకులు చంద్రయ్య మాట్లాడుతూ నిష్పాక్షికంగా,స్వేచ్ఛగా జరిగే ఎన్నిక సక్రమంగా పూర్తిచేసే భాధ్యత ఎన్నికల కమీషన్ పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివమ్,విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య తదితరులు ప్రసంగించారు.

# మహిళా సంరక్షణ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి డ్రోనుల వాడకం పెంచాలి



బాపట్ల,ఫిబ్రవరి20,ప్రభాతవార్త: మహిళా సంరక్షణ మీద ఎక్కువ దృష్టి సారించాలని, రోడ్డు ప్రమాదాలను తగ్గించే విధంగా ముందడుగు వేయాలని రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ గారు తెలిపారు.స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం డిజిపి హరీష్ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల ఎస్పీ ఆపై స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి శ్రీహరీష్ మాట్లాడుతూ మహిళా సంరక్షణ, రోడ్డు ప్రమాదాలను తగ్గించుట, డ్రోన్ ల వినియోగం పెంచుట వంటి పలు అంశాలపై చర్చ నంతరం జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రోన్ల వాడకం మరింతగా పెంచాలని తెలిపారు. అనంతరం ఎస్పీ తుషార్‌డూడి జిల్లాలోని పోలీస్ అధికారులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్‌డూడి మాట్లాడుతూ మహిళా సంరక్షణ,రోడ్డు ప్రమాదాల నివారిణ పై రాష్ట్ర డిజిపి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించార న్నారు. శాంతి భద్రతలు అమలు పరచడంలో నూతన ఆవిష్కరణ గురించి త్వరలో జరగనున్న శివరాత్రి ఉత్సవం గురించి మహిళలకి ఏ విధంగా భద్రత పెంచాలి అనే విషయాల గురించి, రోడ్డు యాక్సిడెంట్లను ఏ విధంగా తగ్గించాలి అనే విషయం గురించి పెండింగ్ కేసులను పరిష్కరించే విషయాలపై డ్రోన్ల వాడకం గురించి చర్చించటం జరిగిందన్నారు. రానున్న లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేటట్లు చూసి తద్వారా కక్షిదారులకు న్యాయం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఐ ఎస్ ఐ మార్క్ ఉన్న హెల్మెట్ లనే ధరించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, కొత్త చట్టాల మీద సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. , డ్రోన్లను విరివిగా వాడుతూ పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ ప్రాంతాల్లో వాటి సేవలు ఉపయోగించుకోవాలని, పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతన పూర్తి చేయాలనీ, మహిళలు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాల్లోనూ మరియు గర్ల్స్ హాస్టల్ ప్రాంతాల్లోనూ ఖచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేపించి దాన్ని కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేయాలని, పెండింగ్ లో ఉన్న విదేశీ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, ఎక్కువకాలం పెండింగ్ ఉన్న కేసులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎప్పటికప్పుడు డేటాను అప్లోడ్ చేస్తూ ఉండాలని పోలీస్ స్టేషన్లో అమర్చిన సీసీ కెమెరాలు కచ్చితంగా పనిచేసే విధంగా ప్రతిరోజు చూసుకోవాలని రానున్న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బందిలో హోంగార్డు నుండి అధికారి స్థాయి వరకు ఎవరైనా ఆసక్తి కనపరిస్తే అధునాతన ఆవిష్కరణలకు సంబంధించి పోలీస్ శాఖలో వాటి ఉపయోగాల గురించి వారికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## నేడు చికెన్ కోడిగ్రుడ్లు వినియోగంపై అవగాహన సదస్సు : ఎగ్‌ఫుడ్ మేళా

గుంటూరు ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : ప్రస్తుతం మన రాష్ట్రంలోని కోళ్ళ ఫారాల్లో బర్డ్‌ప్లూ పై వస్తున వదంతుల వలన ప్రజలు కోడిమాంసం,గ్రుడ్లు తినడానికి భయపడుతున్నారు.ఇది ఒక అపోహ మాత్రమే.ప్రస్తుత పరిస్థితుల్లో కోడిగుడ్లు, కోడిమాంసం బాగా ఉడికించి తినటం వల్ల ఎలాంటి హాని జరగదని డాక్టర్ నరసింహారావు సంయుక్త సంచాలకులు, పశుసంవర్ధకశాఖ గుంటూరు తెలియజేశారు.ఈ సందర్భంగా నేడు(21.02.2025) స్థానిక పట్టాభిపురంలోని స్వామి థియేటర్ గ్రౌండ్‌లో చికెన్,ఎగ్‌ఫుడ్ మేళాను ఏర్పాటుచేశారు.ఈ విందుకు హాజరై తమ అపోహలను నివృత్తి చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో జిల్లా ఆధికారులు,కోళ్ళ రైతు సమాఖ్య ప్రతినిధులు సంయుక్తంగా ఈ అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వేదా సీడ్స్ నూతన పరికరాలు అందజేత



గుంటూరు విద్య,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : ర్యాష్ డ్రైవింగ్ వలన ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో గుంటూరు ఎస్పి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న నియంత్రణా కార్యక్రమాలను వేదా సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ అభినందించారు.ఈ సందర్భంగా స్థానిక బృందావన్ గార్డెన్స్,ఎన్టీఆర్ స్టేడియం కూడలి సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ నిబంధనల గురించి 24/7 ఎనౌన్స్‌మెంట్ చేయడానికి అవసరమైన పరికరాలను ఆయన అందజేశారు .ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని,వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు.గుంటూరు ట్రాఫిక్ పోలీసు అభ్యర్ధన మేరకు వేదా సీడ్స్ ఈ పరికరాలను అందించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో వేదీ సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్,ట్రాఫిక్ ఎస్పై డి.శ్రీహరి,శంకర్ నాయక్,రంగారావు,తేలప్రోలు వెంకటరావు,గాజుల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్టుగా గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు



తెనాలి, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త) : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయదారులను నాలుగు కేజీల యాభై గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి డిఎస్పీ బి.జనార్ధనరావు పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో డిఎస్పీ బిజనార్ధన్‌రావు గంజాయి విక్రయదారుల వివరాలు వెల్లడించారు. 2021-22సంవత్సరాలలో గంజాయి కేసులో ముద్దాయిలుగా ఉన్న, కొల్లివర మండలం వల్లభాపురం, గ్రామానికి చెందిన ఆరుమళ్ళ సాహిత్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన రెడ్డి బత్తుల హర్షవర్ధన్‌రెడ్డి, పాముల రిషిబాబు, తెనాలి రామలింగేశ్వరపేటకు చెందిన యర్రమోతు పవన్ ప్రశాంత్, నాజరుపేటకు చెందిన పసుపులేటి వెంకటేశ్వరరావు, గంగానమ్మపేటకు వెలగందుల రమేష్‌లను లభించిన సమాచారం మేరకు ఒన్‌టౌన్ సిఐ వి.మల్లిఖార్జునరావు తమ సిబ్బందితో ఉదయం 11గంటల సమయంలో నాజరుపేటలో వలపన్ని పట్టుకున్నట్లు డిఎస్పీ బి.జనార్ధనరావు తెలిపారు. గంజాయి విక్రయాలను అరికట్టే క్రమంలో ఇక నుండి గంజాయి మత్తును ఆస్వాదించే వారిపై కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం జరుగుతుందన్నారు. కొల్లిపర, తెనాలి మండలాల పరిధిలో అటువంటి వారి లిస్ట్ తమ ద్దగర ఉందన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యశించే కళాశాలలో ఈ గంజాయి విక్రయాలను ఇన్స్టాగ్రామ్ కాల్స్ ద్వారా విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. కళాశాల విద్యార్ధులు గంజాయి మత్తుకు బానిసలు కాకుండా తమ భవిష్యత్తును సక్రమ పద్దతులలో తీర్చిదిద్దుకోవాలన్నారు. గంజాయి విక్రయించిన గంజాయి మత్తును ఆస్వాదించిన సరఫరా చేసిన చట్టపరంగా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. గంజాయి విక్రయ ముఠాను అరెస్టు చేయడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ మల్లిఖార్జునరావును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డిఎస్పీ బి.జనార్ధన్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సిఐ వి.మల్లిఖార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన పనులు పూర్తిచేయాలి

### -స్వర్ణాంధ్ర మ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ

గుంటూరు విద్య,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : స్థానిక ఆంధ్రక్రైస్తవ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించే విదంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీస్కెళ్ల విధంగా గుంటూరు తూర్పు,పశ్చిమ, ప్రత్తిపాడు,పొన్నూరు శాసనసభ్యులు తగిన చొరవ చూపాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగా కోరారు.పార్టీ సిటీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల,అసెంబ్లీ నియోజకవర్గ పార్లమెంట స్థాయి నియోజకవర్గ నాయకులతో జరిగిన సమావేశంలో ఏసు బాబు మాదిగ మాట్లాడారు.అంబేడ్కర్ భవన నిర్మాణం అర్ధాంతంగా నిలిచి పోవడం వల్ల ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సంవత్సరాల తరబడి పనులు జరగడంలో జాప్యం వల్ల ఇంతవరకు అంబేడ్కర్ భవన్ నిర్మాణం పూర్తిస్థాయిలో వినియోగం లోనికి రాకపోవడం దురదృష్టకరమ న్నారు.ప్రభుత్వాలు మారుతున్న మంత్రులు మారుతున్న కలెక్టర్లు మారుతున్న అంబేడ్కర్ భవన్ నిర్మాణంలో మాత్రం ఏ మాత్రం అభివృద్ధి లేదని వాపోయారు. వందలాది మంది ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు జనాభాకు ఉపయోడపడే అంబేడ్కర్ భవన్ నిర్మాణాన్ని ఎందుకు అలా వినియోగం లోనికి రాకుండా గాల్లో పెట్టారోఅర్దం కాని పరిస్థితులు కనిపిస్తున్నాయ న్నారు.భవనాన్ని పూర్తిచేసి గ్రూప్ 1, 2 కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కై పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని జిల్లా కలెక్టర్‌ను, మంత్రులను,ఎమ్మెల్యేలను ఏసుబాబు మాదిగ ఈ సందర్భంగా కోరారు.

# ఎస్ఆర్ఎంలో నూతన బికామ్ కోర్సులు ప్రారంభం

మంగళగిరి,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : ఏపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కోర్సులను విస్తృత పరుస్తోంది.అందులో భాగంగా గురువారం రెండు కొత్త బికామ్ కోర్సులను ప్రారంభించింది.గురువారం నుంచి యూనివర్సిటీలో "అమేయ" పేరిట రెండు రోజులపాటు బిజినెస్ ఫెస్ట్ జరుగుతోంది.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వర్సిటీలోని పారి బిజినెస్ స్కూల్ నూతన బికామ్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.తాత్విక గ్లోబల్ ఎనలికల సంస్థ సీఈవో రుపాబీర్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై కోర్సులను ప్రారంభించారు.ప్రారంభ సభలో వర్సిటీ విసి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. విశిష్ట అతిథి హాజరైన బార్ క్లేస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బాల అయ్యార్,ఐసిఏఐ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ప్రెసిడెంట్ సీఏ రవికిషోరు ప్రసంగించారు. 2025విద్యా సంవత్సరం నుండి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయని పారి బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్ శివకుమారన్ పేర్కొన్నారు.ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని ఆసక్తి గల విద్యార్థులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వెబ్ సైట్లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు.సీఏ చదవాలనుకునే విద్యార్థులకు సిఏ ఇంటిగ్రేటెడ్ బికామ్ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని,అదేవిధంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగాల్లో స్థిర పడాలనుకునే విద్యార్థులకు పింటెక్ అండ్ బ్యాంకింగ్ బికామ్ మంచిదని వివరించారు.కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్,కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఏ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యం అతిధులను సత్కరించింది.



## సామాజిక అసమానతల పోరాట యోధుడు డాక్టర్ పి.రంజన్‌బాబు

గుంటూరు విద్య,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : సమాజంలో సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో దళి వర్గాలను చైతన్య పరచిన తత్వవేత్త డాక్టర్ పి రంజన్‌బాబు అని నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వరగటి వేంకటేశ్వరరావు అన్నారు.డాక్టర్ రంజన్‌బాబు స్వర్ణలతాదేవి ఫౌండేషన్ 7వ వార్షికోత్సవ సందర్భంగా ఏరాటుచేసిన సమాజ సేవకుల అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆయన పాల్గొని ప్రసంగించారు.వెడ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.స్వర్ణలతా దేవి మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా వివిధ రంగాల్లో సేవలు చేసిన 8మందికి అవార్డులు ప్రధానం చేయడం అధినందనీయమన్నారు.కార్యక్రమానికి ఫౌండేషన్ ట్రెజరీ ఎం.సత్యవాణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను పారద్రోలడమే సామాజిక కార్యకర్త కర్తవ్యం అని అన్నారు.ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పి.ఫ్రాంక్ విశ్వనాథ్ మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి మెరుగులు దిద్దడమే ఈ ఫౌండేషన్ లక్ష్యం అన్నారు.వివిధ రంగాల్లో సేవలు అందించిన సామాజిక కార్యకర్తలకు బెస్ట్ సోషల్ వర్కర్స్ అవార్డు ప్రధానం జరిగింది.అవార్డు గ్రహీతల్లో ఏ.కోటయ్య, జి.పద్మ, వై.మహేశ్వరీ,పి.అనూష,ఎం.సువర్ణరాజు,వి.రవి లు ఉన్నారు. కార్యక్రమానికి తొలుత కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటిక అందర్ని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్స్ తాళ్ళూరి అమర్‌నాథ్ ఆర్ బేబి,ఎం.సువర్ణ రాజు.జి.సుబ్బారావు,సాంబశివరావు,కళాశాల ప్రిన్సిపాల్ దీనమ్మ ప్రశాంతి,సరోజిని,జ్యోతి,విద్యార్థులు పాల్గొన్నారు.

# చేతిసంచుల విధానాన్ని విస్తృతం చేద్దాం

### -మునిసిపల్ కమీషనర్ బిశేషన్న



తెనాలి, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త) : విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంలో విపరీతమైనటువంటి విఘత్కర పరిస్థితులు ఏర్పడతాయని భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు చేతి సంచుల వినియోగాన్ని విస్తృతం చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని దశల వారీగా తగ్గించాలని మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న పేర్కొన్నారు. స్థానిక కిరణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో గురువారం ప్లాస్టిక్ వినియోగం అనర్థాలు అనే అంశంపై కిరణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో గురువారం ప్లాస్టిక్ వినియోగం అనర్థాలు అనే అంశంపై కిరణా వ్యాపారులకు ఆ సంస్థలో పనిచేసే కార్మికులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న మాట్లాడుతూ అర్థ దశాబ్ద కాలంగా సమాజంలో ప్లాస్టిక్ వినియోగం దశల వారీగా పెరుగతూ వస్తుందన్నారు. ప్రధానంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాన్ని వివరించారు. గతంలో వినియోగదారులు వ్యాపార కూలికి వచ్చే సమయంలో చేతి సంచులు వెంట తెచ్చుకునే వారిని, ఆ విధానం తిరిగి అమలు చేసుకోవడం ద్వారా చాలా వరకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చని అన్నారు. ప్లాసిటక్ వినియోగం పెరగడం ద్వారా జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ హెలెన్ నిర్మల, కిరణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రం ఉదయశంకర్, ప్రధాన కార్యదర్శి కొప్పురావూరి కిషోర్, మద్దుల వీరభద్రరావు, గోనుగుంట్ల శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు కిరణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వం గా పనిచేస్తుంది

### -వైసీపీ కూటమి పార్టీలకు చింతామోహన్ చురకలు -జగన్,చంద్రబాబుపై మండిపడ్డ చింతామోహన్

మంగళగిరి,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం కోటీశ్వరుల ప్రభుత్వమైంది,. ఎదవాళ్లను గురించి పట్టించుకోవడం లేదని తిరపతి మాజీ ఎంపి చింతా మోహన్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని ఐబిఎన్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఆర్‌డిఏ లో పెద్దపెద్దవాళ్లకే




కాంట్రాక్టర్లు ఇస్తున్నారు.ఎస్సీ,ఓబిసీలకు కాంట్రాక్టు పనులు ఇవ్వడం లేదు,పనులు ఇవ్వకుంటే ఆర్థికంగా ఎదిగేదెట్లా అని ప్రశ్నించారు.కనీసం చిన్న చిన్న వర్కులైనా ఎస్సీ,ఓబిసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.చంద్రబాబు మురిసిపోతున్నాడు,ప్రేమతో ప్రజలు ఆయనకు ఓట్లేయలేదు,.గెలిపించలేదని జగన్‌పై భయంతో కూటమి పార్టీలకు అధికారం ఇచ్చారన్నారు. గ్రామాల్లో టిడిపి పరిస్తితి రోజురోజుకు దిగజారి పోతా ఉందని అన్నివర్గా ప్రజలు నిరాశతో అసంతృప్తిగా ఉన్నారని చెపారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజయవాడలో పోలీసులను ఉద్దేశించి మాట్లాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.పోలీసు అధికారులను బట్టలూడదీస్తా...సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టనని హెచ్చరికలు చేయడం తప్పు, మాట్లాడేటప్పుడు భాష జాగ్రత్తగా వాడాలని జగన్‌ను హితవు పలికారు.జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతానని భ్రమ పడుతున్నాడనీ తండ్రి మరణంతో వచ్చిన సానుభూతి, పాదయాత్రలో ప్రజల్ని నాకు ఒక్కచాన్స్ ఇవ్వండని అడిగితే అదికారం ఇచ్చారని చెప్పుకొచ్చారు.సిబిఐ 11కేసులు జగన్‌పై పెట్టింది. ప్రజా తీర్పు కూడా 11సీట్లే ఇచ్చారు.ఇదిఒక అద్భుతం విచిత్రమని ఎద్దేవ చేశారు.జాతీయ బ్యాంకుల దేశ సంపదలో వర్గీకరణ కావాలి,25శాతం జనాభా కలిగిన ఎస్సీ,ఎస్టీలకు బ్యాంకు అప్పులో 1శాతం లోపు రుణాలు ఇస్తున్నారు.50శాతం పైగా జనాభా ఉన్న ఓబీసీలకు 2శాతం లోపు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని చెప్పారు.75శాతం రుణాలు గుజరాతీలకు, మార్వాడీలే తీసుకుంటు న్నారు.ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసింది కొందరికోసం కాదు అందరికోసం అన్నారు.

**-ఎన్నికల కమీషన్ ఎంపిక ..**

పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత, ఇందిరాగాందీ మనవడు రాహుల్ గాంధీతో మాట్లాడకుండా కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారిని ఎంపిక చేశారన్నారు.ఈవీఎంలే బిజేపిని గెలిపిస్తాఉంది,సుప్రీంకోర్టు లో ఈవిఎంలపై పిటిషన్ పడ్డది, జడ్జిలను మేనేజ్‌చేసి, జడ్జిమెంట్‌ను తారుమారు చేశారని సుప్రీంకోర్టులో అందరూ చెప్పుకుంటు న్నారని ఆరోపించారు.తిరుపతికి రావలసిన రాజధానిని మాఊరు బాబు తుళ్ళూరు కు తెచ్చాడు.60వేల కోట్లు అప్పులు తెచ్చి, ఒక ప్రాంతంలోనే ఖర్చు చేస్తున్నారుని ఆవేదన వ్యక్తంచేశారు.వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిగురించి చంద్రబాబు పట్టించుకోవడం లేదు.రాయలసీమ జిల్లాల్లో రోడ్లు లేకుండా,ఆస్పత్రుల్లో సూది,దూది లేకుండా ఉన్నాయి.బడుల్లో కాలేజీల్లో పరిస్తితులు అధ్వానంగా ఉన్నాయన్నారు.కర్నూలు నుంచి ప్రకాశం జిల్లా వరకు శ్రీకాకుళం, విజయ నగరం,రాజమండ్రి వరకు 14జిల్లాల్లో అభివృద్ధి ఆగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు.పోలవరం ఖర్చుపై కాళేశ్వరం ప్రాజెక్టు లాగా జ్యుడిషియల్ కమీషన్ వేసి,విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నా అన్నారు.దేశంలో దళితులకు తినేదానికి తిండిలేదు. 50శాతం పైగా ఉన్న ఓబిసిల పరిస్థితి కూడా దారుణంగా ఉందని తిరుపతి ఎంపి చింతామోహన్ వివరించారు.

## శాంసంగ్ నుండి గెలాక్సీ ఎ06 5జి

విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త : తమ గెలాక్సీ ఎ06 5జిని మార్కెట్లో విడుదల చేసినట్లు శాంసంగ్ ఇండియా ప్రతినిథులు వెల్లడించారు. 4జిబి ర్యాం, 65జిబి నిల్వతో నలుపు, బూడిద, లేత ఆకుపచ్చ రంగుల్లో లభిస్తుందన్నారు.

# భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి



అమృతలూరు, ఫిబ్రవరి 20, ప్రభాత వార్త: గోవాడలో వేంచేసి ఉన్న శ్రీ బాలకోటేశ్వర స్వామి 121 సంవత్సరాలుగా భక్తుల కోర్కెలను, అవసరాలను తీరుస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇతర రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందారు. 1904 సంవత్సరంలో గోవాడ గ్రామంలో నిర్మించబడిన శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయం భక్తుల అభిమానాన్ని పొందుతూ ఓ విశిష్ట దేవాలయంగా ప్రఖ్యాతి చెందింది. ఒక్కసారి శ్రీ బాలకోటేశ్వరస్వామిని దర్శించుకొంటే తమ కష్టాలన్ని తీరతాయనే నమ్మకం భక్తుల్లో ప్రాచుర్యం పొందింది. ఇంత ప్రాముఖ్యత కలిగిన శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయ నిర్మిణానికి ఆనాడు బ్రహ్మణ కోడూరు వవాస్తవ్యులు కూచిపూడి తిరుపతి రాయుడు నడుముబిగించారు. గోవాడ గ్రామస్తులు, బంధువులు సహకారంతో 1904లో శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయము నిర్మించి మహాశివరాత్రి రోజు ప్రభను కట్టి జాగరణ చేసి ఉత్సవాలు జరిపించడం ప్రారంభించారు. అప్పటి నుండి గోవాడలో మహాశివరాత్రి ఉత్సవాలు రంగ రంగా వైభవంగా జరపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఆలపాటి దేవయ్య అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం మహా శివరాత్రి ఉత్సవాలు జరుపుతూ ఆలయానికి వచ్చిన ఆదాయంతో 1930లో దేవాలయాన్ని నల్లరాయితో పునర్నిర్మాణము చేశారు. శ్రీబాలకోటేశ్వరస్వామికి ఐదు పర్వముల యందు కుడివైపున శ్రీ వీరభద్రస్వామి, ఎడమవైపు శ్రీ పార్వతీ అమ్మవారిని ప్రతిష్టించారు. దేవస్థానం నిర్వాహణకు మాగాణి పంట భూమి 15ఎకరాల 50సెంట్లు ఏర్పాటు చేశారు. 1925లో కావూరుకు చెందిన భక్తురాలు ఆలయ ఆవరణలో అంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. 1942 ఆగష్టు 11వ తేది ఈ దేవస్థానం బాధ్యతలను హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ(ప్రభుత్వం) చేపట్టింది. 5-03-1986 క్రోధన నామ సంవత్సరము మాఘ బహుళ దశమి బుధవారం మూలా నక్షత్ర యుక్త మీన లగ్న పుష్కరాంశ ఉదయం 7.17నిముషాలకు నవగ్రహ దేవతా ప్రతిష్ట జరిగింది. ఎపిలో గల నవగ్రహాలయాల్లో మండల పీఠ, వాహనరూడ, సతీ సమేత, అష్టకోణ, ప్రదక్షణ సహిత ప్రథమ నిర్మిత నవగ్రహాలయము విశిష్టతతో ప్రముఖమైనది. ఈ దేవస్థానముకు వ్యవస్థాపక ధర్మకర్తలు లేరు. శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయము ఆది నుండి స్మార్త పూజానుసారమైన శైవ ఆగమము అనుసరించుచున్నది. శ్రీ బాలకోటేశ్వర స్వామిని మాఘ బహుళ త్రయోదశి నుండి అమావాస్య వరకు రాష్ట్రం నలుమూలల నుండి ఇతర రాష్ట్రల నుండి భక్తులు వచ్చి శ్రీ బాలకోటేశ్వరస్వామిని ప్రత్యేకముగా కొలిచెదరు. గత సంవత్సరం మహాశివరాత్రికి గోవాడ శ్రీ బాలకోటేశ్వర స్వామికి ఆదాయం సుమారు అరకోటి రూపాయలు వచ్చిందని, ఈ సంవత్సరం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఆదాయం పెరుగుతుందని ఇఓ బి.అశోక్‌కుమార్ తెలిపారు. మహాశివరాత్రికి గోవాడ శ్రీ బాలకోటేశ్వర స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి అనుగ్రహం పొందాలని ఇఓ అశోక్‌కుమార్ కోరుతున్నారు.

# న్యాయవాదుల అమెండ్‌మెంట్ బిల్లు రద్దు చేయాలి

### -న్యాయవాదుల ఆందోళన



తెనాలి, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త) : న్యాయవాదుల హక్కులను హరించే అడ్వకేట్ అమెండ్‌మెంట్ బిల్లు నిలిపివేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక కోర్టు భవనముల ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న అడ్వకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్ అమలు చేయడం వల్ల న్యాయవాదులకు జరిగే నష్టాన్ని, ఇబ్బందులను ఏకరు పెడుతూ తక్షణమే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం న్యాయవాదుల హక్కులకు భంగం కలిగించే యాక్ట్‌ను, నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు అడ్వకేట్ నాయకులు, అమెండ్‌మెంట్ యాక్ట్ వల్ల జరిగే నష్టాను ఇబ్బందులను వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును అమలు చేసేందుకు, ఉన్న అభ్యంతరాలు తెలియపరచుకునేందుకు వీలుగా ఈనెల 28వరకు సమయం ఇచ్చిందన్నారు. ఆ తర్వాత అమలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరశిస్తూ దేశ వ్యాప్తంగా న్యాయవాదులు తమ నిరసన గళాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నిరసన ప్రదర్శనలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, అన్నం పిన్నారావు, చింకా సురేష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఎంపిహెచ్‌సిలో ప్రతి గురువారం కిడ్నీ పరీక్షలు ఉచితం

ఎ కొండూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని పర్యవేక్షణలో ఎ




కొండూరు మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (ఎంపిహెచ్‌సి)లో ప్రతి గురువారం కిడ్నీ స్పెషలిస్ట్ డాక్టర్లచే ఉచిత కిడ్నీ పరీక్షలు మరియు ఉచిత వైద్య అందిస్తున్నట్లు స్థానిక ఎంపిహెచ్‌సి డాక్టర్ దివ్య తెలిపారు. గురువారం కిడ్నీ పరీక్షలు వైద్యం అందిస్తారు. అలాగే ఎంపిహెచ్‌సిలో ప్రతి గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కిడ్నీ స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని మండల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎ కొండూరు ఎంపిహెచ్‌సి డాక్టర్ దివ్య కోరారు.

# అంగన్‌వాడీలకు 5అంశాలపై శిక్షణ

కొల్లూరు, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త) : అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు ఐదు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు రిసోర్స్ పర్సన్ సిహెచ్ సుధాకర్, సిహెచ్ శ్రీనివాసరావులు తెలిపారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో సూపర్‌వైజర్, ఫజరున్నీసా ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతులలో సుధాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ముఖ్యంగా ఐదు అంశాలు శారీరక, భాష, మేధో భావోద్వేగా సౌందర్యాలు అయిన నైతిక విభాగాలపై సంయుక్తంగా అభివృద్ధి చెందాలని తరగతులను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ తరగతులు బాగా ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ సాల్మన్, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ఫజరున్నీసా, దోనేపూడి, సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొల్లూరు బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవరణలో....**




కొల్లూరు బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడవ రోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా సిహెచ్ సుధాకర్, సిహెచ్ శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు ఐదు అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అనుసరించి పిల్లలకు విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, కొల్లూరు, దోనేపూడి సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్యాంసంగ్ నుండి గ్యాలక్సీ ఎంపవర్డ్

విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : తమ గెలాక్సీ ఎంపవర్డ్‌ను ప్రారంభించినట్లు భారత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ప్రతినిథులు ప్రకటించారు. నిర్వహకులను శక్తివంతం చేయడం ద్వారా భారతదేశంలో విద్యను మార్చడానికి రూపొందించిన ఒక ప్రత్యేక కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమం రూపొందిచామన్నారు. బోధనా పద్దతుల్లో సాంకేతికతను మేళవించి ఏకీకృతం చేయడం ద్వారా సృజనాత్మకతను విద్యలో ప్రేరేపించడం లక్ష్యంగా సాగే ఈ కార్యక్రమం లెజెండరీ షూటర , 2008 ఒలింపిక బంగారు పతక విజేత అభినవ్ బింద్రా సమక్షంలో ప్రారంభించామన్నారు.ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ లెర్నింగ్ ఈవెంట్ల ద్వారా రేపటి తరగతిగదులకు ఉపాధ్యాయులను సిద్ధం చేస్తుందన్నారు

# జెఇఇ మెయిన్స్‌లో అన్‌అకాడమి విద్యార్థుల ప్రతిభ

విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త : వివిధ ఐఐటిల్లో ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ జెఇఇ మెయిన్ 2025 సెషన్ 1 ఫలితాల్లో తమ విద్యార్థులు 99పర్సంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు అన్ అకాడమి ప్రతినిథి సుమిత్ జైన్ వెల్లడించారు. తమ అధ్యాపకుల అంకితభావం, స్టడీ మెటీరియల్ బలాన్ని, మా హైబ్రిడ్ బోధనా విధానంతో తమ విద్యార్థులు జెఇఇ, నీట్, ఇతర పోటీ పరీక్షల్లో మంచి ప్రతిభతో రాణిస్తున్నారన్నారు.



# ఏజి అండ్ పి ప్రథమ్, థింక్ గ్యాస్ బ్రాండ్ల విలీనం

విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ఇండియా ఎనర్జీ వీక్ 2025 వేదికగా ఏజి అండ్ పి ప్రథమ్ సంస్థ, థింక్‌గ్యాస్ తమ విలీన బ్రాండసంస్థను ఉభయ సంస్థల ప్రతినిథులు వెల్లడించారు. పెట్రోలియం, నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు చైర్‌పర్సన్ డా అనిల్‌కుమార్ జైన్, థింక్‌గ్యాస్ చైర్మన్ అమితవ సేన్‌గుప్తా, థింక్‌గ్యాస్ ఎండి, సిఇఓ అభిలేష్‌గుప్తా సమక్షంలో విలీనబ్రాండ్ కొత్తరూపాన్ని ఆవిష్కరించారు.


# గిన్నీస్ రికార్డు అందుకున్న ఎస్ఎంఫ్‌జి

అమరావతి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : భారతదేశంలో 6వేదికల్లో 517 మంది అభ్యర్థుల పాల్గొనగా అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం కోసం ఎస్ఎంఫ్‌జి ఇండియా క్రెడిట్ గిన్నీస్ వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నట్లు ఇండియా క్రెడిట్ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ స్వామినాధన్ సుబ్రమణియన్ ప్రకటించారు. భారతదేశంలో టైర్2 ప్రాంతాలపై దృష్టిపెట్టి పశువుల సంక్షేమం కోసం పనిచేయడం ద్వారా కంపెనీ 7వ ఎడిషన్ పశువికాస్ డే లో భాగంగా దేశవ్యాప్తంగా ఒకరోజు తమ సంస్థ వెయ్యి శాఖల నిర్వణలో ఏకకాలంలో 40వేల యాజమానుల ద్వారా పశువుల సంరక్షణ శిబిరాల ద్వారా ఈ మైలురాయిని సాధించామన్నారు.

21-2Pg5exH.qxd:21-2Pg5exH.qxd 01/01/01 8:22 AM Page 1



# ఒటిటిలు 'ఎథిక్స్ కోడ్' పాటించాలి




## స్వీయనియంత్రణ సంస్థలు అశ్లీలకంటెంట్ నిషేధించాలి

### కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఇండియాస్ గాట్ లాటెంట్ కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశంలో తీవ్ర దుమారంరేపాయి. ఈక్రమంలో ఐటి నిబంధనల్లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఒటిటిలు, సామాజిక మాధ్యమాలు తప్పనిసరిగా పాటించాలనికేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ'రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండాచూడాలని ఆదేశించింది. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మార్గదర్శకాలు విడుదలచేసింది. ఒటిటి ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు వచ్చాయి. ఐటి నిబంధనల్లోని నైతిక నియమావళిని ఖచ్చితంగా అనుసరించాలని సూచించింది. లేనిపక్షంలో ఆంక్షలు విధించాల్సి ఉంటుందని కూడా ప్రకటించింది. ఆన్‌లైన్ క్యూరెటెడ్ కంటెంట్‌పై సోషల్‌మీడియా తప్పనిసరిగా కేంద్రం చట్టాలను అనుసరించాల్సిందేనని అన్నారు. వయసు ఆధారిత నిబంధనలు విధిగా పాటించాలన్నారు. చట్టంనిషేధించిన కంటెంట్‌ను ప్రసారంచేయ కూడదని నిర్దేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్‌ను రెగ్యులేట్ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కేంద్రం స్పందించింది. స్వీయనియంత్రణ ఉన్న ఒటిటిలు నైతిక విలువలుపాటించాలన్నారు. ఐజిఎల్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించడంతో ప్రముఖ యూ ట్యూబర్ అల్హాబాదియాపై తీవ్రనిరసనలు వ్యక్తం అయ్యాయి. ఆతడి వ్యాఖ్యలపై పలువురు పార్ల మెంటు సభ్యులుకూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు.

సమయ్‌రైనాషోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేసారు. దీనితో పలు రాష్ట్రాల్లో ఆతడిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్‌చేయాలని ఒక పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు అల్హాబాదియా వ్యాఖ్యలపై అసహనం వ్యక్తంచేసింది. అశ్లీల కంటెంట్ నియంత్రించేందుకు చర్యలు తీసుకునే ఆలోచన ఉందా అని సుప్రీం కేంద్రాన్ని స్పందిం చింది. దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసులుసైతం జారీచేసింది.



# భారత్‌లో టెస్లా తయారీ అన్యాయమే!

## మస్క్ పక్కన ఉండగానే ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా దిగ్గజ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత్‌మార్కెట్‌లోకి ఎంట్రీకి సిద్ధం అవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నియామకాలు, షోరూంల ఏర్పాటుకోసం ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే ఈప్రక్రియ ఎంత మాత్రం ట్రంప్‌కు ఇష్టంలేదు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ప్రణాళిక అమెరికాకు అన్యాయం చేయడమే అని అన్నారు. మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలుచేసారు. ఇద్దరూకలిసి ఒక టివి ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు. ప్రపంచంలోని ప్రతిదేశం అమెరికాను వాడుకోడానికి ప్రయత్నిస్తోందని, సుంకాలతో మానుంచి లబ్ధిపొందాలని చూస్తున్నారని అందువల్లనే ఎలాన్‌మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యం అవుతోందన్నారు. భారత్‌నే చూడండి ఆయన భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన వరకూ అది మంచిదే కావచ్చు. కానీ అమెరికాపరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమని ట్రంప్ అన్నారు.

గతవారం ప్రధానిమోడీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోడీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాలసమస్యను పరిష్కరించుకోవడంతోపాటు వీలయినంత సత్వరమే వాణిజ్య ఒప్పందంకోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయంచామని అన్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో టెస్లా అధినేతతో భేటీ అయ్యారు. తర్వాత కొన్నిరోజులకే ఈసంస్థ భారత్‌లో నియామకాలుచేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచే అమ్మకాలు ప్రారంభించనున్నది. అయితే కార్ల తయారీపై మాత్రం టెస్లా నిర్ణయాన్ని ప్రకటించలేదు. భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్లతయారీ సంస్థలుదేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లుపెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేవిధంగా కేంద్రం కొత్తవిధానం తెస్తోంది. దీనితో మస్క్ భారత్‌లో టెస్లా తయారీకి సిద్ధం అవుతున్నారు.



### ఒకప్పటి బహిష్కృతనేత

# ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఒకప్పుడు అసెంబ్లీ మార్షల్స్ బలవంతంగా ఎత్తుకుని బయటకు తీసుకెళ్లిన వ్యక్తి ఇపుడు అదే ఢిల్లీ అసెంబ్లీకి స్పీకర్ అయ్యారు. రోహిణి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తాను పార్టీ స్పీకర్‌గా ఎంపికచేసింది. సుమారు పదేళ్లక్రితం అసెంబ్లీనుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన పాత వీడియోలు ఇపుడు వైరల్ అవుతున్నాయి. 2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. దీనితో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులోపాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే అయిన విజేందర్‌గుప్తాను అప్పటి స్పీకరు ఆరోజు సాయంత్రం నాలుగు గంటలవరకూ సభనుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకుని అసెంబ్లీనుంచి బయటకు తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన అభిమానులు ఇపుడు వైరల్ చేస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా తనను ఎంపికచేయడంపట్ల గుప్తా హర్షంప్రకటించారు. హైకమాండ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ముడా కేసులో 8వేల పేజీలతో

# లోకాయుక్త 'బి' రిపోర్టు!



**మైసూరు, ఫిబ్రవరి 20:** మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికారసంస్థ (ముడా) కుంభకోణంపై కర్ణాటక లోకాయుక్త ఎస్పీ టిజె ఉదేశ్ గురువారం ఎనిమిది పేజీల తాత్కాలిక బి రిపోర్టును కోర్టులో దాఖలుచేసారు. లోకాయుక్త అధికారుల బృందం ముడా దర్యాప్తునకు సంబంధించిన పత్రాలు నాలుగు బ్యాగ్‌ల్లో ప్రజాప్రతినిదుల కోర్టుకు తరలించారు. ఎస్పీ ఉదేశ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దర్యాప్తు జరుగుతోందన్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాలు దర్యాప్తునకు సంబందించిన కీలకమూనవన్నారు. ముడా కుంభకోణం కేసులో సిఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన భార్యకు లోకాయుక్త క్లీన్‌చిట్ ఇచ్చింది.

ఈ కుంభకోణంలో ఆరోపణలపై ఆధారాలు లేవని దాంతో కుంభకోణాన్ని నిరూపించలేమని పేర్కొంటూ లోకాయుక్త పోలీసులు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు లేఖరాసారు. ఐపిసి, అవినీతి నిరోధక చట్టం, కర్ణాటక బూసేకరణ చట్టం వంటి అనేక నిబంధనలను లేఖలోప్రస్తావించారు. అక్రమా లకు పాల్పడినట్ల ఎదుర్కొంటున్న సిఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతితోపాటు నలుగురికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఈకేసులో నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలులేక నిరూపితం కాలేదన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహ మయికి వారంరోజులు గడువు ఇస్తున్నట్లు లేఖలో వెల్లడించారు.

కేసులో దర్యాప్తుసాగుతోందన్నారు. కేసులు నలుగురు నింది తులపై చట్టపరమైన చర్యలు సాధ్యంకాదని తుదినివేదికను కోర్టుకు అందించామని ఎస్పీ ఉదేశ్ అన్నారు. లోకా యుక్తపై సామాజిక కార్యకర్త ఫిర్యాదుదారుడు స్నేహ మయి కృష్ణ స్పందించారు. లోకాయుక్తపై ఆయన విమర్శలు కురిపించారు. రాజకీయ నేతలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. లోకా యుక్తపై తనకు సందేహాలునిజమని రుజువు చేసారన్నారు. లోకాయుక్త అధికారులు తమ ఆత్మలను రాజకీయ నాయకులకు అమ్ముకున్నట్లు వ్యవహరించారని విమర్శించారు. తాను అవసరమైన అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ సిద్ధ రామయ్య పార్వతి మల్లిఖార్జనస్వామి దేవ రాజ్‌లపై ఎలాంటి ఆధారాలేలేవంటూ బీ రిపోర్టు నుదాఖలుచేయబోతున్నారని ఆరోపించారు.



# జెలెన్‌స్కీ ఒక సక్సెస్‌ఫుల్ కమెడియన్

## ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ట్రంప్ వ్యాఖ్యలు వైరల్

**వాషింగ్టన్,ఫిబ్రవరి 20:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఒక విజయవంతమైన కమెడియన్ అని వ్యాఖ్యానించారు. అంతకుముందే తప్పుడు సమాచారం ఉచ్చులో ట్రంప్ ఉంటున్నారని, తనకు రేటింగ్ తగ్గిందని, ఈసారి ఎన్నికలు లేకుండానే జెలెన్‌స్కీ అధ్యక్షుడు కావాలని కలలు కంటున్నారన్న ట్రూత్‌లో పోస్టుచేసారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ రష్యా ఇచ్చిన తప్పుడు సమాచారమే వాస్తవమన్న భ్రమలో ట్రంప్ ఉన్నారని తనకు 57శాతం రేటింగ్ ఉందని ప్రైవేటు ఏజెన్సీలే చెప్పాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రంప్ తప్పుడు సమాచార బబుల్‌లో కొనసాగుతున్నారని చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడికి కోపం వచ్చింది. ఆయనొక సక్సెస్‌ఫుల్ కమెడియన్ అనిపించుకున్నారని అలాగే కొనసాగుతారని భావిస్తున్నట్లు పోస్టుచేసారు.అంతేకాకుండా రష్యాతో మొదట ఉక్రెయిన్ వివాదాన్ని ప్రారంభించిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. 350 బిలియన్ డాలర్లు అమెరికా ఖర్చుచేసినా యుద్ధంలో విజయం సాధించలేకపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యా నించారు. అమెరికా లేకుండా రష్యాసేనలను ఢీకొనడం కష్టమేనని గతంలోనే జెలెన్‌స్కీ చెప్పిన సంగతి తెలిసిందే. అమెరికా లేకుండా ఉక్రెయిన్ ఈసమస్యను ఎప్పటికీ పరిష్కరించుకోలేదని ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేస్తున్న వ్యాఖ్యలు రష్యాకు మద్దతిచ్చేవిగా ఉన్నాయని, తనకు ఎన్నికల్లో రేటింగ్ నాలుగుశాతంగా ఉందని చేసిన వ్యాఖ్యలు రష్యా ఇచ్చిన తప్పుడు సమాచార మేనన్నారు. మొదట వివాదం తామే ప్రారంభించామని చెప్పడంకూడా విడ్డూరంగా ఉందని రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోకి జెలెన్‌స్కీ అమెరికాను లాగుతున్నారని ట్రంప్‌చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. యూరోప్‌కంటే అమెరికా 200 బిలియన్ డాలర్లు వ్యయంచేసిందని, యూరోప్ సొమ్ములకు గ్యారంటీ ఉందని, అమెరికా ఎప్పటికీ వెనక్కీ తీసుకోలేదని అన్నారు. ఈ యుద్ధం అమెరికాకంటే యూరోప్‌కే ఎక్కువ ప్రయోజనకరమని వేర్పాటుకు మధ్యలో ఒక పెద్ద సముద్రం ఉందన్నారు.


## 30 యేళ్ల క్రితం కేసులో

# మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు..

**ముంబయి, ఫిబ్రవరి 20:** దాదాపు 30 ఏళ్ల క్రితం మోసానికి పాల్పడిన కేసులో ఎన్సీపి నేత, మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కొకతేకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడికి జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ నాసిక్ కోర్టు తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి దివంగత టిఎస్ డిఘొలే అప్పట్లో చేసిన ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. 1995 నాటి ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్‌రావ్ మాట్లాడుతూ ఈకేసులో తనకుబెయిల్ మంజూరైందని తెలిపారు. ఈతీర్పుపై అప్పీల్‌కు వెళతానని చెప్పారు.

## కుంభమేళాలో స్నానంచేస్తున్న మహిళల విడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు

### కేసు నమోదు చేసిన యుపి పోలీసులు



**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 20:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 55కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళా భక్తుల వీడియోలు విక్రయిస్తున్న రెండు సామాజిక ఖాతాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు యుపి పోలీసు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల గోప్యత, గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వీడియోలను కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తున్నాయి. సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ దీన్ని గుర్తించింది. దీనిపై కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించేందుకు మెటా నుంచి వివరాలు కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు మరో కేసు నమోదయింది. వీటిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహాకుంభమేళాకు సంబంధించి అభ్యంతకరమైన, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 నాటికి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలుచేసే భక్తులసంఖ్య 60 కోట్లుదాటే అవకాశంఉందని అంచనా వేస్తు న్నారు. తొలుత దీనికి 45కోట్లమంది మాత్రమేవస్తారని అంచనావేయగా ఊహించనిరీతిలో భక్తులు పోటెత్తారు.

# శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

**కొలంబో, ఫిబ్రవరి 20:** శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి చెందాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. రైలులోని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఏనుగుల గుంపును ఢీకొన్న రైలు పట్టాలు తప్పింది. కొలంబోకు తూర్పున ఉన్న హబరానాలోని వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్టులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గాయపడిన రెండు ఏనుగులకు చికిత్స అందిస్తున్నారు. శ్రీలంకలో గత యేడాది ఏనుగుల వల్ల 170 మంది మృతి చెందారు. అయితే వేర్వేరు ఘటనల్లో 500 ఏనుగులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. లంకలో సగటున ప్రతి యేడాది సుమారు 20 ఏనుగులు రైలు ఢీకొనడం వల్ల మృతి చెందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అడవుల నరికివేత వల్ల జంతువులు మానవ ప్రదేశాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో రాత్రి పూట రైళ్లను నెమ్మది నడపాలని, హారన్లు ఇవ్వాలని డ్రైవర్లకు ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. శ్రీలంలో సుమారు ఏడువేల ఏనుగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బౌద్ధ మతస్తులు ఆ జంతువుల్ని పవిత్రంగా భావిస్తారు. ఏనుగుల్ని చంపితే అక్కడ జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

### ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

# పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దాంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన 2022, జనవరి 28న సిఇఎగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతోపాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం ఆయన కార్యాలయం బాధ్యత. మాజీ క్రెడిట్ సూయిస్ గ్రూప్ ఎజి, జూలియస్ బేర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్, విద్యావేత్త అయిన నాగేశ్వరన్.. కెవి సుబ్రమణియన్ స్థానంలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియామకయ్యారు.

ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో మందగమన సంకేతాల మధ్య 2024-25 ఆర్థిక సర్వే రాబోయే ఆర్థిక సంవత్సరానికి 6.3-6.8 శాతం వృద్ధి రేటును అంచనా వేసిన కొద్దివారాల తర్వాత.. నాగేశ్వరన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్రం అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 6.4 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. నాగేశ్వరన్ సిఇఎగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు.. 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో పార్ట్‌టైమ్ సభ్యుడిగా పని చేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూళ్లకు పని చేశారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎంబిఎ) డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆయన ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, క్రియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

### జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందన్న లోక్‌పాల్‌కు

# సుప్రీం నోటీసులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకర మంటూ ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది. హైకోర్టు సిట్టింగ్ అదనపుజడ్జిపై దాఖలైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారి స్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టి స్టే విధించింది.

# తూర్పు ఐరోపా నుంచి అమెరికా దళాలు వెనక్కి!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ మేరకు జర్మనీ పత్రిక బిల్డ్ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. 1990 తర్వాత నాటోలో చేరిన దేశాల్లో ఉన్న అమెరికా సేనలను వెనక్కి పిలిపించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అల్బానియా, బల్గేరియా, క్రొయేషియా, ఎస్తోనియా, ఫిన్‌లాండ్, హంగేరీ, లాత్వియా, లిథువేనియా, మాంటెనెగ్రో, నార్త్ మెసిడోనియా, పోలాండ్, రొమానియా, స్లొవేకియా, స్లొవేనియా, స్వీడన్‌ల నుంచి దళాలు వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. వీటితోపాటు ఇటలీ, కొసావో నుంచి అమెరికా దళాలు వైదొలిగే అవకాశాలున్నాయి.

ముఖ్యంగా బాల్టిక్ దేశాల నుంచి దళాలను వెనక్కి రప్పించడంపై ట్రంప్ సానుకూలంగా స్పందించొచ్చని అధికార వర్గాలు నమ్ముతున్నాయని ఫైనాన్షియల్ పత్రిక పేర్కొంది. దీనిపై లథువేనియా అధ్యక్షుడు స్పందిస్తూ.. అమెరికా-ఐరోపా సైనిక సహకారం భవిష్యత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అమెరికా దళాలను వెనక్కి తీసుకొంటుందనే సంకేతాలు ఇప్పటివరకు లేవన్నారు.

తూర్పుఐరోపాలోని పోలాండ్‌లో అమెరికా దళాలు అత్యధికంగా ఉన్నాయి. వీరి సంఖ్య 10,000కు పైగా ఉండొచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ముగించేలా ట్రంప్ హడావుడిగా చర్యలు చేపట్టారు. కాస్తభూమితో పోయేదాన్ని యుద్ధం వరకూ తీసుకొ చ్చారని జెలెన్‌స్కీనే ట్రంప్ నిందించారు. ఈ క్రమంలో తాజాగా తూర్పు ఐరోపా నుంచి సేనల విరమణ కూడా రష్యాకు సానుకూలంశం అవుతుంది.

**పెంటగాన్ రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని ఆదేశాలు**

పెంటగాన్‌ని డిఫెన్స్ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సే ఆదేశాలు జారీ చేశారు. యేటా 8 శాతం చొప్పున తగ్గించుకొంటూ రావాలని పేర్కొన్నారు. ఈ కోతలను ఫిబ్రవరి 24 నాటికి సిద్ధం చేయాలని వెల్లడించారు. బడ్జెట్ తగ్గింపుల నుంచి 17 విభాగాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. వీటిల్లో అణ్వాయుధాలు, అమెరికా దక్షణ సరిహద్దుల్లో కార్యకలాపాలు, మిసైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లు వంటివి ఉన్నాయి. గతేడాది అమెరికా 850 బిలియన్ డాలర్లను రక్షణ కోసం వెచ్చించింది. 2023 నాటికి దీనిలో 300 బిలియన్ డాలర్లను తగ్గించాలని హెగ్సే లక్ష్యంగా పెట్టుకొన్నారు.

# చైనాతో అమెరికా ఒప్పందం!

## వాణిజ్య యుద్ధ భయాల వేళ ట్రంప్ పచ్చజెండా

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** దూకుడు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. డ్రాగన్‌తో ట్రేడ్ వార్ డీల్ రూపుదాల్చే అవకాశం ఉందని తాజాగా వ్యాఖ్యలు చేశారు. 2020లోనే చైనాతో ఒక గొప్ప వాణిజ్య ఒప్పందం జరిగిందని మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరుగుతుందన్న ఆందోళనల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన నోటిలో టారిఫ్ పదమే వినిపిస్తోంది. దానికి తగ్గట్టే మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా అన్ని దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని తేల్చి చెప్పారు. వాణిజ్య లోటును తగ్గించుకోవడం కోసమే ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి చైనా కూడా కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జి) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్లు తెలిపింది. ఇలా ఒకరిపై ఒకరు పరస్పర సుంకాలు విధించుకుంటున్న తరుణంలో ట్రంప్ నుంచి ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# రాష్ట్రంలో అత్యంత శక్తిమంతమైన, సమర్థవంతమైన పాలన సాగుతోంది

## - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో అత్యంత శక్తివంతమై,సమర్ధవంతమైన ప్రభుత్వపాలనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సాగిస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.గత ప్రభుత్వం ఆర్థికరంగంలో చేసిన విధ్వంసాన్ని గుర్తించి, పరిస్థితిని చక్కదిశే దిశలో ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తున్నామన్నారు.తమంతా ప్రతి విషయంలోను సమన్వయంతోనే కలిసి ముందుకెళ్తున్నాం పవన్ కల్యాణ్ తెలిపారు.ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత ఎన్డీఏ నేతలందరికీ భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విందును ఏర్పాటు చేశారు. విందుకు హాజరై బయటకు వస్తున్న సమయంలో పవన్‌తో జాతీయ మీడియా కాసేపు చిట్‌చాట్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏపీలో తాజా పరిస్థితులపై మీడియా అడిగిన ప్రశ్నలకు పవన్ సమాధానం ఇచ్చారు.వెన్నునొప్పితో ఏపీలో కొన్ని భేటీలకు హాజరుకాలేకపోయానని పవన్ కల్యాణ్ అన్నారు. ఇప్పటికీ వెన్నునొప్పి తీవ్రంగా బాధిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందన్నారు.పవన్ జగన్ అప్పుల కుప్పగా మార్చినందున ఆర్థిక ఇబ్బందులు చవిచూడాల్సి వస్తుందన్నారు.వాటి ప్రభావం ప్రజలపై లేకుండా సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు.పర్యావరణ, అటవీశాఖలు నాకు ఇష్టమైన శాఖలని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.నిబద్ధతతో నా మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నా అన్నారు.ఏపీ పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధిని తాము అధికారంలోకి అడుగుపెట్టిన తరువాత గాడిలో పెట్టామన్నారు.జల్‌జీవన్ మిషన్ అమలులో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు.ఇందుకు అవసరమైన నిధులను కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ తెప్పించుకుంటున్నామన్నారు.గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుతున్నాయన్నారు.అన్ని మోలిక వసతుల కల్పనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.సనాతన ధర్మం పట్ల తనకు అపారమైన నమ్మకం,గౌరవం ఉన్నాయన్నారు.తాను వాటిని ఆచరిస్తున్నా అన్నారు.ప్రధాని తన పట్ల అభిమానంతో " హిమాలయాలకు వెళ్తున్నావా ! అని చమత్కరించారన్నారు.తాను ఆయన చెప్పినట్లే బాధ్యతగా వ్యవహరిస్తున్నానన్నారు.ఈ దేశంలో అత్యుత్తమ సంస్కరణలతో,చప్రజల పట్ల బాధ్యత కన్పరుస్తూ ప్రధాని మోడీ పరిపాలన అందిస్తున్నారన్నారు.ఆయన పట్ల ప్రజాభిమానానికి నిదర్శనం ఢిల్లీలో 27ఏళ్ళ తరువాత బిజెపి అధికారంలోకి రావడమన్నారు.ఇది సామాన్య విషయం కాదన్నారు.





స్వర్ణశోభితంగా కనువిందు చేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ దృశ్యం (ఇన్‌సెట్‌లో) కన్నప్ప

# భోళాశంకరుని సన్నిధిలో మహాశివరాత్రి సంబరాలు

## నేడు కన్నప్ప ధ్వజారోహణతో శివరాత్రికి శ్రీకారం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** తిరుపతి జిల్లాలోని శ్రీకాలహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గెలిచిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ఇవి మొదటి శివరాత్రి బ్రహ్మోత్సవాలు కాబట్టి ఆయనే అన్ని తానే అయి పర్యవేక్షించుకుంటూ ముందుకు సాగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముగ్గురు మంత్రులను రప్పించి సమీక్షలు జరిపారు. ఖర్చులతో సంబంధం లేకుండా నిర్వహించుటకు నిర్ణయించారు.ఇక్కడి ఉత్సవాల్లో అగ్రతాంబూలం భోళాశంకరుడు తనకు కన్నులు అర్పించిన తిన్నడికి ఇచ్చారు.ఇది ఈ దివ్యక్షేత్రంలో ప్రసిద్ధి. ఆలయానికి తూర్పున కొండపై భక్తకన్నప్ప ఆలయ నిర్మాణం గమనిస్తే మూగజీవాలకే కాకుండా తన భక్తులకు కూడా ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో మనకు అర్థమౌతుంది.శుక్రవారం సాయంత్రం భక్త కన్నప్ప ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి.ఇందుకు అధికారులు ముస్తాబులు చేశారు. కన్నప్ప కొండను అందంగా తీర్చి దిద్దారు. నెల రోజుల నుంచి అధికారులు, సిబ్బంది రేయింబవళ్ళు తేడా లేకుండా కృషి చేసి ఏర్పాట్లు పూర్తి చేశారు.శివరాత్రికి అవసరమైన ఏర్పాట్లు అన్ని చేపట్టారు. దేశ నలుమూలలోని ప్రజా ప్రతినిధులు మంత్రులకు శాసనసభ్యుడే ఆహ్వానాలు అందించారు. స్వర్ణశోభిత ఆలయంలో బ్రహ్మోత్సవ సంబరం: దక్షిణకైలాసంగా బాలసిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం స్వర్ణశోభితంతో విరాజిల్లుతోంది.వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబం సహకారంతో ఆలయం బంగారుమయమైంది. సాధారణంగా పరమేశ్వరుడు స్మశానాధీశుడుగా విష్ణుమూర్తిని లక్ష్మినిలయుడుగా వర్ణిస్తుంటారు. శివుని ఆలయాలు సాధారణ అలంకారాలతో కనిపిస్తుంటే, వైష్ణవాలయాలు స్వర్ణకాంతులతో కనువిందు చేస్తూంటాయి. తెలుగుదేశం గతంలో నియమించిన పాలకమండలి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో దాతల సహకారంతో కైలాసనాధున్ని నిలయాన్ని స్వర్ణమయంగా మార్చారు. 2017లో మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని వాయులింగేశునిపై అచంచల భక్తిభావంతో పలువురు దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలుగా ఆలయంలో స్వర్ణతాపడం పనులను చేపట్టిరికార్డు స్థాయిలో పూర్తిచేశారు. ఆలయ శిఖరాలు సుమారు 99 కలశశిఖరాలు ఆలయపరిధిలో ఉండగా నేడు అన్నింటినీ బంగారు తాపడం చేయించి ప్రతిష్ఠింపచేశారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచే శ్రీకాళహస్తి ఆలయం స్వర్ణకాంతులతో ప్రకాశవంతమవుతూ భక్తులకు కనువిందు చేస్తోంది. అంతేకాక శ్రీకాళహస్తికే తలమానికంగా ఉండిన శ్రీకృష్ణదేవరాయలచే నిర్మించబడిన గాలిగోపురం 2010లో కుప్పకూలడంతో ప్రధానలోటుగా మారింది. అయితే నవయుగ నిర్మాణ సంస్థ ప్రతిష్టాత్మక ంగా తీసుకుని రాజగోపురాన్ని పునఃనిర్మించి కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు.ఈ ఏడాది గోపురానికి సరికొత్త అందాలను దిద్దారు. దాంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తికి తలమానికమైన గాలిగోపురం కూడా బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక కళ సంతరించుకుంది.గోపురం చుట్టూ హరితాన్ని ఆపాదించారు . ఇక ఆలయం లోపల స్వామివారి ధ్వజస్తంభానికి బంగారు తాపడం పనులు భక్తులు ఆనందపరవశులయ్యేలా చేస్తోంది. స్వామి వారి గర్భాలయమే అత్యంత విశేషమహిమాన్వితమైనది స్వామివారి ఉచ్ఛ్వాసనిశ్వాసలకు నిలయమైన వాయుదీపం చూసి భక్తులు భక్తితన్మయత్వంలో మురిసిపోతుంటారు. అలాంటి మహాభాగ్యంతోపాటు శివరాత్రికి స్వామివారి పానమట్టం స్వర్ణతాపడం భక్తజనాన్ని మనోఆనందాన్ని రెట్టింపుచేయనున్నది.

**.జ్ఞానాంబిక-స్వర్ణాంభికః** శ్రీకాళహస్తి ఆలయంలో కొలువుదీరిన దేవేరి జ్ఞానప్రసూనాంబికాదేవి స్వర్ణతేజోమయంతో వెలిగిపోతోంది. దేవేరి జ్ఞానాన్ని అనుగ్రహించే మాతగా సకల కోరికలను తీర్చే కల్పవల్లిగా భాసిల్లుతోంది. అలాంటి అమ్మవారి నిలయం మహాశివరాత్రికి స్వర్ణశోభితంతో భక్తజనాలకు కనువిందు చేస్తోంది. పాలకుల విశేషకృషితో అమ్మవారి నిలయాన్ని బంగారు తేజోమయంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ముఖమండపాన్ని బంగారు తాపడం చేయించారు.దీంతో దేవేరి నిలయం స్వర్ణశోభితంగా మారింది. అంతేకాక అమ మ్మవారి మకరతోరణం కూడా దాత ముందుకు వచ్చి స్వర్ణతాపడం చేయించడంతో గర్భాలయంలో దేవేరి అటు నిత్యాలంకరణలో బంగారు చీర,

వజ్రకిరీటం, బంగారు మకరతోరణంతో జ్ఞానాంబిక స్వర్ణాంభికగా భక్తులకు దర్శనమిస్తోంది. ఇలా ఆలయంలో ప్రధానమైన కలశాలు, ధ్వజస్తంభం, అమ్మవారి గర్భాలయం స్వర్ణశోభితంగా మారి శ్మశానాధీశుని నిలయం స్వర్ణతేజో నిలయంగా మారి శివరాత్రికి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో తేలియాడేలా చేస్తోంది. రేపటి నుండి ప్రారంభమౌతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సంబరాల్లో భక్తజనాలను స్వర్ణాలయం విశేషంగా ఆకర్షించనున్నది.

# గన్నవరంలో మైనర్ బాలికలు అదృశ్యం

## - 4 గంటల్లో పట్టుకున్న పోలీసులు

**గన్నవరం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఒకేసారి 5గురు మైనర్ బాలికలు అదృశ్యం కావటం కృష్ణాజిల్లాలో కలకలం సృష్టించింది. విజయవాడలోని ఓప్రయివేటు కళాశాలలో ఇంటర్ మీడియట్ ప్రధమ సంవత్సరం చదువుతున్న ఐదుగురు మైనర్ బాలికలు గురువారం ఉదయం ఒక్కసారిగా అదృశ్యం కావటంతో పోలీసువర్గాల్లో కలవరం రేకెత్తింది. వెంటనే స్పందించిన గన్నవరం సిఐ శివప్రసాద్ తన సిబ్బందితో రంగంలోకి అదృశ్యమైన విద్యార్ధినిలను నాలుగుగంటల్లో పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గన్నవరం మండలం ముస్తాబాద గ్రామానికి చెందిన నలుగురు బాలికలు కళాశాలకు బస్సులో వెళుతుంటారు. వీరితో విజయవాడ మాచవరంకు చెందిన మరో బాలిక స్నేహం చేస్తుంది. ఈనేపధ్యంలో ముస్తాబాద గ్రామానికి చెందిన ఒక బాలిక కళాశాలకు సరిగా వెళ్ళటం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈఐదుగురు స్నేహితులు ఇంటి నుండి పారిపోవాలని పధకం రూపొందించుకున్నారు. శుక్రవారం వేకువ జామున మూడుగంటల సమయంలో ఓబాలిక అదృశ్యం కావటం తల్లిదండ్రులు గుర్తించి 112కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసారు. వెంటనే స్పందించిన గన్నవరం సిఐ శివప్రసాద్ రంగంలోకి దిగి ముస్తాబాద గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈబాలిక స్నేహితులను విచారించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మిగిలిన ముగ్గురు బాలికలు ఇంటలోలేని విషయం వెలుగులోకి వచ్చింది. ఈదశలో ఓబాలిక హైదరాబాద్‌లో పరీక్షరాసేందుకు వెళుతున్నట్లు చెప్పటంతో సదరు బాలిక తండ్రి తన కుమార్తెను ఉదయం 4గంటలకు విజయ వాడలో దింపివచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడికాగా పోలీసులు శరవేగంగా విజయవాడ చేరుకుని విచారణ వేగవంతం చేసారు. ఓబాలిక వద్ద ఫోన్ ఉండటంతో ఫోన్‌లో బాలిక తల్లితో మాట్లాడించారు. ఈక్రమంలో బాలికలు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వెళుతున్నట్లు గుర్తించి ఆమార్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. బాలికలు ప్రయాణిస్తున్న రైలు పిడుగురాళ్ల వద్దకు చేరుకోగానే ఐదుగురు బాలికలను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

# జిఓ నెం.426ని సమర్ధిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగింపు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ దేవాదాయ ,ధర్మాదాయ చట్ట పరిధిలోకి వచ్చే ఆలయాల ప్రాంగణాల్లోని దుకాణాల నిర్వహణకు పిలిచే టెండర్లలో హిందూయేతరులు పాల్గొనకూడదని పేర్కొంటూ 2015 లో ఏపీ ప్రభుత్వం జారీచేసిన జీఓ నెం.426 ని సమర్ధిస్తూ హైకోర్టు 2019 సెప్టెంబరు 27న ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగిస్తూ సుప్రీంకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఎండీ రఫీ, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2020 ఫిబ్రవరి 27న జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ కేఎం జోసెఫ్‌ల నేతృత్వంలోని ధర్మాసనం, హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తర్వాత ఈ కేసు విచారణ 12 సార్లు వాయిదా పడింది. జీఓ అమలుపై సుప్రీంకోర్టు స్టే విధించిన, ఆలయాల దుకాణాల నిర్వహణలో హిందూయేతరులు పాల్గొనకుండా ఇదివరకు రెండుసార్లు టెండర్లు జారీ చేయడంతో పిటిషనర్లు కోర్టు దిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు.వాటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు కోర్టుకు క్షమాపణలు చెప్పి ఆ టెండర్లను ఉపసంహరించారు. మళ్లీ ఇప్పుడు శ్రీశైలం మరికొన్ని ఆలయాల దుకాణాల నిర్వహణకు హిందూయేతరులను మినహాయిస్తూ టెండర్లు పిలిచిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పిటిషనర్లు తాజాగా క్లారిఫికేషన్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై బుధవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓక, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టినప్పుడు ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ దేవాదాయశాఖ అధికారులు తప్పు తెలుసుకొని టెండర్లను ముందే ఉపసంహరించుకున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ రాష్ట్ర అధికారులు పదేపదే ఇలాంటి టెండర్లుజారీ చేస్తున్నారని, మూడోసారి ఇలాంటి పొరపాటు చేసినందున భవిష్యత్తులో ఇలా జరుగకుండా స్పష్టత ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరడంతో 2020 ఫిబ్రవరి 27న జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఉందని, తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అది కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన వైఎస్సార్సీ నేతలు

## - కూటమి దురుద్దేశాలు మాకు తెలుసు: ప్రతిపక్షనేత బొత్ససత్యనారాయణ



గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తున్న వైకాంగ్రెస్ పార్టీ నేతలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని శాసన మండలిలో ప్రతిపక్షనేత బొత్సా సత్యనారాయణ ఆరోపించారు.టీడీపీ ప్రభుత్వ అరాచకాలకు పాల్పడుతుంద న్నారు. తాజాగా గుంటూరు పర్యటనలో ఆయనకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏపీ ప్రభుత్వ వైఫల్యంపై వైఎస్సార్‌సీపీ నేతలు బొత్స సత్యనారాయణ,మెరుగు నాగార్జున,అంబటిరాంబాబు,కారుమూరి నాగేశ్వరరావు, మొండితోక అరుణ్‌కుమార్, వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు గురువారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ జస్టిస అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదుచేసారు.ఆయనకు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వినతి పత్రం అందించారు. అనంతరం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎంగా వైఎస్ జగన్ కు జెడ్ ఫస్ల సెక్యూరిటీ ఉంటుంది. ఆయన ఎక్కడికి వెళ్తే అక్కడ భద్రత కల్పించాలి. కానీ గుంటూరు పర్యటనలో ఒక్క కానిస్టేబుల్ కూడా కనిపించలేదు. వైఎస్ జగన్ భద్రతపై మాకు ఆందోళన ఉంది. మా ఆందోళనను గవర్నర్‌కు తెలియజేశాం. ఆయకు రక్షణ కల్పించాలని గవర్నర్‌ను కోరాం మా ఫిర్యాదుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. చట్టం తమ పని తాను చేసుకునేలా చేయాలి. కానీ కూటమి ప్రభుత్వం దురుద్దేశాలు మాకు తెలుసు. జగన్‌ను ఇబ్బందిపెట్టాలనే ఏకపక్షంగా భద్రత తగ్గిస్తున్నారు. మా హయాంలో ఎక్కడైనా భద్రత తగ్గించామా? అని కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి బొత్స నిలదీశారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్న టీడీపీ నేతలు ఇబ్బందుల్లో ఉన్న రైతులను తమ పార్టీనేత పలకరిస్తే కొత్త భాష్యాలు చెబుతున్నారన్నారు.ఎన్నికల కోడ్ అధికార పార్టీకి వర్తించదా ? అన్నారు.

# మంత్రులపైనా క్రిమినల్ కేసులు

## ఇద్దరు ఢిల్లీ మంత్రులు బిలియనీర్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీలో కొత్త సీఎంగా బాధ్యతలుచేపట్టిన రేఖాగుప్తా కేబినెట్ మంత్రులపై తీవ్రస్థాయి క్రిమినల్‌కేసులు కూడా ఉన్నాయి. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినవారిపై క్రిమినల్‌కేసులు నమోదయి ఉన్నాయి.మంత్రి ఆశిష్‌సూద్‌పై తీవ్రమైన నేరారోపణలున్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఏడిఆర్) క్రటించింది. ఎన్నికల్లో వారిచ్చిన అఫిడవిట్ల ఆధారంగానే వీటిని ప్రకటించింది. షాలిమార్‌బాగ్‌నుంచి తొలిసారి బిజెపి ఎమ్మెల్యే అయిన రేఖ గుప్తా ఢిల్లీ 9వ సీఎంగా గురువారంబాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. కేబినెట్‌మంత్రుల్లో ఇద్దరు బిలియనీర్లు ఉన్నారు. రాజౌరి గార్డెన్‌నియోజకవర్గంనుంచి బిజెపి ఎమ్మెల్యే మంజీందర్‌సింగ్ సిర్సాకు 248.85 కోట్ల ఆస్తులున్నాయి. కరావాల్ నగర్‌నియోజకవర్గానికి చెందిన మంత్రి కపిల్‌మిశ్రా అతితక్కువగా 1.06 కోట్లఆస్తులుప్రకటించారు. ఏడుగురు మంత్రుల సగటు ఆస్తులు రూ.56.03 కోట్లుగా ఉంది. న్యూఢిల్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం తనకు అత్యధికంగా రూ.74.36 కోట్ల అప్పులున్నట్లు చెప్పారు. ఏడుగురు మంత్రుల్లో ఆరుగురు గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువస్థాయి విద్యార్హతలున్నఆరు అయితేఒక మంత్రి మాత్రం 12వ తరగతి మాత్రమే పూర్తిచేసారు.

# నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రిజర్వే షన్లపై మాట్లాడిన కేసులో కోర్టుకు రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజర య్యారు. ఎన్నికల ప్రచార సమయంలో రేవంత్‌రెడ్డిపై బేగంబజార్ పీఎస్‌లో, నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో, మెదక్ జిల్లా కౌడిపల్లి పీఎస్ పరిధిలో మొత్తం 3 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభు త్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ వైస్‌ఛైర్మన్ తిరుపతి వర్మ అన్నారు. తదుపరి విచారణను ప్రజాప్రతినిధుల కోర్టు వచ్చే నెల 23కి వాయిదా వేసింది.

# ఎఐజి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్న మాజీ సిఎం కెసిఆర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం కెసిఆర్ తన సతీమణి శోభతో కలిసి ఏఐజీ ఆసుపత్రికి వచ్చి పలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కెసిఆర్ తిరిగి తన ఇంటికి వెళ్లిపోయారు. ఆసుపత్రికి వచ్చిన కెసిఆర్ ఆరోగ్యంపై పూర్తివివరాలు సేకరించిన ఆసుపత్రి డాక్టర్లు అవసరమైన పరీక్షలు నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ అధినేత తన ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో కాలుజారి పడిపోవడంతో తుంటిఎముక విరిగి గాయ పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు తుంటి ఎముక శస్త్రచికిత్స చేయిం చుకున్న కెసిఆర్ కొన్ని నెలలుగా తన ఫాంహౌజ్‌లోనే విశ్రాంతి తీసుకుం టున్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాక్రమాలపై ఫాంహౌజ్ నుంచే పర్య వేక్షించడంతోపాటు ఫాంహౌజ్ కేంద్రంగా పార్టీ నేతలతో సమావే శమవుతున్నారు. కాగా కొన్నినెలల అనంతరం ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చిన కెసిఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ 25 వసంతాల వేడుకలో పాల్గొని కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాగా గురువారం కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వచ్చినట్లు తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందగా, సాధారణ వైద్య పరీక్షల కోసమే కెసిఆర్ ఏఐజీ ఆసుపత్రికి వెళ్లినట్లు బిఆర్ఎస్ వర్గాలు ప్రకటించాయి. కాగా తన మనవడు, మాజీమంత్రి కెటిఆర్ కుమారుడు హిమాన్షును చూసేందుకు కెసిఆర్ త్వరలో విదేశాలకు వెళ్లనున్నారని, అందులో భాగంగానే తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముందు జాగ్రత్త కోసం ఏఐజీ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నారని సమాచారం అందుతుంది. ఇందులో భాగంగానే కెసిఆర్ తన పాస్‌పోర్టు రిన్యూవల్ కోసం బుధవారం సికిందరాబాద్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించారని అంటున్నారు. గురువారం వైద్య పరీక్షల అనంతరం కెసిఆర్ తన కుటుంబసభ్యులతో కలిసి నందిహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లారు.

# కలుషితాహారంతో 28 మంది విద్యార్థులకు అస్వస్థత

## మూడు రోజులుగా వర్సిటీలోనే చికిత్స

## యాజమాన్యంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోల ేపల్లి సెజ్‌లోనీ ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సి టీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సంఘటన చోటుచేసుకున్నది. పోలేపల్లి సెజ్‌లోనీ ఎస్వీకేఎం ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో కలుషిత, నాణ్యతలేని ఆహారం తీసుకోవడం వల్ల సుమారు 28మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు, విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి మూడు రోజులు కావడంతో సమాచారం బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. యూనివర్సిటీలోనే బెడ్లపై, మంచాలు వేసి సెలైన్లు పెట్టి చికిత్స అందిస్తూ వచ్చారు. విషయం బయటకు వస్తే తమ యూనివర్సిటీకి చెడ్డపేరు వస్తుందని గుట్టుగా చికిత్స అందించారు. ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హుటా హుటీగా యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ యాజమాన్యానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఫైర్ అయ్యారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని యూనివర్సిటీ యాజమాన్యానికి సూచించారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి స్పందించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. యూనివర్సిటీలోనే ఆహారం కల్తీ జరగడం విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. యాజమాన్యం మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

## 300 కిలోల సరకు, కంటైనర్ వ్యాను స్వాధీనం

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** డ్రగ్స్‌విక్రేతను పట్టు కున్న ఎస్ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడి నుంచి 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర పూణెకి చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. విలాసాలకు అలవాటు పడిన నిందితుడు సులు వుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణా మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో అరకు నుంచి మహారాష్ట్రకు డిసిఎం కంటైనర్ వ్యానులో స్క్రాప్ మధ్యలో గంజాయిని తరలిస్తుండగా... విశ్వ సనీయ సమాచారం మేరకు మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు అబ్దుల్లా పూర్‌మెట్ పోలీసుల సహకారంతో రామోజీ ఫిల్మ్‌సిటీ వద్ద డీసీఎం కంటైనర్ వాహనాన్ని(ఎంహెచ్ 16 సీడీ 2076)పట్టుకుని తనిఖీ చేసి గంజాయిను గుర్తించారు.

# అమృత తుల్యమైన మన తెలుగును కాపాడుకుందాం

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మనం తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మనకు అలవడే భాష మాతృభాష, ఇదే మన అస్తిత్వం, ఇదే మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భాష, సంస్కృతులకు అవినాభావ సంబంధముందని, భాష మన సంస్కృతికి జీవనాడి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతమైన సంస్కృతి, ఉన్నతమైన సమాజానికి బాటలు వేస్తుందన్నారు. భారతదేశపు భాషా వైవిధ్యతే, మన గొప్ప నాగరికతకు పునాది. మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, కళలు, పండుగలు, పబ్బాలు, వ్యాపార సంబంధాలు భాష లేకుండా పెంపొందలేవు అన్నారు. వీటన్నింటినీ కాపాడుకుని భవిష్యత్ తరాలకు అనుగుణంగా పరిస్థితులు కల్పించాలంటే మన మాతృభాషను మనం కాపాడుకోవాలని అన్నారు. మన దైనందిన జీవితంలో మాతృభాష వినియోగం పెరగాలన్నారు. మన మాతృభాష అయిన తెలుగు ప్రాశస్తం గురించి ఎంత చెప్పినా తక్కువే. మన భాష చాలా గొప్పది. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని కృష్ణ దేవరాయలు అన్నా, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా ప్రశంసలందుకున్నా విశ్వనాథ సత్యనారాయణ అమర భాష అని కీర్తించినా సినారె, శ్రీశ్రీ వంటి ప్రముఖులెందరో తమ జీవిత సర్వస్వం తెలుగే అని ఎలుగెత్తి చాటినా తమిళ కవి సుబ్రమణ్య భారతి, తెలుగు వంటి సుందరమైన భాష మరొకటి లేదని పొగడినా, నికొలో కోంటీ, అబ్దుల్ అల్ హసన్ బహమనీ వంటి విదేశీయులు, తెలుగును స్వర్గపు భాషగా పేర్కొన్నా ఇదంతా తెలుగు భాష గొప్పదనమే అన్నారు. ఎన్నో యాసలు, మరెన్నో మాండలికాలు. ఒక్కో దాంట్లో, ఒక్కో అందమైన భావన అన్నారు. ఇవేవీ ఇతర భాషల్లో అంతగా కనిపించవు అన్నారు. అవధానం వంటి అద్భుతమైన ప్రక్రియ ఒక్క తెలుగు భాషకే సాధ్యం అన్నారు. ఇదీ మన తెలుగుభాష గొప్పదనం. అందుకే మన అమృతపు భాషను కాపాడుకోవడానికి మనమంతా పునరంకితం అవుదామని కేంద్ర మంత్రి అన్నారు.

# ఎన్నికల్లో ఓడిపోతే నా పరిస్థితి ఘోరంగా మారేది!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అధ్యక్ష న్నికల్లో ఓటమి పాలయి ఉంటే తన జీవితం మరింత దారుణంగా ఉండేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అన్నారు. గత ప్రభుత్వం తనతో అత్యంత దారుణంగా వ్యవహరించిందని ఆరోపించారు. మియామిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన జీవితం చాలాఘోరంగా మారిపోయేదని అన్నారు. న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ జీవితంగడిసపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమి పాలయితే తర్వాత పోటీచేసేందుకు చాలా ధైర్యం అవసరం అయ్యేదన్నారు. గత ప్రభుత్వం తనపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందంటూ ఆరోపించారు. 2024లో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్‌పై ట్రంప్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు ముందు ట్రంప్ పోర్న్‌స్టార్‌కు హష్‌మనీ కేసుతో సహా పలు క్రిమినల్, సివిల్‌కేసులు ఎదుర్కొన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన అనంతరం ఆయనపై ఉన్న రెండు ఫెడరల్‌కేసులనుంచి ఊరట లభించింది. హష్‌మనీకేసులో న్యూయార్క్ న్యాయమూర్తి షరతులులేని డిశ్చార్జిని వర్తింపచేసారు.

21-2P g7exHMNWJQE111.qxd:21-2P g7exHMNWJQE.qxd 01/01/01 10:14 AM Page 1



# ముగిసిన పెద్దగట్టు జాతర

### సూర్యాపేటకు చేరిన మకర తోరణం
### స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పూజారులు
### చివరిరోజు కూడా దైవదర్శనం చేసుకున్న భక్తులు
### హుండీలోని కానుకల లెక్కింపు





**ప్రభాతవార్త, నడిగూడెం(సూర్యాపేట):** సూర్యాపేట జిల్లా దురాజ్పల్లిలో జరిగిన పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. ఈనెల 16న జాతర గంపల ప్రదక్షణతో ప్రారంభించారు. రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 5వ రోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. లక్షలాదిమంది భక్తులు పెద్దగట్టుకు వచ్చి లింగమంతుల స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా సూర్యాపేట యాదవ బజార్ నుండి పెద్దగట్టుకు తెచ్చిన మకర తోరణాన్ని తిరిగి స్వస్థలానికి చేర్చారు. దీంతో జాతర ముగిసిందని యాదవ పూజారులు పేర్కొన్నారు. నాలుగో రోజు నెలవారం సందర్భంగా చౌడమ్మ లింగమంతుల విగ్రహాలు ఉన్న దేవర పెట్టెను తీసుకొని మెంత బోయిన గొర్ల వంశీయులు సూర్యాపేట మండలం కేసారం వెళ్లారు. చివరి రోజు మకర తోరణాన్ని సూర్యాపేటకు చెందిన వల్లపు కోడి వంశస్థులు స్వామివారికి ధరింపజేసిన మకర తోరణాన్ని తిరిగి స్వస్థలానికి తరలించి జాతర ముగిసినట్టుగా పేర్కొన్నారు. హుండీలో వేసిన కానుకలను గురువారం ఉదయం నుండి లెక్కిస్తున్నారు. ఉండే ఆదాయం ఎంత వచ్చిందో తెలియాలంటే కొంత సమయం పట్టనుంది. లెక్కింపు కొనసాగుతుంది. అధికార యంత్రాంగం, పోలీసు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించి జాతరను విజయవంతం చేశారు. ఎక్కడ కూడా జాతీయ రహదారి 65 ట్రాఫిక్ జామ్ కాకుండా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. పెద్దగా దొంగతనాలు జరిగిన దాఖలాలు లేవు. పలువురు తప్పిపోగా వెంటనే గుర్తించి సంబంధించిన వారికి అప్పగించారు. జాతీయ రహదారిపై వాహనాలను మళ్లించే విషయంలో కూడా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. మేరకు ఐజి సత్యనారాయణ ఎస్పి, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

పెద్దగట్టును సందర్శించిన ఐజి పోలీసులు నిర్వహిస్తున్న విధులను ప్రత్యేకంగా పరిశీలించి అభినందించిన సంగతి తెలిసిందే. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు సలహాలు ఇస్తూ విజయవంతంగా జాతర ముగిసేలా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ సిబ్బంది షిఫ్టులవారీగా పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూశారు. సౌకర్యాలు కల్పించడంలో కూడా సూర్యాపేట మున్సిపల్ అధికారులు యంత్రాంగము సఫలీకృతమయ్యారు. ఐదు రోజులపాటు జాతర నిర్వహించగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. దీన్నిబట్టే అధికార యంత్రాంగము ఎంత పకడ్బందీగా విధులను నిర్వహించి జాతరను విజయవంతం చేసిందో అర్థమవుతుంది. గురువారం టిఎస్పిఎస్సి సభ్యురాలు పాల్వాయి రజిని కుమారి జాతరను సందర్శించి స్వామి వారిని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చివరి రోజు జాతరకొచ్చిన భక్తులంతా ఇంటి ముఖం పట్టారు.

## ముస్లింల పక్షపాతి సీఎం చంద్రబాబు

**- ఇమామ్‌లు, మోజన్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం**

**-సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మెహమ్మద్ నసీర్ అహ్మద్ , ముస్లిం నాయకులు**

**గుంటూరు తూర్పు, ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు దిశగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఇందులో భాగంగా ఇమామ్ లు, మోజన్లకు గౌరవ వేతనం విడుదల చేశారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మెహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. రాష్ట్రంలోని ఇమామ్ లు,



మోజన్లకు గౌరవ వేతనం విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞత సభ మరియు ప్రత్యేక దువ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని అన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి మొదటి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేశారని తెలిపారు. రాష్ట్రంలో ఐదు వేల మసీదుల్లో ఇమామ్ లకు రూ.10 వేలు, మోజన్లకు రూ.5 వేలు ఇచ్చేందుకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం అమలు చేస్తున్నారని, ఇది ముస్లింల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన కేవలం ఎనిమిది నెలల కాలంలోనే ఇమామ్ లు, మోజన్ల ఆరు నెలల గౌరవ వేతనం రూ.45 కోట్లు విడుదల చేయడం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లింలకు రంజాన్ తోఫా వంటి కానుకలు అందించారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ముస్లింలకు మొండి చెయ్యి చూపారని విమర్శించారు. ఇమామ్ లకు, మోజన్లకు గౌరవ వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని, మైనారిటీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించకుండా మాయమాటలు చెప్పి మభ్యపెట్టి మోసం చేశారని మండిపడ్డారు. మళ్లీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ముస్లింలకు పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, మైనారిటీ నాయకులు చిష్టి, జమీర్, హఫీజ్, రఫీ, అన్వర్, భాషి, జాబి, ఉస్మాన్, అబ్దుల్లా, నూర్, ఖలీల్, అబ్బాస్, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## డీసిల్టింగ్ ప్రక్రియ నిరంతరం జరుగుతూ ఉండాలి : కమిషనరుధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** వర్షాలు పడినప్పుడు రోడ్డుపై నీరు నిలువకుండా ఉండేందుకు నగరంలో నిరంతరం డీసిల్టింగ్ ప్రక్రియ జరుగుతూ ఉండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన తన పర్యటనలో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం రోడ్డు,ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్,కోనేరు శ్రీధర్ వీధి,గురునానక్ కాలని,ఆంధ్రా లయోలా కళాశాల రోడ్డులను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర భంగా



ఆయన మాట్లాడుతూ నగరంలో డీ సిల్టింగ్ పనులు ఖచ్చితంగా జరుగుతూ ఉండాలని, వర్షాలు పడినప్పుడు నగరంలో రోడ్లపైన ఎక్కడా నీటి నిల్వలు ఉండకుండా సైడ్ కాల్వల్లోకి నీటి ప్రవాహం వెళ్ళేందుకు వీలుగా ఉండాలని, దానికి ముందస్తుగా మైనర్,మీడియం,మేజర్ డ్రైన్‌లలో డీసిల్టింగ్ పనులు చేస్తూ,నిరంతరం కాల్వలో పూడికలు తీస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రాకముందే డీ సిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తే,వర్షాకాలంలో రోడ్లపైన నీటి నిల్వలు వంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. అనంతరం కోనేరు శ్రీధర్ వీధిలో ఉన్న లక్ష్మీపతి అపా ఒపరావు సరోజినీ నగరపాలక సంస్థ పార్క్‌ను సందర్శించారు. నిర్వహణలో ఎటువంటి జాప్యం ఉండరాదని, ఇంజనీరింగ్,ప్రజారోగ్యం, ఉద్యానవన సిబ్బంది సమన్వయంగా ఉంటూ పార్క్ నిర్వహణ సక్రమంగా చేయాలని అధికారులను ఆదేశించారు. లయోలా కళాశాల రోడ్డు వద్ద గల మూడు బిన్నుల సెంటర్ లొకేషన్‌ను సందర్శించారు. మూడు రంగుల చెత్త బుట్టలను అక్కడ పెట్టి ప్రజలకు అర్థమయ్యే రీతిలో వ్యర్థాలు వేరు చేసే ప్రక్రియ,నిర్వహణ సెంటర్‌ను సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమీషనర్ ప్రభుదాస్,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇన్చార్జి చఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్,ప్రాజెక్ట్ ఆఫీసర్(యుసిడి) పి.సత్యన్నారాయణ, పి.సత్యకుమారి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,సామ్రాజ్యం, శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీనాయక్,అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## జీవవైవిధ్య సదస్సులో అందరూ భాగస్వామ్యం కావాలి

### బయోడైవర్సిటీ సదస్సులో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** దెబ్బ తింటోన్న జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా కన్హ శాంతి వనంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఏర్పాటు చేసిన నేషనల్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ 2025 పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మన పర్యావరణం, నీరు, భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు.. జీవవైవిధ్య పరిరక్షణ దిశగా సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా ఈ జీవవైవిధ్య సదస్సు ఉపయోగపడుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.విద్యార్థులు, యువ సైంటిస్టులకు జీవ వైవిధ్యం కోసం పని చేయాలన్నారు. తెలంగాణ ఎన్నో విధాలైన సహజమై ప్రాంతాలకు నెలవు, అడవులు, పచ్చిక బయళ్ళు, తడి నేలలు, వృక్షాలు, జంతువులు మన ప్రాంతంలో ఉన్నాయని జీవవైవిధ్యం పర్యావరణ సమతుల్యతను సంరక్షించడం మన బాధ్యత అని అందుకోసం సమిష్టి కృషి జరగాలని ఆకాంక్షించారు.

పపంచవ్యాప్తంగా మానవ తప్పిదం వల్ల మొక్కలు, జంతువులు అంతరించిపోయే దశలో ఉన్నాయన్న ఆమె వాటి సంరక్షణ కోసం మానవులుగా మనమే కృషి చేయాలన్నారు.ఒక జాతి అంతరిస్తే దానిలోని జన్యుసంపద అంతరించినట్లే అన్న మంత్రి జీవ వైవిధ్యపు నిజమైన విలువంతా జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుందన్నారు. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు, చాలా సంస్థలు జీవవైవిధ్య సంరక్షణ లోనూ దాన్ని ప్రతిభావవంతంగా వినియోగించడం లోనూ నిమగ్నమై ఉన్నాయన్నారు.

**మన మన్యంకొండ విడియో ఆవిష్కరణ**

మహబూబ్ నగర్ జిల్లాలో కొలువై ఉన్న మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి జాతర విశిష్టత, ప్రాశస్త్యత గురించి ప్రత్యేకంగా రూపకల్పన చేసిన వీడియోను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సమాజం ఉత్తమ విలువలతో ముందుకు సాగాలంటే, ధార్మిక చింతన కలిగించే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని ఆమె ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా దేవాదాయ శాఖ మన తెలంగాణ ఆలయాల అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.అందుకు ఆలయాల సందర్శనకు పెరుగుతున్న జన సందోహమే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.మన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నెన్నో అద్భుతమైన ఆలయాలు ఉన్నాయని, వాటి వైభవోపేతమైన చరిత్రను, స్థల పురాణాన్ని, ప్రజల విశ్వాసాలను అందరికీ చేరేలాగా ప్రచారం జరగాలని అందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అనంతరం దర్శకుడు అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంతో బిజీగా ఉన్నా ఈ వీడియో ఆవిష్కరణకి సమయం ఇచ్చి ప్రోత్సహించినందుకు ఆయన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.దేవాలయాలపై ఎంతో శ్రమకోర్చి వీడియో తీసిని శ్రీధర్ ను మంత్రి సురేఖ ప్రత్యేకంగా అభినందించి ఆయనను శాలువాతో సత్కరించారు.

## తెలంగాణలో హత్యారాజకీయాలకు తావు లేదు

### అవినీతిపై పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం
### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తెలంగాణలో హత్య రాజకీయాలకు తావు లేదని, అవినీతి మీద పోరాడే వారికి రక్షణ కల్పిస్తాం అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిఆర్ఎస్ పదేండ్లలో హత్యా రాజకీయాన్ని పెంచి పోషించిందని, బిఆర్ఎస్ దోపిడీని ప్రశ్నించిన రాజలింగాన్ని హత్య చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్‌తో పాటు ఐదుగురుపై సామాజిక కార్యకర్త రాజలింగం కోర్టులో కేసు వేశాడన్నారు. ఈ నేపథ్యంలో గండ్ర వెంకట రమణారెడ్డి హత్య చే యించాడన్నారు. కాళేశ్వరంలో కెసిఆర్‌కు దోషిగా శిక్ష పడుతుందని కెసిఆర్, కెటిఆర్‌లు హత్య చేయించారని రాజలింగమూర్తి కూతురు, భార్య చెప్తుందన్నారు. అడ్వకేట్ వామనరావు భార్యభర్తల హత్యకు ఎవరు కారణమో అందరికి తెలుసునన్నారు. వరంగల్‌లో ఎంపిడిఓను హత్య బిఆర్ఎస్ వాళ్ళు చేశారని అప్పటి సిపి రంగనాథ్ చెప్పారన్నారు. కొడంగల్‌లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌పై కూడా సురేష్ అనే రౌడీ షీటర్ దాడి చేశారన్నారు. తెలంగాణలో అభివృద్ధి జరగొద్దు అనేది బిఆర్ఎస్ లక్ష్యం అన్నారు. కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ తగ్గిందని అంటుండని, హత్య రాజకీయాలు చేయడమేనా మీ గ్రాఫ్ కెసిఆర్? కెసిఆర్ కిరాయి హత్యలు చేయించడమే తప్ప కెసిఆర్‌తో ఏమి కాదు అన్నారు. 15నెలల నుండి ఫాంహౌస్ నుండి ఎప్పుడైనా బయటకి వచ్చిండా? అన్నారు. రాజలింగమూర్తి హత్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరుతున్నామన్నారు. హత్యలో కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు, గండ్ర వెంకటరమణ రెడ్డి పాత్ర ఉందన్నారు. సిబిసిఐడి విచారణ చేసి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి వెంటనే శిక్ష వేయాలన్నారు. హత్యను సిఎం రేవంత్‌రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకుంటాడని అన్నారు. లగచర్లలో కూడా కలెక్టర్‌ను చంపాలని చూసిండని, తెలంగాణను దోచుకొని తిని ఎదురు తిరిగిన వాళ్ళను చంపేస్తారా? పాపం తగిలి పోతారన్నారు.

## విజ్ఞాన జ్యోతిపై శిక్షణ

**నందిగామ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** విద్యా రంగంలో నాణ్యత పెంచటానికి ప్రభుత్వం అంగన్వాడీ ప్రీ స్కూల్ విద్యార్థులకు విద్యార్థులకు సులభతరంగా బోధించేందుకు ప్రభుత్వం సపోర్టింగ్ ఆంధ్రస్ లెర్నింగ్ ట్రాన్స్ఫ ర్మేషన్ పథకంపై నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో నంది గామ మండల అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షనా తరగతులు గురువారం ముగిశాయి. మొదటి విడత



శిక్షనా తరగతుల్లో డిస్టిక్ రిసోర్స్ పర్సన్స్ డివి రాజ్యలక్ష్మి షేక్ మౌలాలి, వెంకటరావమ్మ శ్రీదేవి లు విజ్ఞాన జ్యోతి కోర్సులు అంగన్వాడీ వర్కర్స్ అంగనవాడి టీచర్లగా ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేస్తారని వారు ప్రీ స్కూల్ విద్యార్థులు సులభతరంగా బోధన అభ్యాసన చేసేందుకు సంబంధించి విద్యార్థులు అభ్యాసన ఫలితాలు బోధనా పద్ధతులను మెరుగుపరచడం, విద్యా రంగంలో నాణ్యత పెంచడం, పునాది అభ్యాసనాన్ని బలోపేతం చేయటం, ఉపాధ్యాయ విద్యార్థుల మధ్య సంబంధాలను మెరుగుపరచడం సంస్థాగత సామర్థ్యాలను సామాజిక సంస్థల ప్రమేయాన్ని బలోపేతం చేయటం విద్యార్థులకు బొమ్మల ద్వారా బోధన సులభముగా అర్థమయ్యే విధంగా పను అంశాలపై శిక్షనా తరగతులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతులు నందిగామ మండల అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం కొత్త చెరువులో అక్రమ గ్రావెల్ రవాణా

### పట్టించుకోని ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు శాఖ

**ఎ కొండూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం రామచంద్రాపురం కొత్త చెరువు నుండి గత 4రోజులు అక్రమ గ్రావెల్ రవాణా జరుగుతున్నా సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ పోలీస్ శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉదాసీన వైఖరి అవలంభిస్తుండటం పట్ల రామచంద్రాపురం కోమటికుంట లక్ష్మీపురం గ్రామాల ప్రజలు రైతులు విమర్శిస్తున్నారు. ఈ రామచంద్రాపురం కొత్త చెరువు నుండి అక్రమంగా రవాణా చేస్తున్న మట్టి ట్రాక్టర్ రూ.700లకు విక్రయించి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో కొందరు వ్యాపారంగా మార్చుకుని ఈ దందాను కొనసాగిస్తున్నారు. పలువురు ప్రజలు రైతులు ఆరోపించారు. ఈ కొత్త చెరువు నుండి మైలవరం మండలం బాడవ ఎన్‌హెచ్-30 టోల్‌ప్లాజా సమీపంలో కొందరికి ఈ అక్రమ మట్టి రవాణాకు సన్నాహాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఈ అక్రమ మట్టి దందా రవాణాను వెంటనే అరికట్టాలని ప్రజలు రైతులు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థి పోరాటాలు మార్గదర్శకం కావాలి




కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ. హరగోపాల్, ప్రొ. జగన్ సింగ్ తదితరులు

### 50 యేళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమం ప్రస్థానం సదస్సులో ప్రొ.హరగోపాల్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఒక అధ్యాపకుడిగా కొనసాగుతూనే రాడికల్స్ విద్యార్థుల నుంచి ఎంతో నేర్చుకున్నానని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. మొదటి రోజు సభలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాడికల్స్ విద్యార్థులు తన విద్యార్థులని చెప్పేందుకు చాలా గర్వంగా ఉందన్నారు. అధ్యాపక జీవితంలో మధురమైన క్షణాలు ఉన్నాయంటే అవి విద్యార్థులు చేసిన పోరాటాలన్నారు. వాళ్ళంతా వివిధ అంశాలపట్ల కూడా అపరిమిత జ్ఞానాన్ని కలిగిగి ఉండేవారన్నారు. త్యాగాలు చేసేవాళ్ళు భవిష్యత్తు తరంకోసమే చేస్తారన్నారు. భగత్‌సింగ్ జ్ఞాపకాలను పదిలం చేస్తూ ఆయన మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్‌సింగ్ గ్రంథా లయాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో 70, 80ల కాలం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జగన్ సింగ్ మాట్లాడుతూ నేడు దేశంలోని బి జె పి పాలనలో ప్రజలకు మేలు జరగడం లేదని, ఫలితంగా దోపిడీ హింస దౌర్జన్యాలు పెరుగుతున్నాయన్నారు. ఇవి నిర్మూలించాలంటే సమాజంలో విప్లవం రావాల్సిన అవసరంతో పాటు ఐక్య ఉద్యమాలు అవసరమన్నారు. 1920లో దేశంలో ఎటువంటి ఆర్థిక సంక్షోభం ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొందని, నాడు భగత్ సింగ్ విప్లవోద్యమాలను నిర్మించి దేశాన్ని సమర్థం చేశారని, అలాగే రాడికల్ స్టూడెంట్స్ కూడా ఉద్యమాలు నిర్మించి ప్రజలను జాగృతం చేశారన్నారు. నాటి విద్యార్థి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని నేడు వాటిని ముందుకు తీసుకుపోవాలని సూరపనేని జనార్ధన్ సోదరుడు మోహన్ రావు అన్నారు. ఆర్ఎస్‌యు విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే నేను మార్క్సిజాన్ని చదువుకున్నానని ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. 80వ దశకంలో తరగతి గదిలో విద్యార్థులకు ప్రొఫెసర్లకు మధ్య చర్చ జరిగేదని, ఇప్పుడు అలాంటి వాతావరణం లేదని అన్నారు. నాటి విద్యార్థులు విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసేవారన్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదన్నారు. విలువలు మృగ్యమైన ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలను నిలబెట్టడం ఎలా అనేది మన ముందున్న ప్రశ్న అని అన్నారు. అంతకు ముందు అమరవీరుల జెండాను పులి అంజయ్య మాతృమూర్తి సోమ నరసమ్మ, స్థూపాన్ని ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్) సహచరి పద్మ ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం ఎదుట విద్యార్థి అమరులకు పూర్వ విద్యార్థులు, పలువురు ప్రజా సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం, విప్లవ విద్యార్థి అమరులకు జోహార్లు, జోహార్ అంటూ విప్లవగేయాలు, నినాదాలతో సుందరయ్య విజ్ఞానకేంద్రం మారుమ్రోగింది.

## పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

**-నగర కమిషనరు పులి శ్రీనివాసులు**

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే పనులను ప్రాధాన్యత క్రమంలో నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేసేలా ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలని నగర



కమిషనర్ పులి శ్రీని వాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. గురువారం కమీషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా సంగడిగుంట, ఎల్ఎల్ఆర్, పాత గుంటూరు, గణేష్ నగర్ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణ సమయాల్లోనే స్థానిక వార్డ్ సచివాలయ ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలను గుర్తిస్తే సంబందిత కార్యదర్శులు, ఏఈలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎల్ఎల్ఆర్ ని పరిశీలించి, త్రాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, రిజర్వాయర్లలో త్రాగునీటి సరఫరా చేయు సమయంలో క్లోరిన్ తనిఖీలు చేయాలన్నారు. త్రాగు నీరు సరఫరా సమయంలో వార్డుల్లో పర్యటిస్తూ నీటి నాణ్యతను పరిశీలించాలని, ఎక్కడైనా పైపు లైన్ల లీకులు గమనిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేసి లీకులకు వెంటనే మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో పారిశుధ్యం, ఖాళీ స్థలాల సమస్యలపై ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్ వి ఎస్ సుబ్బారావు చౌదరి గుంటూరు ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివి

**- జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ**

**గుంటూరు కార్పొరేషన్ ఫిబ్రవరి, 20 ప్రభాతవార్త :** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి సూపరింటెండెంట్ గా, గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గా, ఒక సర్జన్ గా ఎన్వీ సుబ్బారావు చౌదరి గుంటూరు ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివి అని జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ పేర్కొన్నారు. గురువారం ఎన్ వి ఎస్ చౌదరి సంస్మరణ సభను స్థానిక సుశృతా హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్



ఎన్ వి ఎస్ చౌదరి సర్జన్ గా, ఒక ఉపాధ్యాయునిగా అందించిన సేవలు మరువలేనివి అని ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఎంతో మంది సర్జన్స్ కు ఆయన విద్య నేర్పడానికి కళాశాల, ఆసుపత్రి అభివృద్ధికి ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళాయి అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఆయన ఒక సర్జన్ గా స్ఫూర్తిని ఇచ్చిన వారిలో ఎన్ వి ఎస్ ఒకరు అని వారు తుది శ్వాస విడిచినా వారి ఆత్మ ఈ పరిసరాల్లోనే తిరుగుతూ ఉంటుంది అని అలాంటి వ్యక్తి ఆత్మకు శాంతి కాకుండా మరో జన్మ తీసుకొని వారిలాంటి వారు ఇంకొకరు ఈ సమాజానికి అవసరం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమా జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ సుధాకర్, ఎన్ వి ఎస్ కుమారులు డాక్టర్ ఎన్ వి ఎస్ ప్రసాద్ (యు ఎస్ ఏ) వి ఎస్ ప్రసాద్, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

21-02pg10exHMNWJQE.qxd:21-02pg10exHMNWJQE.qxd 01/01/01 8:27 AM Page 1



## ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..
# హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ విజయం
### 2-1 తేడాతో రాజస్థాన్ యునైటెడ్ ఓటమి

**ఢిల్లీ:** ఐ-లీగ్ జాతీయ ఫుట్బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్బాల్ క్లబ్ (ఎఫ్సీ) జట్టు ఐదో విజయం నమోదు చేసింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ 2-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్సీ జట్టును ఓడించింది. 10 మ్యాచ్‌ల తర్వాత రాజస్తాన్ జట్టుకు ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలియన్ (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మైకోల్ కబ్రెరా (75వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈనెల 25న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఈ ఐ-లీగ్‌లో 15 మ్యాచ్ పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో ఎనిమిదోస్థానంలో ఉంది.



## జాతీయ పారా అథ్లెట్‌లో..
# తెలంగాణ అమ్మాయికి స్వర్ణం




**న్యూఢిల్లీ:** జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, అంతర్జాతీయ పారాథ్లెట్ జివాంజి దీప్తి 400 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది.
దీప్తి అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 57.82 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. హర్యానాకు చెందిన పూజా 1:08.21 సెకెన్లలో గమ్యాన్ని చేరుకుని రజతం సొంతం చేసుకోగా, హర్యానాకే చెందిన భువి అగర్వాల్ కాంస్యం దక్కించుకుంది.




## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విక్టరీ
### 7 వికెట్ల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీ20 టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. అనాబెల్ సదర్లాండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఢిల్లీ ప్లేయర్లలో ఓపెనర్ కిరణ్ నవగిరె (27 బంతుల్లో 51; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందివ్వగా, శ్వేత సెహ్రావత్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) హెన్రీ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (49 బంతుల్లో 69; 12 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అనాబెల్ (41 నాటౌట్; 4 ఫోర్లు), మరిజాన్ కాప్ (29 నాటౌట్; 4 ఫోర్లు), షఫాలీ వర్మ (26; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫియా, దీప్తి శర్మ, గ్రేస్ హ్యారిస్ తలా ఒక వికెట్ తీశారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో డేంజరస్ టీమ్
## టీమిండియాకు టెర్రర్
### మూడో మ్యాచ్‌కు ఇబ్బందులు

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు ఇబ్బందులు మూడో మ్యాచ్ నుంచి ఎదురుకానున్నాయి. టోర్నీ మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టుతో తలపడేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐసీసీ ఈవెంట్లలో భారత జట్టుకు కివీస్ పెద్ద తలనొప్పిలా మారింది. ఎల్లప్పుడూ టీమిండియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఈసారి భారత్, న్యూజిలాండ్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ నెల 23 ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు జట్లు తలపడనున్నాయి. గత ఎడిషన్‌లో, భారత జట్టు తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. కానీ, చివరికి పాకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. మరోవైపు, న్యూజిలాండ్ తమ గ్రూప్‌లో చివరి స్థానంలో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. అయితే, రాబోయే ఎడిషన్‌లో టోర్నమెంట్ గెలవడానికి భారత్, న్యూజిలాండ్ రెండూ ఫేవరెట్‌లలో ఉన్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి భారతదేశం సిద్ధమవుతుండగా, న్యూజిలాండ్‌ను చూసి టీం ఇండియా కాస్తంత భయపడుతోంది. ఐసీసీ ఏ ఈవెంట్‌లోనైనా నాకౌట్ మ్యాచ్‌లలో న్యూజిలాండ్ ఎల్లప్పుడూ భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుంది. 2000 సంవత్సరంలో, కివీస్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌ను ఓడించింది. సెమీఫైనల్స్ లో 2019 ప్రపంచ కప్ నుంచి భారత జట్టును ఓడించింది. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 78 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 305 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో సులభంగా ఓడించింది. చివరికి పాకిస్తాన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్ ఫామ్‌ను కనుగొంది. ట్రైసిరీస్‌లో, అనేక మంది కివీస్ బ్యాట్స్‌మెన్స్ ఫామ్‌ను కనుగొన్నారు. ఐసీసీ ఈవెంట్‌లోకి వెళ్లే ముందు పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. ఈ టోర్నమెంట్‌లో కేన్ విలియమ్సన్ మూడు ఇన్నింగ్స్‌లలో 112.50 సగటుతో 225 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్ (మూడు మ్యాచ్‌ల్లో 154 పరుగులు), డారిల్ మిచెల్ (మూడు మ్యాచ్‌ల్లో 148 పరుగులు), డెవాన్ కాన్వే (రెండు మ్యాచ్‌ల్లో 145 పరుగులు) వంటి బ్యాట్స్‌మెన్ కూడా పరుగుల స్కోరు చేసిన వారిలో ఉన్నారు.




## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో..
# బోపన్న జోడీ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్జెస్ (పోర్చుగల్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. దోహాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బోర్జెస్ ద్వయం 7-6 (7/2), 7-6 (7/4)తో రెండో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జంటను బోల్తా కొట్టించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఏడు ఏస్లు సంధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో ట్రైబ్రేక్‌లు అనివార్యమయ్యాయి. ట్రైబ్రేక్స్‌లో బోపన్న-బోర్జెస్ పైచేయి సాధించి విజయాన్ని అందుకోవడంతో పాటు, క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నారు.

ఆట




## హాకీ ప్రొ లీగ్‌లో..
# భారత్ పురుషుల జట్టు సంచలనం
### వరల్డ్ ఛాంపియన్ జర్మనీపై 1-0తో గెలుపు
### స్పెయిన్ చేతిలో భారత్ మహిళల టీం ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ రెండో మ్యాచ్‌లో టీమిండియా 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వచ్చిన భారత్ చివరకు విజయాన్ని ఖరారు చేసుకుంది.
అంతకు ముందు జర్మనీతో జరిగిన రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో భారత్ 1-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు భారత మహిళల జట్టుకు మరో ఓటమి ఎదురైంది. స్పెయిన్ జట్టుతో జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-1తో ఓడిపోయింది.
స్పెయిన్ తరఫున సెగూ మార్టా (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది.

# చదువు మానేయాలన్న నిర్ణయం బాధించింది: బిల్ గేట్స్




వాణిజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాప కుడు బిల్ గేట్స్ (బిల్ గేట్స్) తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విష యాలు. హార్వ యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్న పుడు చాలా బాధపడినట్లు చెప్పా రు. సోర్స్ కోడ్ మై బిగినింగ్స్ పేరుతో తాను తీసుకొచ్చిన పుస్తకంలో ఆసక్తికర విషయా లన్నీ తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని, ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించేవాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లు చర్చించేవాళ్లం అని గేట్స్ అన్నారు. 1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూని వర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్ గేట్స్ ఏర్పాటు చేసింది. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించింది. డిగ్రీ పూర్తిచేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించింది. అయితే వచ్చిన అందిపుచ్చు కొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్‌అలెన్ను, కళాశాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ చెప్పారు. ఆసమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్లు మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ కోసం ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేయడానికి మరో స్నేహితుడు, మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానే యాల్సి వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉంటే, సోర్స్ కోడ్ పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్ 1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్ ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు చోటు కల్పించలేదు. భవిష్యత్తులో విడు దల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశం ఉంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సిఇఒగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.

# పిఎన్‌బి వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా, ఇప్పుడు మరో ప్రభుత్వ రంగ పిఎన్‌జి కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహరుణాలతో పాటు, కారు ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సరవణతో పిఎన్‌బిలో గృహరుణాల ప్రారంభ రేటు 8.15 శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఇఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇక ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ట వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పిఎన్‌బి తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీరేటు 11.25 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రేపో రేటును 6.50శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు 6.25 శాతానికి తగ్గించిన విషయం విదితమే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గత వారం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బిఐ 25బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.




# గూగుల్ పేలోనూ ఇక ఛార్జీల మోత!

**ముంబై, ఫిబ్రవరి 20:** గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే (గూగుల్ పే) విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇక నుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామైన పేటీఎం, ఫోన్‌పేలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తుండగా, ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో వసూలు చేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు సూచిస్తున్నాయి. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్నియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పేమెంట్ వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్‌లు ఉన్నాయి. అయితే ఒప్పందం గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. పే గూగుల్ వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేయడానికి ఈ రుసుము సాయపడుతుందని, ఇప్పటికే అనేక ఫిన్టెక్, క్విక్కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతి కూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐటిసి, మారుతి సుజుకి షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. చివరికి సెన్సెక్స్ 203.22 పాయింట్లు క్షీణించి 75,735.96 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 19.75 పాయింట్లు నష్టపోయి 22,913.15 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.65గాఉంది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, హెచ్‌సి ఎల్ టెక్నాలజీస్, ఐటిసి వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్‌టిపిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగా రం ఔన్సు 2971 డాలర్ల వద్ద ట్రేడ యింది.








Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14